www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 58 | గురువారం | 17 ఆగస్టు, 2017

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

న్యాయ వివాదాలకు తావు ఇవ్వొద్దు



84వేల ఉద్యోగాల నోటిఫికేషన్ల జారీలో జాగ్రత్త వహించాలని అధికారులకు సిఎం ఆదేశాలు

- ముందే న్యాయ సలహా తీసుకోవాలని, శాఖల వారీగా కార్యాచరణ రూపొందించాలని సూచన
- త్వరలో గ్రూప్–1,2 ఫలితాలు
- నెల రోజుల్లో 12 వేల కొలువుల భర్తీ : టిఎస్‌పిఎస్‌సి చైర్మన్ చక్రపాణి

మన తెలంగాణ/ హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా 84 వేలకు పైగా ఉద్యోగ నియామకాలు చేపట్టాల్సి ఉన్నందున శాఖల వారీగా కార్యాచరణ రూపొందించుకొని అమలు చేయాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఘంటా చక్రపాణి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో అధికారులు కనీసం వారానికోసారి సమావేశమై ఉద్యోగ నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ, గురుకుల విద్యాసంస్థల్లోనూ వేలాది మంది ఉపాధ్యాయుల నియామకం జరపాల్సి ఉందని, దానికి సంబంధించి వెంటనే కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరిని ముఖ్యమంత్రి ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సిఎం కెసిఆర్ నియామకాలపై కీలక ప్రకటన చేశారు. బుధవారం నాడు ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఘంటా చక్రపాణి, సిఎస్ ఎస్‌పి సింగ్ తదితరులతో ఆయన మాట్లాడారు. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా ఖాళీలను భర్తీ చేయాలని, కొత్త ఉద్యోగాల నియామక ప్రక్రియను చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రభుత్వం ఏ పని చేపట్టినా, వాటిని అడ్డుకోవడానికి కొన్ని శక్తులు కాచుకొని కూర్చున్నాయని, ఉద్యోగ నియామక ప్రక్రియను కూడా కోర్టు కేసుల ద్వారా అడ్డుకుంటున్నాయని సిఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, న్యాయపరమైన చిక్కులకు అవకాశం లేకుండా నోటిఫికేషన్లు జారీచేసి, నియామక ప్రక్రియ చేపట్టాలని సిఎం సూచించారు. నోటిఫికేషన్లకు ముందే న్యాయశాఖ అధికారులతో చర్చించాలని సూచించారు. ఎవరైనా కోర్టులో కేసులు వేస్తే కూడా వాటిని సమర్థంగా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. అధికారులంతా పూర్తి సమన్వయంతో పనిచేయాలని కోరారు. శాఖల వారీగా ఖాళీలు భర్తీ చేయడానికి వీలుగా టిఎస్‌పిఎస్‌సిని ఏర్పాటు చేశామని, దీంతో ఇప్పటికే 58 నోటిఫికేషన్లు జారీచేసి, నియామక ప్రక్రియను ముందుకు తీసుకుపోతున్నట్లు టిఎస్‌పిఎస్‌సి చైర్మన్ ఘంటా చక్రపాణి సిఎంకు వివరించారు. టిఎస్‌పిఎస్‌సి ద్వారా ఇప్పటికే 5000 మందికి పైగా నియామకమయ్యారని, మరో నెల రోజుల వ్యవధిలో 12 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ముగుస్తుందన్నారు. న్యాయపరమైన వివాదాలు కొలిక్కి వచ్చినందున త్వరలోనే గ్రూప్ 1, గ్రూప్ 2 ఫలితాలు ప్రకటిస్తామని తెలిపారు. ఇదే స్ఫూర్తితో పనిచేసి తరువాయి 6లో



విద్యకు కార్పస్ ఫండ్

- మెట్రో రైల్వేల విస్తరణకు నూతన విధానం
- కేంద్ర మంత్రిమండలి నిర్ణయాలు

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం ఇక్కడ జరిగిన కేంద్ర మంత్రివర్గ భేటీలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. విద్యారంగాన్ని అభివృద్ధి చేసే దిశగా ఏక కార్పస్ ఫండ్ ఏర్పాటుకు కేంద్ర మంత్రి వర్గం పచ్చజెండా ఊపింది. సెకండరీ, ఉన్నత విద్య రుసుము (సెస్)ల ద్వారా సమకూరిన అన్ని రకాల రాబడులు ఈ నిధిలోకి వచ్చి చేరుతాయి. తద్వారా దీనిని విద్యారంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేసే పలు పథకాలకు వినియోగించడం తరువాయి 6లో



బిపి పైపైకి!

- రాష్ట్రంలో 30 ఏళ్లు పైబడిన వారిలో 30% మందికి హైపర్ టెన్షన్
- 10% మందిలో చాపకింద నీరులా..
- నివారణోపాయాలపై రాష్ట్ర ప్రభుత్వానికి సహకారం అందించనున్న ఐసిఎంఆర్

మన తెలంగాణ/ హైదరాబాద్ : హైపర్‌టెన్షన్ నిర్ధారణ, చికిత్స, నివారణ కోసం ప్రామాణికమైన నియమాలను రూపొందించడంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసర్చ్ (ఐసిఎంఆర్) సహకారాన్ని అందించనుంది. పెద్దల్లో హైపర్‌టెన్షన్ కేసులు పెరిగిపోవడానికి గల కారణాలను, హైపర్‌టెన్షన్ ప్రాథమిక దశలో గుర్తించడం, గుర్తింపునకు అవసరమైన పరీక్షలు చేయడం, నివారణకు అవసరమైన ఆహార నియమాలను ప్రజలకు సూచించగలడం, హైపర్‌టెన్షన్‌కు ఉప్పుకు మధ్య ఉన్న సంబంధాన్ని వివరించి ఉప్పుపై ప్రజలకు అవగాహన కల్పించడం, ప్రజల జీవనశైలికి సంబంధించి చేసుకోవాల్సిన మార్పులను సూచించడం వంటి వాటిపై ఐసిఎంఆర్ ప్రత్యేక పరిశోధనను చేపట్టనుంది. పరిశోధన అనంతరం హైపర్‌టెన్షన్‌పై ప్రభుత్వం, ప్రజలకు తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై సిఫారసు చేయనుంది. పలు ఏజెన్సీలు నిర్వహించిన అధ్యయనాల్లో హైపర్‌టెన్షన్‌కు సంబంధించి రాష్ట్రంలో పరిస్థితి చేయి దాటిపోతుండడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ అధ్యయనాల ప్రకారం 30 సంవత్సరాలు దాటిన వారిలో 30 శాతం మంది హైబిపితో బాధపడుతున్నారు. హైపర్‌టెన్షన్‌కు సంబంధించిన భయంకరమైన వాస్తవమేమిటంటే హైబిపి కలిగిన వారిలో 10 శాతం మందికి తమకు అది ఉన్నట్లే తెలియదు. హైపర్‌టెన్షన్‌కు చిన్నపాటి చికిత్స తీసుకోవడంలో ప్రజలు చూపిస్తున్న నిర్లక్ష్యం కాస్త గుండె, మెదడు, మూత్రపిండాలకు సంబంధించిన తరువాయి 6లో

సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసుల మూసివేత నిర్ణయంపై సుప్రీం కమిటీ 10

ఇప్పటి వరకు 81 లక్షల ఆధార్ కార్డులు రద్దు 9

ప్రయోగాత్మక భూసర్వే పూర్తి

- రెండు జిల్లాల్లో 4 గ్రామాల్లో నాలుగు రోజుల పాటు సాగిన సర్వే కార్యక్రమం
- నివేదిక సిద్ధం చేస్తున్న కమిటీ
- త్వరలో సిఎంతో సమావేశం



మన తెలంగాణ/ హైదరాబాద్ : సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్, రంగారెడ్డి జిల్లా తుర్కగూడ, ఎర్రకుంట, చింతపల్లిగూడలో ప్రయోగాత్మకంగా భూ సర్వే పూర్తయింది. ఒక్కో గ్రామంలో మూడు వందల ఎకరాలలో డిజిపిఎస్ విధానంతో నాలుగు రోజుల పాటు సర్వే నిర్వహించారు. నాలుగు గ్రామాల సర్వేపై నివేదిక రూపొందించి నేడో రేపో సిఎం కెసిఆర్‌కు అందచేయనున్నారు. భూసర్వేపై నియమించిన కమిటీ సభ్యులు బుధవారం రాజేంద్రనగర్‌లోని తెలంగాణ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (టిఎస్‌ఐపార్డ్)లో సమావేశమయ్యారు. ఈనెల 19వ తేదీన సిఎం సమగ్ర భూ సర్వేపై సమావేశం నిర్వహించే అవకాశం ఉంది. ఈ సమావేశంలో భూముల సర్వేపై సిఎం నిర్ణయం తీసుకుని, ఏ విధానంతో చేపట్టేది తెలియచేయనున్నారు. మియాపూర్ భూ కుంభకోణం, రైతులకు ఎకరాకు రూ.4వేల సహాయం పథకం కోసం రాష్ట్ర వ్యాప్తంగా భూముల సర్వే నిర్వహించాలని సిఎం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఇప్పటి వరకు నాలుగైదు దఫాలు సిఎం అధికారులతో లోతుగా సమీక్షించారు. సర్వేతో పాటు ఇతర అంశాలను అధ్యయనం చేసేందుకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.రఘునందన్ రావు అధ్యక్షతన కమిటీ వేసి, సిద్దిపేట, ఖమ్మం జిల్లా కలెక్టర్లను సభ్యులుగా నియమించారు. కమిటీ నిర్ణయం మేరకు నాలుగు గ్రామాలలో ప్రయోగాత్మకంగా (పైలట్ ప్రాజెక్టు) సర్వే తరువాయి 6లో

రోహిత్ మృతికి ఎవరినీ నిందించలేం: కేంద్రం 11



ప్రాణహిత ప్రవాహంలో ఇద్దరు బాలికల గల్లంతు

మన తెలంగాణ/ మంచిర్యాల: ప్రాణహిత నదిలో పెరిగిన ప్రవాహం వల్ల బుధవారం ఇద్దరు బాలికలు గల్లంతయ్యారు. మంచిర్యాల జిల్లాకు అవతలి ఒడ్డున గల మహారాష్ట్ర లోని సిరోంచా వద్ద ఉన్న ప్రాణహిత నదిలో బట్టలు ఉతికేందుకు వెళ్లిన ఇద్దరు బాలికలు స్వప్న(11), వెంకటరమణి(11) ప్రమాదవశాత్తు తరువాయి 6లో

నేను సిఎం అవుతా

– కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మన తెలంగాణ/ నల్లగొండ: తాను తెలంగాణలో ముఖ్యమంత్రి అయ్యేది ఖాయమని నల్లగొండ ఎంఎల్‌ఎ, సిఎల్‌పి ఉపనేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణ పరిధిలోని 40వ వార్డు మర్రిగూడలో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రానున్న కాలంలో తెలంగాణ ముఖ్యమంత్రి పీఠాన్ని అందుకుంటానని చెప్పారు. రాష్ట్రంలో తరువాయి 6లో



డిటోనేటర్ల స్వాధీనం

- దొంగిలించి తరలించుకు పోతుండగా 16,500 ఎలెక్ట్రానిక్ డిటోనేటర్లను స్వాధీనం చేసుకున్న సూర్యాపేట పోలీసులు
- ఓ కారుతో ఇద్దరు నిందితులు అరెస్టు



మన తెలంగాణ/ తిరుమలగిరి : సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండల కేంద్రం నుండి రాత్రి వేళలో అక్రమంగా కారులో తరలిస్తున్న 16,500 డిటోనేటర్లతో పాటు కారును, ఇద్దరు నిందితులను మంగళవారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. సూర్యాపేట డిఎస్‌పి సునీతామోహన్ బుధవారం తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన మహ్మద్ యాకుబ్ పాషా, గఫార్ ఖాన్, అన్వర్‌లు కలిసి ఈనెల 9న తిరుమలగిరి మండలం నందాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని ఈదుల పర్రెతండా శివారులో శ్రీ వెంకటేశ్వర ఎక్స్‌ప్లోజివ్ ఎంటర్ ప్రైజెస్ సెంటర్‌కు కాపలా ఉన్న వాచ్‌మెన్ భైరం వెంకన్నను బెదిరించి గడ్డపారతో తాళాలు పగులగొట్టి పదకొండు బాక్స్‌లలో ఉన్న 16,500 ఎలెక్ట్రానిక్ డిటోనేటర్లను కారులో తరలిస్తుండగా వెంబడించామని, తొర్రూర్ రోడ్డులోని రైస్ మిల్లు వెనకాల కారును వదిలి పారిపోయారని తరువాయి 6లో



ప్రశ్నిస్తున్నామనే అరెస్టులు

- కొలువుల క్యాలెండర్ విడుదల చేయాలి, దసరా తర్వాత హైదరాబాద్‌లో బహిరంగసభ : కోదండరామ్ 6

ముద్దాయిగా డిఐజి

- నేరెళ్ల కేసులో ఎస్‌ఐ సస్పెన్షన్‌పై నివేదిక కోరిన హైకోర్టు

మన తెలంగాణ / సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లా నేరెళ్ల ఘటనలో ఎస్‌ఐ రవీందర్‌ని పూర్తి బాధ్యునిగా చేస్తూ సస్పెండ్ చేయడంపై హైకోర్టు బుధవారం పూర్తిస్థాయి నివేదికను కోరింది. కేసులో 11వ ముద్దాయిగా డిఐజిని చేర్చింది. కేసును రెండు వారాల పాటు వాయిదా వేసింది. నేరెళ్ల ఘటనకు పూర్తి బాధ్యుడు కీలకసూత్రధారి ఎస్‌పి విశ్వజిత్ అని, అతనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని పిటిషనర్ తరఫున న్యాయవాది రఘునాథ్ న్యాయస్థానాన్ని అభ్యర్థించగా అన్ని నివేదికలు అందిన తర్వాత ఈ విషయమై చర్చిస్తామని కోర్టు వెల్లడించింది. కరీంనగర్ సబ్ జైలులో నిందితుల గాయాలకు సంబంధించిన రిపోర్టును జైలు సూపరింటెండెంట్, సివిల్ హాస్పిటల్‌లో తీసుకున్న ట్రీట్‌మెంట్ రిపోర్టును ఆసుపత్రి సూపరింటెండెంట్ రెండు వారాల్లో కోర్టుకు ఇవ్వాలని ఆదేశించారు. కేసుకు సంబంధించి ఎస్‌ఐ రవీందర్‌ను ఎందుకు సస్పెండ్ తరువాయి 6లో

శివార్లకు నల్లానీరు

- హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్డు గ్రామాలకు ఏడాదిలోగా అదనంగా 1.50 లక్షల నల్లా కనెక్షన్లు
- పది లక్షల మంది శివారు ప్రజలకు ప్రయోజనం
- ప్రాజెక్టు పైలాన్‌ను ఆవిష్కరించిన మంత్రి కెటిఆర్



మన తెలంగాణ/సిటీబ్యూరో: ఏడాదిలోగా ఔటర్ రింగ్ రోడ్డు మంచినీటి ప్రాజెక్టును పూర్తి చేసి, నగర శివార్లలో అదనంగా 10 లక్షల మంది దాహార్తిని తీర్చనున్నట్లు రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. రూ.628 కోట్లతో ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోపలి గ్రామాలకు తాగునీటిని అందించేందుకు జలమండలి చేపడుతున్న ఒఆర్‌ఆర్ తాగునీటి ప్రాజెక్టు పనులకు సంబంధించిన పైలాన్‌ను కొంపల్లిలోని సెంట్రల్ పార్క్‌లో బుధవారం మంత్రి కెటిఆర్, రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, తరువాయి 6లో

కుంచెపోటు



మీకిష్టమని ఇట్లా మార్చేశా సార్..!

ఐటిఐఆర్ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం తుంగలో తొక్కారు : కాంగ్రెస్



మన తెలంగాణ/ హైదరాబాద్ : తెలంగాణలో నిరుద్యోగులు ఉద్యోగాలు కోసం పడిగాపులు కాస్తుంటే లక్షలాది మందికి ఉద్యోగాలు కల్పించే అవకాశమున్న ఐటిఐఆర్ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం తుంగలో తొక్కిందని టిపిసిసిప్రధాన కార్యదర్శి దాసోజు శ్రవణ్ విమర్శించారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ హయాం లో మంజూరైన ఐటిఐఆర్ పథకం అమలు చేస్తే గత పాలకులకు మంచి పేరు వస్తుందనే కారణంతోనే రాష్ట్ర ఐటి శాఖ మంత్రి కెటిఆర్ దానిపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని చెప్పారను. హైదరాబాద్ నలుమూలల 50 వేల ఎకరాల్లో 2.19 లక్షల కోట్ల పెట్టుబడులు ఐటి రంగంలో వచ్చేలా ఐటిఐఆర్‌ను యుపిఏ ప్రభుత్వం మంజూరు చేసిందని, కాని ప్రస్తుత రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. ఈ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10వేల కోట్లు, కేంద్రం రూ.3వేల కోట్లు ఇస్తే సరిపోతుందని, కాని ఎవరు అడగని మిషన్ భగీరథకు వేల కోట్లు రుణాలు తెస్తున్న ప్రభుత్వం లక్షల ఉద్యోగాలిచ్చే ఐటిఐఆర్‌కు రూ.13లవేల కోట్లు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. ఐటిఐఆర్ డిపిఆర్‌లో మార్పులు చేయడం పట్ల ఆయన తప్పుబట్టారు. తక్షణమే ఐటిఐఆర్‌పై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

వెల్లివిరిసిన మతసామరస్యం

హర్దా(మధ్యప్రదేశ్): స్నేహాన్ని మించిన పెన్నిధి లేదనుకున్న ఓ 21 ఏళ్ల పాకిస్థాన్ మహిళ తన హిందూ స్నేహితురాలి కోసం సరస్వతి దేవి విగ్రహాన్ని స్థానిక మార్కెట్లో కొని కరాచీకి తీసుకెళ్లి బహూకరించబోతోంది. ఆమె ఈ నిర్ణయానికి హర్దాలో ఉండే ఆమె మేనమామ కూడా సంతోషించాడు. పైగా ఆమె వెంట మార్కెట్‌కు వెళ్లి ఆ విగ్రహాన్ని కొనడంలో తోడ్పడ్డాడు. ఆ పాకిస్థాన్ మహిళ పర్యటన నిమిత్తం భారత్ వచ్చింది. 'నా హిందూ స్నేహితురాలు నాతో పాటు కరాచీలో ఓ కంపెనీలో పనిచేస్తుంటుంది. మా ఇద్దరి కుటుంబా లు కూడా మంచి స్నేహం కలిగి ఉన్నాయి. భారత్ నుంచి తిరిగి వచ్చేప్పుడు ఏమి తీసుకురావాలని ఆమెను కోరినప్పుడు దేవి విగ్రహాన్ని తీసుకు రమ్మంది. ఆమెకు విజ్ఞాన విషయాలపై మక్కువ ఎక్కువ. కనుక నేను ఇక్కడ చదువుల తల్లిగా కొలిచే సరస్వతి దేవి విగ్రహాన్ని మంగళవారం ఇక్కడి స్థానిక మార్కెట్ లో కొన్నాను' అని తెలిపింది. ఇదివరలో తన తల్లి హర్దా వచ్చినప్పుడు కూడా గణేశుని విగ్రహాన్ని కొని అక్కడి(పాకిస్థాన్‌లోని) తన మిత్రురాలి కుటుంబానికి బహూకరించిందని వివరించింది. 'స్నేహానికి ఇలాంటి ఇచ్చిపు చ్చుకోవడాలు చేస్తే వేర్వేరు సముదాయాల మధ్య సామరస్యం పెరుగుతుంది, ఇరు దేశాల మధ్య సంబంధాలు పెరుగుతాయి' అని ఆ పాక్ మహిళ మేనమామ అన్నారు.

3950 ఆర్‌టిసి ఉద్యోగాలు ఏవీ?

ఉద్యోగాల భర్తీపై సర్వత్రా చర్చ • నేటికీ 2617 ఉద్యోగాలు ఖాళీ

మన తెలంగాణ / హైదరాబాద్ : "ఆర్‌టిసిలో 3950 ఉద్యోగాలు భర్తీ చేశారా! ఎవరు భర్తీ చేశారు! ఎప్పుడు భర్తీ చేశారు!" ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ఆర్‌టిసిలో ఏ కార్మికుని నోట విన్నా ఇదే చర్చ కొనసాగుతున్నది. స్వాతంత్ర్య దినోత్సవం ప్రసంగం సందర్భంగా ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రకటించిన లక్ష ఉద్యోగాల్లో భాగంగా ఆర్‌టిసిలో ఇప్పటికే 3950 పోస్టులు భర్తీ అయినట్లు సిఎంఒ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఈ విషయం ఆర్‌టిసి వర్గాల్లో దుమారం రేపుతుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు ఆర్‌టిసిలో ఒక్క నియామకం కూడా జరగకపోవడంతో కార్మికులపై పనిభారం పెరుగుతున్నదని గత కొంత కాలంగా తాము మొత్తుకుంటుండగా,ఆర్‌టిసిలో ఏకంగా 3950 ఉద్యోగా లను భర్తీ చేసినట్లు ప్రభుత్వం ప్రకటించడం పట్ల కార్మిక సంఘాల నాయ కులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌టిసిలో చివరిసారిగా 2011లో నోటిఫికేషన్ ద్వారా ఆఫీసర్స్, ట్రాఫిక్, మెకానికల్ సూపర్‌వైజర్స్, జూనియర్ అసిస్టెంట్స్, పిడి, ఎడి, ఎంఇడి పోస్టులను భర్తీ చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఉద్యోగాల భర్తీ కోసం టిఎస్‌ఆర్‌టిసి యాజమాన్యం ఒక్క నోటిఫికేషన్ కూడా జారీ చేయలేదు. అధికారిక లెక్కల ప్రకారం రెండేళ్ల కింద 2015 మే నెలలో టిఎస్‌ఆర్‌టిసి ఏర్పడే నాటికి సంస్థలో 56,625 మంది ఉద్యోగులు పని చేస్తుండేవారు. ప్రస్తుతం 2017 మార్చి 31 నాటికి 54,008 సిబ్బంది ఉన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు 2,617 వేల మంది సిబ్బంది తగ్గిపోయారు. ఇంత పెద్ద సంఖ్యలో ఉద్యోగులు రిటైరైనా యాజమాన్యం కొత్తగా ఒక్క ఉద్యోగాన్ని కూడా భర్తీ చేయలేదు. పైగా నిర్వహణ వ్యయాన్ని తగ్గించుకునే పేరుతో ఖాళీ ఉద్యోగాల భర్తీకి మంగళం పాడి అన్ని విభాగాల్లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానాన్ని గతం కంటే ఎక్కువగా పెంచుకుంటూ పోతున్నది.



"సంస్థలో 2015లో సమ్మె సందర్భంగా కార్మిక సంఘాలతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు గతంలో కాంట్రాక్టు ప్రాతిపదికన నియమిం చిన సుమారు 4250 మంది కండక్టర్లు, డ్రైవర్లు, శ్రామిక్‌లలో సుమారు 38 00 మంది సర్వీసులను దశల వారీగా రెగ్యులరైజ్ చేశారు. ఇంకా 400 మంది కాం ట్రాక్టు డ్రైవర్లను రెగ్యులరైజ్ చేయాల్సి ఉంది" అని కార్మిక సం ఘాల నాయకులు చెబుతున్నారు. దీంతో సిఎం లక్ష ఉద్యోగాల లెక్కలో ఆర్‌టి సిలో ఉద్యోగాల గురించి తప్పు చెప్పారా? లేక ఆర్‌టిసి యాజమాన్యం సిఎం కు తప్పుడు సమాచారం ఇచ్చిందా? అనే చర్చ ఆర్‌టిసి వర్గాల్లో జోరుగా సాగుతోంది.

టిఎస్‌ఆర్‌టిసి రికార్డుల ప్రకారం గత రెండేళ్లలో ఉద్యోగుల వివరాలు

వివరాలు	మే,2015	మార్చి,2017
ఉద్యోగులు	56,625	54,008
మొత్తం బస్సులు	10,521	10,463
ఆర్‌టిసి బస్సులు	8,794	8,263
ప్రతి రోజు బస్సులు	30.53	35.48
తిరిగిన కి.మీ. లక్షల్లో		
ప్రతి రోజు ఆదాయం	రూ.8.23 కోట్లు	రూ.10.31 కోట్లు

పెండింగ్‌లో నియామకాల దస్త్రం!

ఆర్‌టిసిలో దాదాపు 2500 ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేసేందుకు అవసరమైన అనుమతికి సంబంధించిన ఫైల్ ఇప్పటికీ ముఖ్యమంత్రి వద్ద పెండింగ్‌లో ఉంది. ఆర్‌టిసి అధికారుల సమాచారం సంస్థలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల వివరాలను తెలియజేస్తూ వాటిని భర్తీ చేసేందుకు అనుమతించాలని యాజమాన్యం ఏడాది కింద ప్రతిపాదనలను ముఖ్యమంత్రికి పంపించింది. ఆ ఫైల్ ఇప్పటివరకు ఆర్‌టిసికి తిరిగి రాలేదు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాకుండా తాము చేసేముందని అధికారులు అంటున్నారు.

తట్టు, పొంగు వ్యాధులకు వ్యాక్సిన్

మన తెలంగాణ/హైదరాబాద్ : మీజిల్స్, రూబెల్లా వ్యాదుల నివారణ కోసం దేశవ్యాప్తంగా చేపట్టిన ఇమ్యూనైజేషన్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17వ తేదీ (నేటి నుండి) సెప్టెంబర్ 25వ తేదీ వరకు టీకాలను వేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 9 నెలల నుండి 15 సంవత్సరాల లోపు పిల్లలకు అన్ని వైద్య శాలలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మొదటి నాలుగు వారాల పాటు వ్యాక్సిన్లను వేస్తారు. బడి బయట ఉన్న పిల్లలకు వైద్య సిబ్బంది టీకాలను వేస్తారు. నాలుగు వారాల్లో టీకాలు వేయించని పిల్లల కోసం వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి ఈ వ్యాక్సిన్‌లను వేస్తారు. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం దాదాపు 800 తట్టు కేసులు నమోదవుతున్నాయి. ఇది ఎక్కువగా పిల్లల్లో వస్తుంది. ప్రజల్లో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న మూఢనమ్మకాల కారణంగా ఈ వ్యాధికి గురైన పిల్లలను ఆసుపత్రులకు తీసుకు రాకపోవడంతో ఎంత మందికి వస్తుందనే దానిపై ఖచ్చితమైన లెక్కలు కొరవడ్డాయి. రూబెల్ల (పొంగు)కు సంబంధించినంత వరకు ఈ వ్యాధి చిన్న పిల్లలతో పాటు పెద్దల్లోనూ వస్తుంది. ముఖ్యంగా ప్రసవం సమయంలో వస్తే పిల్లలు శాశ్వత వైకల్యంతో జన్మిస్తుంటారు. దీనితో ఆ కుటుంబాలకు ఆరోగ్య సమస్యతో పాటు జీవితాంతం సామాజిక, ఆర్థిక సమస్యలు ఎదుర్కొనాల్సి పరిస్థితి ఉంది. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం సుమారు 3000 వరకు రుబెల్లా కేసులు నమోదు అవుతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో 9 నెలల నుండి 15 సంవత్సరాల లోపు చిన్నారులు దాదాపు 90 లక్షల మంది ఉండగా వారందరికి ఎంఆర్ (మీజిల్స్, రూబెల్లా) వ్యాక్సిన్‌ను వేయనున్నారు.రాజ్‌భవన్ స్కూల్‌లో ప్రారంభం గురువారం ఉదయం 9 గంటలకు రాజ్‌భవన్ పాఠశాలలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి రూబెల్లా టీకాల కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఉదయం 11:30 గంటలకు జామై నిజామియా స్కూల్‌లో పిల్లలకు ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, ఉదయం 11 గంటలకు పూల్‌బాగ్‌లోని మైనారిటీ పాఠశాలలో పిల్లలకు ఎంపి అసదుద్దీన్ ఓవైసీ టీకాలను వేస్తారు.

కిలీమంజారో పర్వతారోహకులకు జోగు రామన్న అభినందన

మన తెలంగాణ / హైదరాబాద్ : కిలీమంజారో పర్వత శిఖరం అధిరోహించిన బిసి హాస్టల్ విద్యార్థులను మంత్రి జోగు రామన్న అభినందించారు. బిసి సంక్షేమ శాఖ కాలేజీ హాస్టల్ విద్యార్థి పి.చరణ్ రాజ్ సికింద్రాబాద్ లోని బిసి కాలేజీ హాస్టల్‌లో ఉండి బిఎస్‌సి రెండో సంవత్సరం చదువుతున్నారు. చరణ్‌రాజ్‌ను బిసి సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి అశోక్ కుమా ర్ ప్రోత్సహించి కిలీమంజారో పర్వతారోహణకు పంపించారు. అత్యంత సాహసోపేతంగా భూమట్టానికి 20 వేల అడుగుల ఎత్తున ఉండే కిలీ మం జారో పర్వత శిఖరాన్ని ఈ బృందం అధిరోహించి తెలంగాణ ఖ్యాతిని ఖం డాంతరాలు చాటింది. చరణ్ రాజ్ బృందాన్ని జోగు రామన్న అభినందించారు.



దిగజారుతున్న భారత్ ప్రతిష్టను నిలబెడదాం

స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్




మన తెలంగాణ/హైదరాబాద్ : సహనశీలత, లౌకికత్వం, మతసామరస్యం, శాంతి, సమాధానం, మానవీయ విలువలు కలిగిన దేశంగా ప్రపంచాన పేరొందిన భారత్‌లో గత కొంత కాలంగా పెరిగిపోతున్న దాడులు చేసే ఆలోచనా ధోరణితో దేశ ప్రతిష్ట దిగజారుతోందని స్టూడెంట్స్ ఇస్లామిక్ అర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌ఐఒ)తెలంగాణ జోన్ ఆందోళన వ్యక్తం చేసింది. మానవ ప్రతిష్టను పెంపొందించడం ద్వారా దేశ ప్రతిష్టను కాపాడేందుకు ఎస్‌ఐఒ రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న చైతన్య కార్యక్రమాల్లో ప్రజలు కలిసి రావాలని ఎస్‌ఐఒ పిలుపునిచ్చింది. నగరంలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఎస్‌ఐఒ రాష్ట్ర అధ్యక్షులు లయిఖ్ అహ్మద్ ఖాన్, నాయకులు ఖలీం, అజీముద్దీన్‌లు పాల్గొన్నారు. ఆగస్టు 16వ తేదీ (బుధవారం) నుండి మొదలు పెట్టిన ప్రచార కార్యక్రమం 30వ తేదీ వరకు వివిధ జిల్లాల్లో, విశ్వవిద్యాలయాల్లో కొనసాగుతుందన్నారు. ఆగస్టు 24న హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తామ న్నారు. సదస్సులు, సమావేశాలు, చర్చావేదికలు, ప్రదర్శనలు, ఉన్నతాధికా రులు, ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాల సమర్పణ తదితర రూపాల్లో ప్రచార కార్యక్రమం ఉంటుందన్నారు. బాధితులుగా మారడాన్ని తిరస్కరి ద్దాం.. ఆత్మగౌరవాన్ని నిలుపుదాం..... అసహ్యానికి వ్యతిరేకంగా నిలబెడ దాం అనే నినాదాలతో రాష్ట్రాన్ని చుట్టేస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో మేధావులు, ప్రజా సంఘాలు, లౌకికవాదులు, వివిధ రాజకీయ పార్టీల నా యకులు భాగస్వాములు కానున్నారని ఆయన తెలిపారు. తమ మనోభావాలు దెబ్బ తింటున్నాయనే సాకుతో రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కును ముస్లింలు, దళితులకు దక్కకుండా చేస్తున్నారన్నారు. మాట్లాడిన భావాన్ని కాకుండా మాట్లాడిన వ్యక్తి మతం, కులం ఆధారంగా వాటికి భాష్యాలు చెబుతూ భయభ్రాంతలకు గురి చేసి భావ ప్రకటనా స్వేచ్ఛ లేకుండా చేస్తున్నారన్నారు. వివిధ రాష్ట్రాలు, విశ్వవిద్యాలయాల్లో వరుస హత్యలు, అదృశ్యాలు, కేసుల బనాయింపులు ఈ ధోరణి పెరుగుతు న్నదానికి నిదర్శనమన్నారు. భారతీయులంటే ప్రపంచంలోని ఇతర దేశాల్లో ఉన్న మంచి గుర్తింపు కాస్తా మారిపోతుందని, దాడులు ఇలాగే పెరిగిపోతే మరింత దిగజారే ప్రమాదముందని వారన్నారు. భారతీయులంతా భారత్ ప్రతిష్టను నిలబెట్టేందుకు ముందుకు రావాలని వారు కోరారు.

బిజెపిలోకి డిఎస్ కుమారుడు?

నిజామాబాద్ ఎంపి స్థానంపై గురి

మన తెలంగాణ / నిజామాబాద్ : టిఆర్‌ఎస్ రాజ్యసభ సభ్యులు డి.శ్రీనివాస్ కుమారుడు ధర్మపురి అరవింద్ బిజెపిలో చేరుతారని ప్రచారం జరుగుతోంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఒక ఆంగ్ల పత్రికలో 'జాతి మొత్తం మోడీ వెంటే నడవాలని' అరవింద్ భారీ ప్రకటన ఇవ్వడం తో దీనికి ఊతమిస్తోంది. ఇప్పటికే ఆయన బిజెపి జాతీయ నాయకత్వాన్ని కలిశారని, వచ్చే ఎన్నికల్లో నిజామాబాద్ లోక్‌సభ స్థానాన్ని నుండి పోటీ చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్లు వారికి తెలియజేసినట్లు ప్రచారం జరుగుతోం ది. మరోవైపు డి.శ్రీనివాస్ మాతరం తనకు టిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ రాజ్యసభ స్థానం ఇచ్చి సముచిత స్థానం కల్పించారని, తాను టిఆర్‌ఎస్ లోనే కొనసాగుతానని స్పష్టం చేస్తున్నారు. ఇటీవల ఆయన కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నించినట్లు వచ్చిన వార్తలను కూడా ఖండించారు.

సామాజిక బాధ్యతగా పరిశుభ్రత



మన తెలంగాణ / హైదరాబాద్ : పరిశుభ్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా మారాలని కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ, దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్ అన్నారు. 'స్వచ్ఛ రైల్ స్వచ్ఛ భారత్' పరిశుభ్రత వారోత్సవాలను కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ కాచిగూడ రైల్వే స్టేషన్‌లో బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వినోద్‌కుమార్ యాదవ్‌తో పాటు ఎంఎల్‌ఏ జి.కిషన్‌రెడ్డి, ఎస్‌సిఆర్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ ఎన్.మధుసూదనరావు, హైదరాబాద్ రైల్వే డివిజనల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తదితరులు పాల్గొన్నారు. రైల్వేస్టేషన్‌లో, రైలు బోగీల్లో, ప్లాట్‌ఫారమ్ తదితర ప్రాంతాలల్లో రైల్వే వారు స్వేచ్ఛ రైల్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ మన పరిసరా లు, మన కాలనీ, మన డివిజన్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి రాజకీపార్టీలకు అతీతంగా అందరూ స్వచ్ఛ భారత్‌లో భాగస్వాములు కావాలన్నారు. రైల్వేస్టేషన్లలో స్వేచ్ఛ భారత్ కార్యక్రమానికి ప్రభుత్వం అత్యంత ప్రాముఖ్యత ఇస్తుందన్నారు. వినోద్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ రైల్వే ప్రయాణీకులు తప్పనిసరిగా పరిశుభ్రత పాటించాలన్నారు. అంతకు ముందు ఉదయం రైల్ నిలయంలో జరిగిన కార్యక్రమంలో 'సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరు పరిశుభ్రత విషయంలో శ్రద్ధ తీసుకోవాలి' అని రైల్వే అధికా రులు, సిబ్బందితో జనరల్ మేనేజర్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం 'స్వచ్ఛ రైల్ స్వచ్ఛ భారత్'కు మద్దతుగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.



ప్రభుత్వానికి, ఎఐఎడిఎంకెకు ఎలాంటి సంబంధం లేదు: దినకరన్

చెన్నై: తమిళనాడు ముఖ్యమంత్రి పళనిస్వామి నేతృత్వంలోని ప్రభుత్వానికి ఎఐఎడిఎంకెకు ఎటువంటి సంబంధం లేదని ఎఐఎడిఎంకె (అమ్మ) డిప్యూటీ చీఫ్ టిటివి దినకరణ్ పేర్కొన్నారు. కొంత మంది మంత్రులు, ఆఫీస్ బేరర్లు దొడ్డిదారిన పార్టీని హస్తగతం చేసుకునేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి వారు తమను తాము సంస్కరించుకోవాలని కోరారు. ప్రభుత్వంపై సినీ నటుడు కమల్ హాసన్ చేసిన అవినీతి ఆరోపణలపై దినకరన్ స్పందిస్తూ ప్రభుత్వానికి ఎఐఎడిఎంకె (అమ్మ)కు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వంపై వచ్చిన అవినీతి ఆరోపణలకు పళనిస్వామి మాత్రమే సమాధానం ఇవ్వాలని ఆయన అన్నారు. పార్టీ శ్రేణుల మద్దతు పళనిస్వామికి లేదని వారంతా తన వెంటే ఉన్నారని దినకరన్ తెలిపారు. ప్రభుత్వంపై వరుసగా అవినీతి ఆరోపణలు వచ్చినప్పుడు వాటిని ఎదుర్కొనే ధైర్యం నాయకత్వం వహిస్తున్నవారికి లేదన్నారు. ఈ అంశంపై దృష్టి మళ్లించేందుకు మంత్రులు, ఆఫీస్ బేరర్లు యత్నిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

హైదరాబాద్ నూతన కలెక్టర్‌గా యోగితా రాణా



మన తెలంగాణ/ సిటీ బ్యూరో: హైదరాబాద్ జిల్లా నూతన కలెక్టర్‌గా డాక్టర్ యోగితా రాణాను ప్రభుత్వం నియమించింది. 2003 బ్యాచ్‌కు చెందిన యోగితా రాణా ప్రస్తుతం నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమెను హైదరాబాద్ కలెక్టర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.పి. సింగ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల వరకు జిల్లా కలెక్టర్‌గా పని చేసిన రాహుల్ బొజ్జా అమెరికాలో ఉన్నత చదువుల నిమిత్తం దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ప్రస్తుతం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.ప్రశాంతి ఇంఛార్జీ కలెక్టర్‌గా పూర్తి స్థాయి అదనపు బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ఇదే క్రమంలో జిల్లా నూతన కలెక్టర్‌గా బదిలీపై వచ్చిన యోగితా రాణా శుక్రవారం బాధ్యతలను స్వీకరించనున్నట్లు సమాచారం. గతంలో 2011 ఏప్రిల్ 28 నుంచి 20 12 మార్చి 28 వరకు హైదరాబాద్ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పని చేశారు.

ఘనంగా రెడ్డి హాస్టల్ శతాబ్ది ఉత్సవాలు



మన తెలంగాణ/హైదరాబాద్: రెడ్డి హాస్టల్ శతాబ్ది ఉత్సవాలను ఈ నెల 22వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించనుందని హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి తెలిపారు. సచివాలయంలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రెడ్డి హాస్టల్ కోసం ప్రభుత్వం రాజేంద్రనగర్ మండలం బుద్వేల్‌లో 10 ఎకరాల స్థలం కేటాయించిందని, రూ.10 కోట్లు మంజూరు చేసారన్నారు. రాజ బహద్దూర్ వేంకటరామారెడ్డి జయంతి సందర్భంగా 22వ తేదీన బుద్వేల్‌లోని స్థలంలో హాస్టల్ కాంప్లెక్స్ నిర్మాణానికి ముఖ్యమంత్రి కెసిఆర్ స్వయంగా శంకుస్థాపన చేస్తారని హోంమంత్రి ప్రకటించారు. తెలంగాణ అభివృద్ధికి రాజ బహద్దూర్ వెంకటరామారెడ్డి చేసిన నిస్వార్థ కృషిని ప్రభుత్వం గుర్తించిందన్నారు. సిఎం ఒఎస్‌డి దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ రెడ్డి హాస్టల్, కళాశాల ఏర్పాటు చేసినా, అందులో అన్ని వర్గాలకు చెందిన వారు విద్యాభ్యాసం, వసతి సౌకర్యం కల్పించారని, రెడ్లతో పాటు సమాజంలోని ఇతర వర్గాల కోసం కూడా కృషి చేసారని ప్రశంసించారు. ఈ సమావేశంలో చేవెళ్ల పార్లమెంటు సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, హాస్టల్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ రఘుపతిరెడ్డి, రెడ్డి జన సంఘం అధ్యక్షులు వి.నర్సింహారెడ్డి, మాజీ ఎంఎల్‌సిలు జగదీశ్వర్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

21న వెంకయ్యకు పౌర సన్మానం



మన తెలంగాణ/హైదరాబాద్ : ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడుకు ఈనెల 21న పౌర సన్మానం నిర్వహించాలని సిఎం కెసిఆర్ నిర్ణయించారు. తెలంగాణ ప్రజలు, ప్రభుత్వం తరఫున రాజ్‌భవన్‌లో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయనున్నారు. దిల్‌కుషా అతిథి గృహం ప్రాంగణంలో వెంకయ్య నాయుడు గౌరవార్థం విందు కూడా ఏర్పాటు చేసినట్లు సిఎం కార్యాలయం నేడొక ప్రకటనలో తెలిపింది.

కర్నాటకకు బయలుదేరిన బృందం



మన తెలంగాణ/ హైదరాబాద్: కర్నాటక రాష్ట్రంలో సత్ఫలితాలిస్తున్న వాటర్ షెడ్ కార్యక్రమాలను స్వయంగా చూసి అధ్యయనం చేసేందుకు 35 మంది రాష్ట్ర అధికారుల బృందం నాల్గు రోజుల సందర్శన కోసం కర్నాటకకు బయలుదేరి వెళ్లింది. కర్నాటక కామరాజనగర్ జిల్లాలో హరావే సుజల వాటర్ షెడ్‌ను ఈ బృందం సందర్శించనుంది. కర్నాటకకు వెళ్లే అధ్యయన బృందం బస్సును గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ నీతూ ప్రసాద్ జెండా ఊపి వారికి వీడ్కోలు పలికారు. మహబూబ్‌నగర్, నాగర్ కర్నూలు, జోగుళాంబ గద్వాల, సూర్యాపేట, నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల నుండి 35 మంది అధికారులు వాటర్‌షెడ్ కార్యక్రమాల క్షేత్ర స్థాయి సందర్శనకు వెళ్లారు. నీటి లభ్యత తక్కువ ఉన్న ప్రదేశాల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు దోహదపడేలా ఈ పర్యటనను ఏర్పాటు చేసినట్లు నీతూ ప్రసాద్ మీడియాకు తెలిపారు. తొలి బ్యాచ్ సందర్శన అనంతరం వచ్చిన ఫలితాలను బట్టి రెండో బ్యాచ్‌లో ఇతర జిల్లాల అధికారులను కూడా కర్నాటక అధ్యయనానికి పంపించనున్నట్లు వెల్లడించారు.

ఫ్యాకల్టీ పోస్టుకు ఆహ్వానం

మన తెలంగాణ/హైదరాబాద్: సివిల్ సర్వీసు పేపర్ 1, పేపర్ 2 సబ్జెక్టులు బోధించుటకు తగిన ఫ్యాకల్టీ కావాలని బిసి స్టడీ సర్కిల్ ప్రకటించింది. సైదాబాద్, లక్ష్మీ నగర్ కాలనీలో ఉన్న బిసి స్టడీ సర్కిల్‌లో సివిల్ సర్వీసుల శిక్షణ తీసుకునే అభ్యర్థులకు బోధించాల్సి ఉంటుందని, ఇందుకు అర్హత, ఆసక్తి ఉన్న ఫ్యాకల్టీ దరఖాస్తు చేసుకోవాలని స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఒక ప్రకటనలో కోరారు. ఇతర వివరాలకు ఫోన్ నెంబర్ 040 24071178లో సంప్రదించవచ్చు.

యాసంగికి పంటల వారీ అంచనాలు



మన తెలంగాణ/ హైదరాబాద్: ఖరీఫ్ పంటలకు ఎరువుల లభ్యత, యాసంగి పంటలకు విత్తనాల అవసరాలను వ్యవసాయ శాఖ కార్యదర్శి సి. పార్థ సారథి సమీక్షించారు. ఇటీవల కురిసిన వర్షాలు పంటలను బలోపేతం చేశాయని ఆయన అన్నారు. క్షేత్ర స్థాయిలో ఎరువుల అవసరాలు, అందుబాటులో ఉన్న ఎరువుల స్థితిగతులపై వ్యవసాయశాఖ కమిషనర్ డా. ఎం జగన్మోహన్, హాకా, మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులతో ఆయన చర్చించారు. యాసంగికి పంటల వారీగా అంచనాలను, ప్రతిపాదనలను ప్రభుత్వానికి సత్వరమే పంపాలని వ్యవసాయ కమిషనర్‌ను కోరారు. దానికి అనుగుణంగానే క్షేత్ర స్థాయిలో జిల్లా స్థాయి అధికారులతో చర్చించాలని అన్నారు. సిఎం కెసిఆర్ ఆకాంక్షలకు అనుగుణంగా క్షేత్ర స్థాయిలో రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. మార్క్‌ఫెడ్ జిఎం రాములు, సీడ్ కార్పొరేషన్ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

జూన్ నాటికి ఎస్ఆర్ఎస్‌పి రెండో దశ పూర్తి

అధికారులకు మంత్రి హరీశ్‌రావు ఆదేశం



మన తెలంగాణ/హైదరాబాద్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రెండో దశ పనులను 2018 జూన్ వరకు పూర్తిచేయాలని సాగునీటి శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆదేశించారు. బుధవారం ఇక్కడ జలసౌధలో శ్రీరాంసాగర్ రెండో దశ, తుపాకుల గూడెం ప్రాజెక్టు పనుల పురోగతిని మంత్రి సమీక్షించారు. ఇకపై ప్రతి వారం పనుల పురోగతిని సమీక్షించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. తుపాకుల గూడెం పూర్తయితేనే 10 నెలల పాటు దేవాదుల పంపులు నిరంతరాయంగా పనిచేస్తాయని అన్నారు. తుపాకుల గూడెం వల్ల దేవాదుల ప్రాజెక్టులో 6 లక్షల ఎకరాల స్థిరీకరణ జరుగుతుందని, పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఎస్ఆర్ఎస్‌పి రెండో దశ నుంచి పాత నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లోని కరవు పీడిత ప్రాంతాల్లో 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే పనులు మరింత వేగవంతం చేయాలని హరీశ్ కోరారు. ఎస్ఆర్ఎస్‌పి రెండో దశ కింద మొత్తం రూ.1321 కోట్లతో పనులు జరుగుతున్నాయని, 2005 నుంచి, 2014 వరకు కాంగ్రెస్ ప్రభు త్వం ఈ ప్రాజెక్టును పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాకే రెండో దశ పరిధిలో 2.25 లక్షల ఎకరాలు స్థిరీకరించిందని, మరో 1.75 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్నారు. ఈ పథకం కింద 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉందన్నారు. కాకతీయ ప్రధాన కాలువలో లైనింగ్ దెబ్బతినడం, పూడిక వంటి కారణాలతో వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో కరువు పీడిత ప్రాంతాల్లో భూములకు నీరందడం లేదని మం త్రి చెప్పారు. ఆయా ప్రాంతాల్లో సాగునీటిని అం దించేందుకు ఈ మరమ్మత్తు పనులను పూర్తిచేసి, ఫీల్డ్ చానల్స్‌ను వినియోగింలోకి తీసుకురావాలన్నారు. ఈ పథకంతో పూర్వ నల్లగొండ జిల్లాలో తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ అసెంబ్లీ ని యోజకవర్గాల్లో 213175 ఎకరాలకు, ఖమ్మం జిల్లాలో పాలేరు, మధిర అసెంబ్లీ నియోజకవర్గాలలో 75,262 ఎకరాలకు, వరంగల్ జిల్లాలో వర్ధన్నపేట, పాలకుర్తి, డోర్నకల్ నియోజకవర్గాల్లో 1,09,512 ఎకరాలకు సాగునీరు మంత్రి గుర్తుచేశారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందించాలని, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం తీసుకొని సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. వచ్చే ఏడాది కాళేశ్వరంతో ఎస్ఆర్ఎస్‌పిని కనెక్ట్ చేస్తున్నందున రెండో దశ పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఎల్ ఎండికి ఎగువ, దిగువ ప్రాంతాల్లో కాలువల్లో నీటిప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని కోరారు. శ్రీరాంసాగర్ నీరు ఇప్పటి దాకా చూడని జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాలకు సాగునీరు అందించే ఉద్దేశంతో ప్రభుత్వం ఉందని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఇరిగేషన్ ఇఎన్‌సి మురళీధర్, ఇఎన్‌సి (అడ్మినిస్ట్రేషన్) నాగేందర్‌రావు, వివిధ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రధాన పెట్టుబడిదారుగా ఉండండి

- కొరియా టెక్స్‌టైల్ దిగ్గజ సంస్థకు కెటిఆర్ ఆహ్వానం
- మూడు రోజుల పాటు రాష్ట్రంలో పర్యటించనున్న కొరియన్ బృందం

మన తెలంగాణ/ హైదరాబాద్: వరంగల్ కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులకు దక్షిణ కొరియా టెక్స్‌టైల్ దిగ్గజ కంపెనీలను పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్ ఆహ్వానించారు. కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో ప్రధాన పెట్టుబడి దారుగా ఉండాలని కెటిఆర్ కోరారు. బేగంపేట సిఎం క్యాంపు కార్యాలయంలో రవాణాశాఖ మంత్రి మహేందర్ రెడ్డి, ఐటి శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్, టెక్స్‌టైల్ డైరెక్టర్ శైలజారామయ్యర్, టిఎస్ఐఐసి వైస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఇ. వెంకట నర్సింహారెడ్డి తదితరుల సమక్షంలో దక్షిణ కొరియా టెక్స్‌టైల్ ప్రతినిధుల బృందంతో (కొరియా ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీస్) కెటిఆర్ సమావేశమయ్యారు. కంపెనీ ఛైర్మన్ కోఫోతి, యంగొనే కార్పొరేషన్ అధినేత కిహాగ్ సుంగ్ బృందంతో కెటిఆర్ విస్తృతంగా చర్చలు జరిపారు. వరంగల్ టెక్స్‌టైల్ పార్కు స్వరూపం, సౌకర్యాలను కొరియన్ బృందానికి కెటిఆర్ వివరించారు. సుమారు 2000 ఎకరాల్లో ఏర్పాటు చేయబోయే టెక్స్‌టైల్ పార్కు, దేశీయ పరిశ్రమలతో పాటు అంతర్జాతీయ పరిశ్రమలకు వేదిక కాబోతుందన్నారు. పార్కులో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే కంపెనీలకు దేశంలో ఏ రాష్ట్రం ఇవ్వలేనన్ని ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు. ఇంతే కాకుండా ఆయా కంపెనీలు కోరుకున్న విధంగా పార్కులో మౌళిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. టెక్స్‌టైల్ పార్కులోని పరిశ్రమ అవసరాల కోసం ఇక్కడి కార్మికుల్లో నైపుణ్యాభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఓ శిక్షణా సంస్థను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఫలితంగా పలు అంతర్జాతీయ కంపెనీలకు తెలంగాణలో నైపుణ్య కార్మికులు అందుబాటులో ఉంటారన్నారు. దీంతో పాటు తెలంగాణ ప్రభుత్వ పారిశ్రామిక విధానం, ప్రాధాన్యతల గురించి కొరియన్ ప్రతినిధి బృందానికి మంత్రి వివరించారు. వరంగల్ టెక్స్‌టైల్ పార్కులో అవసరం అయితే దక్షిణ కొరియా కంపెనీలకు ప్రత్యేకంగా కొంత స్థలాన్ని కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. టెక్స్‌టైల్ రంగానికి తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత తమను ఆకట్టుకుందని కొరియన్ ప్రతినిధులు సుంగ్ ప్రభృతులు వెల్లడించారు. వరంగల్‌లో విమాన సౌకర్యం ఉందా? అని మంత్రిని ఆరా తీశారు. దీనిపై స్పందించిన మంత్రి అంతర్జాతీయ స్థాయి యాంకర్ ఇన్వెస్టర్లను దృష్టిలో ఉంచుకుని కేంద్రంతో మాట్లాడి త్వరలోనే వరంగల్‌లోని ఏయిర్ స్ట్రిప్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. తొలి రోజు కెటిఆర్‌తో భేటీ అయిన కొరియన్ బృందం రెండు, మూడు రోజులు రాష్ట్రంలోనే ఉండి టెక్స్‌టైల్ పార్కు స్థలాలను స్వయంగా పరిశీలించనున్నారు.

కేంద్రం నుండి ఆర్డర్ రాగానే కొత్త సచివాలయ పనులు

మన తెలంగాణ/ హైదరాబాద్: సికింద్రాబాద్ బైసన్ పోలో గ్రౌండ్‌లో నిర్మించతలపెట్టిన తెలంగాణ కొత్త సచివాలయంపై కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతోంది. కేంద్రం ఇప్పటికే ఆ స్థలాన్ని అప్పగించేందుకు సూత్ర ప్రాయంగా నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అయితే అధికారికంగా స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంది. ఈ స్థలం ప్రభుత్వానికి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయగానే సచివాలయ పనులను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దసరా కంటే ముందుగానే అనుమతులు వస్తే వెనువెంటనే పనులు ప్రారంభం అయ్యే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. బైసన్ పోలో, జింఖానా గ్రౌండ్‌ల అప్పగింతపై జిహెచ్ఎంసి, ఆర్ అండ్ బి శాఖల అధికారులతో పాటు రాష్ట్రానికి చెందిన డిఫెన్స్ అధికారులను రక్షణశాఖ సంయుక్త కార్యదర్శి ఇటీవల ఢిల్లీకి పిలిపించుకుని చర్చలు జరిపారు. డిఫెన్స్ స్థలాలను ప్రభుత్వానికి అప్పగిస్తే ప్రతిగా రక్షణశాఖకు జవహర్ నగర్‌లో 593 ఎకరాల ప్రత్యామ్నాయ భూమి, అలాగే రూ. 93 కోట్లు చెల్లించాలని తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు అంగీకారం కూడా తెలిపింది. దరమిలా కేంద్ర ప్రభుత్వ స్థాయిలో ఈ భూమి అప్పగింతకు సంబంధించి రక్షణశాఖ కేంద్రంతో చర్చలు జరుపుతోంది. అవసరమైతే కేంద్ర కేబినెట్ సమావేశంలోనూ భూ బదలాయింపుపై చర్చించే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వానికి భూమి బదలాయింపు కాగానే నిర్మాణ పనులను వెనువెంటనే ప్రారంభించాలన్న ఉద్దేశం ప్రభుత్వానికి ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తంగా రెండు మూడు నెలల్లో సచివాలయం నిర్మాణ డిజైన్లను ఖరారు చేసి ముందుకు వెళ్లాలని భావిస్తున్నట్లు సదరు అధికారి వెల్లడించారు

దళితులని తెలిసే దాడి

- ఇసుక మాఫియా వెలుగులోకి రాకుండా హింస
- నిజనిర్ధారణ కమిటీ



మన తెలంగాణ/హైదరాబాద్: నేరెళ్లలో లారీకి నిప్పంటించినందుకు కాకుండా ఇసుక మాఫియా వెలుగులోకి రాకుండా ఉండేందుకే బాధితులను పోలీసులు చిత్రవధకు గురి చేసిందని నిజ నిర్ధారణ కమిటీ తెలిపింది. నేరెళ్ల ఘటనపై 23 మందితో కూడిన నిజ నిర్ధారణ కమిటీ నివేదికను బుధవారం నగరంలో జరిగిన మీడియా సమావేశంలో కమిటీ సభ్యులు విడుదల చేశారు. సమావేశంలో టిపిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నలమాస కృష్ణ, ఉపాధ్యక్షులు మెంచు రమేశ్, తెలంగాణ ప్రజాస్వామిక వేదిక కన్వీనర్ ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వర రావు, కుల నిర్మూలనా పోరాట సమితి ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, ప్రజా కళా మండలి ఉపాధ్యక్షులు రాజనర్సింహ, పౌర హక్కుల సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ లక్ష్మ ణ్ తదితరులు పాల్గొన్నారు. 'బాధితుల్లో దళితులున్నారని, అది తెలిసిన తర్వాతే పోలీసులు దాడి చేసి కులం పేరుతో దూషించారు. గత ఏడాది కాలంగా మిడ్‌మానేరు ప్రాంతం నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. నేరెళ్ల గ్రామం నుండి లారీలు తిరుగుతున్న కారణంగా నెలకు ఇద్దరు, ముగ్గురు మరణానికి గురౌతుండగా, 45 మంది గాయపడ్డారు. ఇసుక మాఫియాకు వ్యతిరేకంగా ప్రజల ఫిర్యాదులను అధికారులు పట్టించుకోలేదు. వరస మరణాలతో కోపోద్రిక్తులై ప్రజలు లారీని నిరసన తెలిపేందుకు లారీకి నిప్పంటించారు. అనంతరం ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌లలో చిత్రహింసలకు గురి చేశారు. స్వయంగా జిల్లా ఎస్‌పి బూట్లతో ఛాతిపై తొక్కారు. ఒక్కొక్కరిపై రెండు హత్యానేరం కేసులు మోపారు. జరిగిన విషయం ఎవ్వరికీ చెప్పకూడదని బెదిరించి కోర్టులో హాజరు పరిచి జైలులో నిర్బంధించారు. బాధితుల్లో ఎక్కువ మంది దళితులేనని, వారిని కులం పేరుతో దూషించారు. మంత్రి కెటిఆర్ బినామీలే ఇసుక దందా నడుపుతుండగా ఆయనే బాధితులను పరామర్శించి తమ ప్రేమయం లేదు. కేవలం ఎస్ఐను సస్పెండ్ చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుంది'' అని కమిటీ నివేదిక వెల్లడించింది. ఐటి శాఖ మంత్రి కె.టి.రామారావును మంత్రి వర్గం నుండి నుండి తొలగించాలని కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఇసుక మాఫియాను కప్పిపుచ్చడానికి ఇసుకను డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణానికి తీసుకెళ్తున్నామని చెబుతున్నారని, ఆ ఇసుకతో ఎక్కడ డబుల్ బెడ్ రూమ్‌లు నిర్మిస్తున్నారో చెప్పాలని వారు నిలదీశారు. సిరిసిల్ల ఎస్‌పితో పాటు ఘటనకు కారణమైన 18 మందిని తొలగించాలని, వారందరిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని, బాధితులపై మోపిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, మెరుగైన వైద్యం అందించాలని, ఇసుక కాంట్రాక్టర్లను బహిర్గతపరిచి మాఫియా దౌర్జన్యాలు, దాడులపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను ఆమోదించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.



సచివాలయం బోసిపోతోంది

పాలనపై ప్రజల అసంతృప్తి : చాడ

మన తెలంగాణ / హైదరాబాద్ : టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన గత మూడేళ్ల నుండి పరిపాలన సచివాలయం నుండి సాగకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి విమర్శించారు. ముఖ్యమంత్రిని కలిసే అవకాశం లేనందున ప్రజలు నేరుగా ప్రగతిభవన్‌కు పోయి నిరసన తెలియజేస్తున్నారని, ఇటీవల కాలంలో ప్రగతి భవన్ ముందు ఒక రైతు ఆత్మహత్య యత్నం చేయడమే అందుకు నిదర్శనమన్నారు. సిఎం సచివాలయానికి రానందున, ఆ ప్రభావం మంత్రులు, అధికారులపై పడుతున్నదన్నారు. చివరికి సచివాలయంలో పనులు జరిగే పరిస్థితి లేదని ప్రజలలో గ్రహించి రాకపోవడం వల్ల సచివాలయం బోసిపోతున్నదని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి సచివాలయంలో అందుబాటులో వుండి ప్రజల సమస్యలను పరిష్కరించాలని, వాగ్దానం చేసిన ప్రకారంగా నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాలని, రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలని, పరిపాలన సామాన్య ప్రజల స్థితిగతులు మెరుగుపడేవిధంగా సత్వర చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర సచివాలయం నుండి పరిపాలన ప్రజలకు అందించడానికి అనేక చర్యలు తీసుకుంటామని టిఆర్ఎస్ ప్రభుత్వం వాగ్దానం చేసినప్పటికీ మూడేళ్ల పరిపాలనలో తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, కోరికలు నెరవేరడం లేదన్నారు. పరిపాలన సామాన్య ప్రజల పరిస్థితులు మెరుగుపడే విధంగా లేదని, కార్పోరేట్ వర్గాల ఆస్తులు పెరగడానికే ఉపయోగపడుతుందని విమర్శించారు. గత మూడేళ్లుగా నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్న నేపథ్యంలో లక్ష మందికి పైగా నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇస్తామని ప్రభుత్వం చేసిన ప్రకటన నమ్మశక్యంగా లేదన్నారు

అటవీ ఉద్యోగుల అరణ్య రోదనను పట్టించుకోండి

సిఎంకు లేఖ రాసిన టిడిఎల్‌పి నేత రేవంత్‌రెడ్డి


మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను విస్మరించడంపై తెలుగుదేశం పార్టీ సాసనసభా పక్ష నేత ఎ. రేవంత్‌రెడ్డి సిఎం కెసిఆర్‌కు బుధవారం లేఖ రాశారు. ఉద్యమం సమయంలో తెలంగాణ ఏర్పడితే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని చెప్పినప్పటికీ కొంత మందిని, కొన్ని శాఖలలో పని చేస్తున్న వారిని మాత్రమే మేలు చేస్తున్నారు తప్ప అటవీ శాఖలో దీర్ఘకాలంగా పని చేస్తున్న వారిని విస్మరించడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. శాఖలో మొత్తం 3 వేల మంది బేస్ క్యాంప్ వర్కర్స్, స్ట్రైకింగ్ ఫోర్స్, చెక్‌పోస్ట్ వాచర్స్, వాచర్స్, అనిమల్ ట్రాకర్స్, బిల్డింగ్ వాచర్స్, బోర్డ్ వాచర్స్, గార్డెన్ వర్కర్స్‌గా ఖాకీ యూనిఫాంలో గడచిన 15 సంవత్సరాలుగా పని చేసున్నారన్నారు. వీరిలో కొంత మంది 35 ఏళ్ళుగా పని చేస్తున్న వారు కూడా ఉన్నారని పేర్కొన్నారు. ఇన్నేళ్ళు ఒకే సంస్థలో పని చేస్తున్నందున వీరిని ఎప్పుడో రెగ్యులరైజ్ చేయాల్సి ఉండాల్సింది కానీ అప్పటికీ జరగక పోవడం బాధాకరమన్నారు. ఈ మధ్యే వీరిని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా మార్చి వారి హక్కులను కాలరాసేందుకు ప్రయత్నం మొదలైందన్నారు. వీరి నెలసరి వేతనం కేవలం రూ. 6700లని పిఎఫ్, ఇఎస్ఐల కటింగ్‌లు పోతే చేతికి వచ్చేది రూ. 5,500 మాత్రమేనని తెలిపారు. పిఎఫ్, ఇఎస్ఐల డబ్బులను ఏళ్ళ తరబడి కట్ అవుతున్నా ఆయా విభాగాల ఖాతాలలో జమ కావడం లేదని, ఈ డబ్బు ఎక్కడకు పోతుందనేది మిస్టరీగా మారిందన్నారు. గతేడాది జీవో నంబర్ 14లో అటవీ శాఖలో తాత్కాలిక ఉద్యోగుల వేతనం పెంపు ఉత్తర్వులను జారీ చేసినా వాటిని పట్టించుకోలేదని, అరణ్య భవన్‌లో పని చేస్తున్న తాత్కాలిక ఎలక్ట్రీషియన్లు తమకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తే వారిని నుంచి తొలగించారని పేర్కొన్నారు. న్యాయం చేయాలని టిడిపి శ్రీకారం చుడుతుందని రేవంత్‌రెడ్డి తన లేఖలో హెచ్చరించారు.



పరిష్కారాలను సూచించండి

మన తెలంగాణ/హైదరాబాద్ : పారిశుధ్య రంగంలో దేశం ఎదుర్కొంటున్న సవాళ్ల పరిష్కారానికి ప్రజలు, మేధావులు, పరిశోధక విద్యార్థులు, సాంకేతిక కళాశాలల విద్యార్థులు తగిన సూచనలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.పి.సింగ్ కోరారు. తెలంగాణ స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ) ఆధ్వర్యంలో బుధవారం నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ హ్యాకతన్ 1.0ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మిషన్ భగీరథతో మరిన్ని గ్రామాలు బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలుగా మారనున్నాయన్నారు. పారిశుధ్యం, పరిశుభ్రతపై సమగ్ర అవగాహన కోసం ప్రజలకు సాధారణ మాధ్యమాలలో, సామాజిక మాధ్యమాల ద్వారా అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. ఘన, ద్రవ వ్యర్థ పదార్థాల నిర్వహణకై సమగ్రమైన పారిశుధ్య, పరిశుభ్రత ఆలోచనలు కావాలన్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్ మాట్లాడుతూ, 2000 గ్రామ పంచాయతీలు బహిరంగ మల విసర్జన రహిత పంచాయతీలుగా ప్రకటించుకున్నాయని, త్వరలో మరో 1200 పంచాయతీలు బహిరంగ మల విసర్జన రహిత పంచాయతీలుగా మారతాయన్నారు. సమస్యలను అధిగమించడానికి ప్రజలకు సాంకేతిక విధానాలను తెలియజేయాలన్నారు.

"మానవత్వంపై నమ్మకాన్ని ఎప్పుడూ కోల్పోకూడదు. మానవత్వం అన్నది మహాసముద్రం. కొన్ని చుక్కలు మలినంగా ఉన్నంత మాత్రాన సముద్రం మొత్తం మలినపడిపోదు.
– మహాత్మాగాంధీ"



సంపాదకీయం

లక్ష కాదు, 1లక్ష12వేలు!

ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నిరుద్యోగులకు తీపి కబురు అందించారు. గోల్కొండ కోట వద్ద జాతీయ పతాకావిష్కరణ అనంతరం ప్రసంగిస్తూ, 'ఇప్పటికి 27,600 ఉద్యోగ నియామకాలు చేశాం. ఈ సంవత్సరంలో మరో 84,876 ఉద్యోగ నియామకాలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దీంతో మేము వాగ్దానం చేసిన లక్ష ఉద్యోగాలను మించి మొత్తం 1,12,536 నియామకాలు జరుగుతాయి' అని ప్రకటించారు. మూడేళ్ల కాలంలో కల్పించిన ఉద్యోగాలు 27,660అయినప్పుడు, ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలివున్న 7 మాసాల్లో దాదాపు 85వేల ఉద్యోగ నియామకాలు సాధ్యమా? అన్న అనుమానం ఎవరికైనా కలగటం సహజం. భర్తీ చేయనున్న ఉద్యోగాలు ప్రధానంగా పోలీసు శాఖలో 37,820, విద్యుచ్ఛక్తి శాఖలో 12,961, ఉపాధ్యాయులు 12,005, గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులు 8,511, మెడికల్ అండ్ హెల్త్‌లో 8,347, సింగరేణి కాలరీస్‌లో 7,485, టిఎస్ఆర్‌టిసిలో 3,925, కొత్త గురుకుల స్కూళ్లలో 3925 ఉన్నాయి. వీటిలో కొన్నింటికి ఇంతకుమునుపే ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయినాయి. అయితే కోర్టు కేసులు వగైరా అవరోధాలతో నియామక ప్రక్రియ నిలిచిపోయింది. విద్యారంగంలో మాత్రం పరిస్థితులు మరీ అస్తవ్యస్థంగా ఉన్నాయి. ఉన్నత న్యాయస్థానం ఆక్షేపించినా అడుగు ముందుకు పడలేదు. తగినంతమంది పిల్లలు లేనందున స్కూళ్ల హేతుబద్దీకరణ ప్రక్రియ చేపట్టటం, ఖాళీలెన్నో కచ్చితంగా నిర్ధారణ కాకపోవటం తదితర కారణాలతో డిఎస్సీ వాయిదా పడుతూ వస్తున్నది. విద్యాశాఖమంత్రి కడియం శ్రీహరి బుధవారం అధికారులతో సమావేశమై, టీచర్ల రిక్రూట్‌మెంట్ ప్రక్రియపై ప్రాథమికంగా చర్చించారు. ఇటువంటి చర్చలు ఇదే తొలిసారికాదు. స్కూళ్లు, గురుకులాల్లో (పాత, కొత్త సహా)కలిపి 24,441మంది టీచర్ల నియామకం జరగాల్సి ఉంది. ముఖ్యమంత్రి స్వాతంత్ర్యదిన ప్రకటన తదుపరైనా విద్యాశాఖ చురుకుగా కదులుతుందని ఆశించుదాం.

లక్ష ప్రభుత్వోద్యోగాలు కల్పిస్తామన్న టిఆర్ఎస్ ఎన్నికల వాగ్దానాన్ని నెరవేర్చటంలో విపరీత జాప్యం పట్ల నిరుద్యోగ యువత తీవ్ర అసంతృప్తితో ఉంది. ప్రకటించిన పరీక్షలు వాయిదా వల్ల వారు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ అసంతృప్తిని ప్రభుత్వ దృష్టికి తెచ్చేందుకు ఎం.కోదండరాం ఛైర్మన్‌గా ఉన్న తెలంగాణ జెఏసి కొద్దిమాసాల క్రితం హైదరాబాద్‌లో నిరుద్యోగుల ర్యాలీ తలపెట్టగా దానికి అనుమతివ్వకుండా పోలీసులు భగ్నం చేయటం గుర్తు చేసుకోదగింది. ముఖ్యమంత్రి గణాంకాలతో ఏకీభవించని కోదండరాం దసరా తదుపరి 'నిరుద్యోగ' సమస్యపై హైదరాబాద్‌లో పెద్ద బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం ప్రధాన లక్ష్యాల్లో 'నియామకాలు' ఒకటి. రాష్ట్రం ఏర్పడే నాటికున్న ఖాళీలు ప్రాతిపదికగా టిఆర్ఎస్ లక్ష ఉద్యోగ నియామకాలను హామీ ఇచ్చింది. అయితే ఈ మూడేళ్లలో రిటైర్మెంట్ వలన ఏర్పడిన ఖాళీలను కలుపుకుంటే ఖాళీల సంఖ్య హెచ్చుగా ఉండటం సహజం. వాటిని కూడా పరిగణనలోకి తీసుకుని ముఖ్యమంత్రి కొత్తగా రిక్రూట్‌మెంట్ లక్ష్యం ప్రకటించి ఉండవచ్చు. ఏదిఏమైనా, ప్రకటనలతో ఊరించటంకన్నా నియామకాలు పరిపూర్తి చేయగలిగితేనే ప్రభుత్వం సానుకూల అభిప్రాయానికి పాత్రమవుతుంది. ఇప్పటివరకు రాష్ట్రానికి రూ.1,01,722 కోట్లు పెట్టుబడులు వచ్చాయని, 4,118 కొత్త పరిశ్రమలకు అనుమతులు, లైసెన్స్‌లు ఇచ్చామని, వాటివల్ల 2.90లక్షల ఉద్యోగాలు సృష్టించబడుతున్నట్లు కూడా ముఖ్యమంత్రి చెప్పారు.

తమ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించిన కెసిఆర్, అత్యంత జటిలమైన భూముల సర్వే మొదలుపెడుతున్నట్లు, వ్యవసాయరంగానికి వచ్చే వేసవి నుంచి 24గంటలు ఉచిత విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రం విద్యుత్ మిగులు రాష్ట్రం కానున్నదనే ఆయన అభిప్రాయం – ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో అత్యధికం భారీ ఎత్తిపోతలు అయినందున వేల మెగావాట్ల కరెంటు కావాల్సిన పరిస్థితుల్లో దూరాహ్యాంగా కనిపిస్తున్నది. ఏమైనా, పట్టుదల ఉంటే, లక్ష్యం దిశగా కృషికి అది ప్రోద్బలమవుతుంది. ఈ లక్ష్య సాధనపైనే రాష్ట్ర బహుముఖ అభివృద్ధి ఆధారపడి ఉంటుంది.

ఎఫ్‌సిఐ హత్య, ఆత్మహత్య!

చూపు


పంజాబ్‌లో 5 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు పనికిరాకుండా ముక్కిపోవడాన్ని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) ఇటీవల తీవ్రంగా తప్పు బట్టింది. తమ పంటలకు మంచి గిట్టుబాటు ధర రావడం లేదని గత జూన్‌లో దేశవ్యాప్తంగా రైతులు ఆందోళనలు జరిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస మద్దతు ధరకు తమ పంటలు కొనడానికి గట్టిగా ఎప్పుడూ సంకల్పించలేదని రాష్ట్రాల రైతులందరూ ఫిర్యాదు చేశారు. బియ్యం గాని, గోధుమగాని సేకరించడానికి ప్రభుత్వ ప్రొక్యూర్మెంట్ (సేకరణ) ఏర్పాట్లు తగినంతగా ఉండడం లేదన్నది వారి ఆరోపణ. ప్రభుత్వ సేకరణ కేంద్రాల వద్ద మౌలిక సౌకర్యాలు కొరవడడంతో పొడవాటి క్యూలు చోటు చేసుకుంటున్నాయి. లేదా అర్ధాంతరంగా ఆ కేంద్రాలు మూసివేస్తున్నారు. దేశవ్యాప్తంగా వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్లలో ఇదే పరిస్థితి నెలకొంది.

భారత ఆహార సంస్థ(ఎఫ్‌సిఐ)పై ఇటీవల కాగ్ నివేదిక విడుదల చేసింది. ఆహార ధాన్యాల సేకరణ బాధ్యత ఎఫ్‌సిఐకి ఎందుకు ఇవ్వలేదని ప్రభుత్వాన్ని కాగ్ ప్రశ్నించింది. కార్పొరేషన్ కోరిన ఆహార సబ్సిడీలో సగటున 67 శాతం మాత్రమే 2011 నుంచి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసినట్లు కాగ్ పేర్కొంది. అందువల్ల తన రోజు వారీ కార్యకలాపాలు సాగించడానికి హెచ్చువడ్డీకి ఆ సంస్థ రుణాలు తెచ్చుకోవలసింది వచ్చింది. ఆ రుణాలపై ఐదేళ్ల కాలంలో చెల్లించిన వడ్డీ మొత్తం రూ.35,000 కోట్లు. 2015–16లో మొత్తం ఆహార సబ్సిడీ రూ.1.03లక్షల కోట్ల కోసం ఎఫ్‌సిఐ కోరింది. అయితే రుణాలపై వడ్డీ మొత్తం దానిలో దాదాపు మూడోవంతు అయింది.

రికార్డుల నిర్వహణ లోపం

ఎఫ్‌సిఐ కూడా సరిగా రికార్డులు రూపొందించలేదని కాగ్ మందలించింది. రికార్డుల నిర్వహణలో కల్పితాలు ఉన్నాయని, అంతేకాకుండా 5 లక్షల టన్నుల ఆహార ధాన్యాలను పంజాబ్‌లో ముక్కిపోనిచ్చారని కూడా కాగ్ తీవ్రంగా తప్పుబట్టింది. ఆ రాష్ట్రంలో ప్రైవేటు వాణిజ్యవేత్తలకు అవకాశం ఇస్తూ ఎఫ్‌సిఐ అధ్వానంగా పని చేసినందువల్లే ధాన్యం ముక్కిపోయిందని కాగ్ విమర్శించింది. 1964లో అస్తిత్వంలోకి వచ్చిన ఎఫ్‌సిఐ రైతుల నుంచి ప్రభుత్వాలు హామీ ఇచ్చిన కనీస మద్దతు ధరకు బియ్యం, గోధుమ కొనుగోలు చేయాల్సి వుంది. ఆ పనిని సంస్థ స్వయంగా చేయవచ్చు లేదా రాష్ట్ర స్థాయి ఏజెన్సీల ద్వారా సేకరణ జరపవచ్చు. తర్వాత ఆ బియ్యం, గోధుమను ఎఫ్‌సిఐ నిల్వ చేస్తుంది. దేశంలో కష్టకాలంలో వాడడానికి భవిష్య నిల్వలుగా వాటిని ఎఫ్‌సిఐ భద్రపరచాలి. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ జరిగేది ఎఫ్‌సిఐ నిల్వల నుంచే. పేద ప్రజలకు సబ్సిడీ ఆహార ధాన్యాన్ని ఆ వ్యవస్థ ద్వారానే అందిస్తారు.

ఎఫ్‌సిఐ కోరిన నిధులలో 95 శాతాన్ని అదే సంవత్సరం కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాలి. తక్కిన 5 శాతాన్ని పార్లమెంట్‌కు ఎఫ్‌సిఐ అకౌంట్లను సమర్పించాక విడుదల చేయవలసి ఉంటుంది. అయితే 2011–12 నుంచి 2015–16 ఆర్థిక సంవత్సరం దాకా ప్రభుత్వం సగటున ఎఫ్‌సిఐకి విడుదల చేసిన మొత్తం నిధులు అది కోరిన దాంట్లో 67శాతం మాత్రమే. ఇందుకు రెండు కారణాలు ఉన్నాయి. గత ఐదేళ్లుగా ధాన్యసేకరణకు ఎఫ్‌సిఐ వ్యయం 33 శాతం పెరిగింది. ఈ ఐదేళ్లలో గోధుమపై కనీస మద్దతు ధరను 24 శాతం కేంద్రం పెంచడం ఒక కారణం. అంతే తప్ప ఎఫ్‌సిఐ ఎక్కువ స్థాయిలో సేకరణ జరపడం కారణం కాదు.



కోరినన్ని నిధులు ఇవ్వని కేంద్రం

ఎఫ్‌సిఐకి కేంద్రం నుంచి బాగానే నిధులు అందాయి. అయితే కోరినన్ని నిధులు మాత్రం అందలేదు. కోరిన దానికి, అందిన దానికి మధ్య అంతరం కూడా పెరిగింది. ఫలితంగా ఎఫ్‌సిఐ ఆహార ధాన్యాల సేకరణ కొనసాగించడానికి 10 శాతం నుంచి 12 శాతం దాకా వడ్డీ రేటుపై రుణాలను సేకరించక తప్పలేదు. ఈ వడ్డీని కూడా తనకు ఇవ్వాల్సిన నిధులుగా చూపి కేంద్రాన్ని డిమాండ్ చేయడంతో కేంద్ర ప్రభుత్వ ఆహార సబ్సిడీ మొత్తం గణనీయంగా పెరిగింది. ఈ అంశాన్ని కూడా కాగ్ ఎత్తిచూపింది. సకాలంలో సబ్సిడీ క్లైమ్‌లకు నిధులు మంజూరు చేసి ఉంటే వడ్డీ తాలూకు అదనపు భారం తగ్గేదని కాగ్ అభిప్రాయపడింది. ప్రభుత్వ సెక్యూరిటీల ద్వారా నిధులు చెల్లించాలని లేదా బాండ్స్ ద్వారా నిధుల సేకరణకు అనుమతించాలని ఎఫ్‌సిఐ 11 లేఖలను కేంద్రానికి రాసింది.

11వ లేఖ అందిన తర్వాత ఆ డిమాండ్‌ను తిరస్కరిస్తూ కేంద్రం జవాబిచ్చింది. దానితో ఎఫ్‌సిఐ అవస్థ మరింత ముదిరింది. 63 బ్యాంకుల కన్సార్టియం స్వల్పకాల రుణాలకు ఎఫ్‌సిఐకి అనుమతి ఇవ్వలేదు. దాని నగదు పరిమితి పూర్తిగా ఖర్చు అయిపోవడంతో కన్సార్టియం ఆ నిర్ణయం తీసుకుంది. దాంతో ఎక్కువ వడ్డీ చెల్లించాల్సిన నిధిని ఆ బ్యాంకులు ఎఫ్‌సిఐకి కేటాయించాయి. ఎఫ్‌సిఐ పనితీరులో కూడా లోపాలను కాగ్ విమర్శించింది. అది అకౌంట్లను మార్చి చూపించిందని, జరగని కొన్ని పనులు జరిగినట్లు రికార్డులు సృష్టించిందని, నిల్వ సామర్థ్యం పెంచడంలో తీవ్ర అసమర్థతకు చోటు ఇవ్వడంతో పంజాబ్‌లో లక్షల టన్నుల ఆహార ధాన్యం పుచ్చిపోయిందని కాగ్ తప్పుబట్టింది.

ఎఫ్‌సిఐ కొత్తగా కార్మికులను తీసుకోవడం మానివేసినప్పటికీ ప్రభుత్వ రోల్స్‌లో లేని కార్మికులను కిరాయికి తీసుకొన్నట్లు తెలుస్తోందని కాగ్ పేర్కొంది. ఇందుకు రికార్డు తారుమారు చేసినట్లు కూడా పేర్కొంది. ఈ ఉదంతం కొన్ని హేయమైన అబద్ధాలకు దారితీసింది. నాగాలాండ్‌లోని దిమాపూర్‌లోని ఏడుగురు కార్మికులు ఒక్కరోజులో ఎనిమిది వేల బస్తాలను లోడింగ్, అన్‌లోడింగ్ చేసినట్లు చూపింది. 2015 అక్టోబర్‌లో జరిగినట్లు చూపిన ఈ ఉదంతంలో వారు మోసినది దినసరి సగటుకంటే 10 రెట్లు ఎక్కువ బస్తాలు. సగటున రోజుకు 105 బస్తాలను మించి ఏడుగురు కూలీలు మోయలేరు. అంతేకాకుండా అదే చోట ఒకే నెలలో ఇద్దరు మనుషులకు రూ. రెండు లక్షలు పైగా ప్రోత్సాహకాలు లభించాయి. ఇది కూడా అతిశయోక్తే. ఈ విధంగా ఎఫ్‌సిఐ నిర్వాకాన్ని, నిధుల చెల్లింపులో ప్రభుత్వాల ఆలస్యాన్ని ఫలితంగా ఎదురైన విరుద్ధ పరిణామాలను కాగ్ ఏకరువుపెట్టింది.

* మృదుల చారి

లాఠీ ముక్త్ భారత్ కావాలి



బి.నర్సన్
9440128169

ప్రభుత్వాలు ఒక సంఘటనపై మౌనం వహించినా, ఆలస్యంగా స్పందించినా, వంకరటింకరగా మాట్లాడినా వాటి వెనుక వైఫల్యమే దాగి ఉంటుంది. స్వీయ ప్రయోజనాలకోసం, విశ్వాసాల కోసం తీసుకునే విచక్షణ, వివేచన రహిత నిర్ణయాలు ఎదురు ప్రశ్నలకు గురయినపుడు అవి చట్టాలను, విధానాలను పక్కనపెట్టి క్రపెత్తనాన్ని ముందుకు జరుపుతాయి.

ప్రపంచంలో శారీరక హింసతో దారికి రాని ప్రాణి ఏదీ లేదు. రాజ్యాంగం, చట్టాలు, తీర్పులు, శిక్షలు చేయలేని పనిని లాఠీ చేసి పెడుతుంది. బడితె ఎవడిదో బర్రె వాడిదే, దండనం దశగుణం, సామదాన భేద దండోపాయాలు, దెబ్బకు దయ్యం దిగి వస్తుంది లాంటి సామెతలు తరతరాలుగా సామాన్యుడిపై స్వారీ చేస్తూనే ఉన్నాయి.

> డిక్షనరీలోలేని థర్డ్ డిగ్రీ పదాన్ని డిపార్టుమెంటు లో కూడా లేకుండా చేయాలి. పోలీసులపై ఒత్తిడి పెంచకుండా వారు తగిన సమయాన్ని తీసుకొని కేసు ను ముగించేలా వాతావరణం కల్పించాలి. ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగులు ఇంటికి వస్తే పలకరించినంత నిబ్బరంగా పౌరులు పోలీసును ఆహ్వానించగలగాలి. ఫ్రెండ్లీ పోలీసింగ్ అప్పుడే సార్థకమవుతుంది. ఐపిసి సెక్షన్ 370 ప్రకారం పోలీసు ఎవరి చెంపమీద కొట్టినా తప్పు చేసినట్లే, పోలీసులు ఎంత హింసించి, ఎన్ని తెల్లకాగితాల మీద సంతకాలు తీసుకున్నా ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ సెక్షన్ 25 & 26 ప్రకారం నిందితుడు స్వయం గా జడ్జిముందు తప్పు ఒప్పుకుంటేనే చెల్లుబాటవుతుంది.

ఎవరిని దండిస్తే అడిగే వారుండరనిపించినపుడు, పాలకులే దండనకు పురికొల్పినపుడు రాజ్యహింస తారస్థాయికి చేరుకుంటుంది.

ఈ మధ్య జరిగిన రెండు, మూడు సంఘటనలను ఉదహరించుకుంటే యూనిఫాం ఉద్యోగులు వివిధ వర్గాలతో వ్యవహరించిన తీరును గమనించవచ్చు.

సిరిసిల్ల–రాజన్న జిల్లాలో జులై 2 న నేరెళ్ల గ్రామానికి చెందిన 8మంది దళిత, వెనుకబడిన తరగతులకు చెందిన వారిని పోలీసులు రాత్రి పదకొండు తర్వాత ఇళ్ల వద్ద అదుపులోకి తీసుకున్నారు. నాలుగు ఇసుక రవాణా లారీల దగ్ధం సంఘటనలో అనుమానితులుగా భావించి వారిని ఠాణాకు తీసికెళ్లారు. ఆ నేరాన్ని ఒప్పుకొమ్మని పోలీసులు వారిని చిత్రహింసలు పెట్టి, జైలర్ నిరాకరణతో, దవాఖానాలో చేర్పించారు. ఈ సంఘటన ఇప్పుడు రాష్ట్రాన్ని కుదిపివేస్తోంది. లాఠీచార్జికి ఆజ్ఞాపించిన ఒక ఎస్సైని సస్పెండ్ చేసి ప్రజాగ్రహాన్ని చల్లబరచి, ప్రభుత్వాన్ని రక్షించేందుకు అటు పోలీసు శాఖ, ఇటు వైద్యబృందం నానా తంటాలు పడుతున్నాయి.

రెండో సంఘటనగా జులై 19 నుండి 30వ తేదీవరకు హైదరాబాద్‌లో ఎక్సైజ్ అధికారుల సిట్ పన్నెండు మంది సినిమావాళ్లను నిషేధిత మత్తు వాడకంపై విచారించిన తీరును పరిశీలించవచ్చు. డ్రగ్స్ సరఫరాదారు కెల్విన్ దగ్గరున్న సమాచారం ఆధారంగానే వీరిని విచారించడం జరిగింది. వీరి విచారణ తతంగమంతా సిసి కెమెరాల ద్వారా చిత్రీకరించారు. వీరికి టీలు, కాఫీలు, లంచ్ అందించబడ్డాయి. ఇస్తామన్న వారి దగ్గరినుంచే రక్తం, గోళ్లు, వెంట్రుకల నమూనాలు సేకరించారు. చట్టం వీరిపట్ల నాలుగు పాదాలపై నడిచింది.

మరో సంఘటన విషయానికొస్తే – ఈ మధ్య భూదందాలో ఇరుక్కొన్న హైదరాబాద్‌లోని రాయదుర్గం అదనపు డిసిపి, సిఐ, ఎస్సై, కానిస్టేబుల్‌పై కేసు నమోదైంది.16 గంటలపాటు తనను నిర్బంధించి బలవంతంగా చెక్కులపై సంతకాలు తీసుకున్నారని బాధితుడు సైబరాబాద్ సిపి సందీప్ శాండిల్యను కలిసి మొరపెట్టుకున్నాడు. మాదాపూర్ ఎసిపి ఆధ్వర్యంలో విచారణ జరిపించి ప్రభుత్వం వారిపై చర్యను తీసుకుంది. అంతటితో వదిలేయక నిందితులపై అంటే సస్పెండ యిన పోలీసు సిబ్బందిపై సెక్షన్ 447(అనుమతి లేకుండా ఇంట్లోకి ప్రవేశించడం), 365(కిడ్నాప్)384(బెదిరింపులకు పాల్పడడం) 452(అక్రమంగా నిర్బంధించడం) 147, 149ల కింద కేసు నమోదు చేయడం కూడా జరిగింది.

పై మూడు సందర్భాల్లో కొందరు అనుమానితులు, కొందరు నిందితులు ఉన్నారు. విచారణలో మాత్రం భూమ్యాకాశాల వ్యత్యాసముంది. సినిమా వాళ్ల విచారణలో పాటించిన పద్ధతుల్లో ఏదీ నేరెళ్ల సంఘటనలో కానరాదు. నేరెళ్ల బాధితుల విషయంలో పోలీసులపై కేసు పెట్టదలిస్తే భూదందాలో ఇరుక్కున్న పోలీసులపై కన్నా నాలుగు సెక్షన్‌లు ఎక్కువే పెట్టవలసి వస్తుంది. బాధితులకు సమన్యాయం జరుగలేదని ఈ సంఘటనలే చెబుతున్నాయి. నేరాన్ని అంగీకరించేలా చేసేందుకు లాఠీ ఒక కేసులోనే వాడబడింది.

నేరెళ్ల బాధితుల కుటుంబాలు గుండెలవిసేలా దుఃఖించిందీ వారి వాళ్ల శరీరంపై ఉన్న గాయాల గురించేగాని, వారిపై నమోదు చేసిన అభియోగాల గురించి కాదు. చిత్రహింసలు అనుభవించిన వారు సైతం కేసుల గురించి వెరవకుండా ఇంత నరకాన్ని చూపిస్తారా అని గోస పడుతున్నారు. లారీల దగ్ధంపై ఎలాంటి సాక్ష్యాధారాలు దొరకనందున కొందరిని పట్టుకొచ్చి థర్డ్‌డిగ్రీ ద్వారా ఒప్పించి కేసు మూసేద్దామని పోలీసులు భావించారు. వాస్తవానికి పోలీసులు ఆధారాలు దొరికేదాకా ఆగవచ్చు లేదా ఆధారాలు దొరకడం లేదని నిర్ణీత కాలం తర్వాత కేసును పక్కనపెట్టవచ్చు, ముగించేయవచ్చు కూడా. పోలీసు శాఖకు వచ్చిన ఫిర్యాదుల్లో తేలని కేసులే ఎక్కువగా ఉంటాయి.

అయితే కొన్ని కేసుల విషయంలో పోలీసులు తొందరపడడానికి కారణం రాజకీయ ఒత్తిడులే. పాలకులకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రతి సంఘటనకు పోలీసు లాఠీని వాడుకోవడం ప్రపంచమంతా సాగుతోంది. ప్రజలు ఎదురు తిరగడానికి కారణాలు వెతకకుండా అణచివేతనే అస్త్రంగా వాడడం వల్ల లాఠీలకు పని పడుతుంది.

నేరెళ్ల ఇసుక రవాణా విషయంలో పలు శాఖల తప్పిదాలు ఉన్నాయి. అవి సక్రమంగా పనిచేస్తే, ఆయా శాఖలకున్న నిబంధనలను పాటింపచేస్తే ప్రజాగ్రహం దాకా విషయం వెళ్లదు. లారీల వేగాన్ని, బరువును నియంత్రించే వారు కరువైనారు. లారీలు అధిక వేగంతో చేస్తున్న ప్రమాదాలపై తగిన చర్యలు లేవు. ఈ నియంత్రణ వ్యవస్థలు విధులు సరిగా నిర్వర్తిస్తే విషయం నిప్పు దాకా పోక పోయేది. అయితే ఈ వ్యవస్థల వైఫల్యాలకు కారణమెవరో ఊహించవచ్చు. తమ తప్పిదాలకు అడ్డు వచ్చిన వారిని లాఠీతో తొలగించుకోవచ్చనే ధైర్యమే పాలకులను ఈ బాట పట్టిస్తుంది.

భారతీయుల నైజం తెలిసిన ఆంగ్లేయులు పోతూ పోతూ మన నాయకుల చేతికి లాఠీ ఇచ్చి వెళ్లారు. దీన్ని వాడితే మీకు ఎదురుండదని చెవిలో ఊదారు.

స్వాతంత్ర్యం వచ్చినా, తెలంగాణ వచ్చినా లాఠీ జోరు మాత్రం తగ్గలేదు. పైగా పెరిగిందనవచ్చు. యూనిఫాం ఉద్యోగులు సరిపోక కొందరు ప్రభుత్వాల తరఫున ముఠాలుగా ఏర్పడి ప్రజల్ని వేపుక తింటున్నారు, గోరక్షకదళాల పేరిట ప్రైవేటు సైన్యాల దాష్టీకాలను తగ్గాలంటూనే వారికి లైసెన్సులు ఈయడానికి ఉత్తరాన కొన్ని ప్రభుత్వాలు రంగం సిద్ధం చేస్తున్నాయి.

తెలంగాణలో ఫ్రెండ్లీ పోలిసింగ్ అంటుంటే ఆ శాఖ ఎవరితో ఫ్రెండ్లీగా వ్యవహరిస్తుందో జరుగుతున్న సంఘటనలే నిరూపిస్తున్నాయి. భేష్‌భేష్ అంటూ పోలీసుశాఖను దువ్వడం వెనుకాల ప్రభుత్వాల సొంత ప్రయోజనాలు దాగి ఉన్నాయి. నిజంగా ప్రభుత్వాలు సామాన్యుడిని పోలీసు హింసనుండి కాపాడాలనుకుంటే స్టేషన్లలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలి. విచారణ గదుల్లో వాడుతున్న వస్తువులను తనిఖీ చేసే బృందం ఉండాలి.

డిక్షనరీలోలేని థర్డ్ డిగ్రీ పదాన్ని డిపార్టుమెంటులో కూడా లేకుండా చేయాలి. పోలీసులపై ఒత్తిడి పెంచకుండా వారు తగిన సమయాన్ని తీసుకొని కేసును ముగించేలా వాతావరణం కల్పించాలి. ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగులు ఇంటికి వస్తే పలకరించినంత నిబ్బరంగా పౌరులు పోలీసును ఆహ్వానించగలగాలి. ఫ్రెండ్లీ పోలీసింగ్ అప్పుడే సార్థకమవుతుంది. ఐపిసి సెక్షన్ 370 ప్రకారం పోలీసు ఎవరి చెంపమీద కొట్టినా తప్పు చేసినట్లే, పోలీసులు ఎంత హింసించి, ఎన్ని తెల్లకాగితాల మీద సంతకాలు తీసుకున్నా ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ సెక్షన్ 25 & 26 ప్రకారం నిందితుడు స్వయంగా జడ్జిముందు తప్పు ఒప్పుకుంటేనే చెల్లుబాటవుతుంది.

'బుద్ధుడు' క్రీ.పూ.1887లో జన్మించాడా?

శ్రీమద్భాగవతంలోని "తతా కాలే సంప్రావిత్తి సమ్మోహాయ సురా ద్వీపం బుద్ధో నామ్న అంజనా సూత, కైకతేష్ భవిష్యతి" (1:324) అనే శ్లోకం బుద్ధుడు కలియుగం ప్రారంభంలో, బీహార్‌లోని "కైకత" పట్టణంలో జన్మిస్తాడు అని పేర్కొంది. కైకత, గయా నగరం పాత పేరు. అందువలన బుద్ధుడు జన్మించిన క్రీ.పూ.3000 సంవత్సరం అవుతుంది. బుద్ధుడు దశావతారాల్లో 9వ వాడు. బ్రాహ్మణ కులానికి చెందిన వాడు. శ్రీమద్భాగవతం ప్రకారం తల్లి పేరు అంజన, తండ్రి పేరు హేమ సదన.

స్కందపురాణంలోని మహేశ్వర విభాగంలోని 40వ అధ్యాయం బుద్ధుడు అంజని, హేమ సదన దంపతులకు మగధ సామ్రాజ్యంలో జన్మిస్తాడని పేర్కొంటుంది. ఏడు ఖండాలతో కూడిన భూమండలాన్ని 64 సంవత్సరాల పాటు పరిపాలిస్తాడని పేర్కొంది. భవిష్యత్ పురాణం బుద్ధుడు క్రీ.పూ.2500లో "పట్టణ" (పాట్నా)లో మౌర్య వంశంలో జన్మిస్తాడని, మగధ సామ్రాజ్యాన్ని 10 సంవత్సరాలు పరిపాలిస్తాడని పేర్కొంది. భవిష్య పురాణం ప్రకారం బుద్ధుని తండ్రి పేరు కస్సప (కశ్యప).

పురాణాల ప్రకారం బుద్ధుడు, ఇక్ష్వాకు వంశంలో 139వ రాజు. అందువలన బుద్ధుడు జన్మించిన సంవత్సరం క్రీ.పూ.1887 అవుతుంది. మగధ రాజు అజాత శత్రువు క్రీ.పూ.1814–1787 వరకు పరిపాలించాడు. బుద్ధుడు ఇతడి పరిపాలన కాలంలోనే సన్యాసం తీసుకున్నాడు.

గౌతమ బుద్ధుడు క్రీ.పూ.1887లో జన్మించాడని చరిత్రకారులు స్టీఫెన్ నాల్ "Were there two Budhas?" అనే వ్యాసంలో అభిప్రాయ పడుతున్నారు. ప్రొ.కె. శ్రీనివాస రాఘవన్, పండిట్ కోట వెంకటాచలం, పి.యన్.ఓక్ వంటి చరిత్రకారులు కూడా తమ రచనలు వరుసగా "Chronology of Ancient Bharat, The Age of Budha మరియు Some blunders in Indian historical research" లో గౌతమ బుద్ధుడు క్రీ.పూ.2200 క్రీ.పూ.1887 మధ్య ప్రాంతంలో జన్మించాడని అభిప్రాయపడుతున్నారు.

ఇక్ష్వాకు వంశంలో 145వ (చివరి) రాజు సుమిత్ర. ఇతడు శుంగ వంశానికి చెందిన మగధ రాజు మహా పద్మ నందుడు చేతిలో క్రీ.పూ.1634లో మరణించాడు. అందువలన బుద్ధుడు క్రీ.పూ.1634కు ముందే ఖచ్చితంగా జన్మించి ఉండాలి. చాణక్యుడు మహా పద్మనందుడికి సమకాలీనుడు. చంద్రగుప్తుడు మహా పద్మ నందుడిని చంపి చక్రవర్తి కావడానికి చాణక్యుడు సహాయం చేశాడు. చంద్రగుప్తుడు క్రీ.పూ.1630లో మగధ సామ్రాజ్యానికి చక్రవర్తి అయ్యాడు.

బుద్ధుడు, గౌతమ బుద్ధుడు ఒకరు కాదు. గౌతమ బుద్ధుడు రెండవ బుద్ధుడు. ఇతడు దైవాంశతో జన్మించలేదు. నిజంగా ఉన్నాడో, లేడో తెలియదు. ఇతడి సంప్రదాయాలు హిందూ మతానికి వ్యతిరేకం. విగ్రహారాధనను వ్యతిరేకించాడు. మాంసాహారాన్ని తినేవాడని బౌద్ధ గ్రంథాలు చెబుతున్నాయి. గో వధను సమర్థించాడు. ఇతడు తినకుండా నిషేధించిన జంతువులలో ఆవు లేదు. నేపాల్‌లో జన్మించాడు. వాస్తవానికి భారతీయులు తెలుసు కోవాల్సింది మొదటి బుద్ధుడి గురించి, రెండవ బుద్ధుడి గురించి కాదు. ఆది శంకరాచార్య కూడా శూన్య వేద గౌతమ బుద్ధుని శిష్యులు భారత దేశంలో ఉండకూడదని చెప్పడం జరిగింది.

రావణాసురుడు కూడా మొదటి బుద్ధుని, జిన పుత్రుడు లేదా అంజన పుత్రుడుగా కీర్తించినట్లు బౌద్ధ గ్రంథం "లంకావతార సూత్ర" పేర్కొంటుంది. అహింస గురించి బోధనలు చేస్తున్నందు వలన రాజు ఆగ్రహించి మొదటి బుద్ధుడికి మరణ శిక్ష విధించాడని జాతక కథలు పేర్కొంటున్నాయి. అందువలన బుద్ధునిది సహజ మరణం కాదని అర్థం అవుతుంది. ఎక్కువమంది చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం బుద్ధుడు క్రీ.పూ.1887 మధ్య ప్రాంతంలో, గయలో జన్మించాడు అని అర్థం అవుతుంది. బుద్ధుడు ఏ విధంగా చూసిన క్రీ.పూ.1880 తర్వాత జన్మించే అవకాశం లేదు. బుద్ధుడు క్రీ.పూ.560లో నేపాల్ లోని కపిల వస్తులో జన్మించలేదు. బ్రిటిష్ చరిత్రకారులు బుద్ధుడు, అజాత శత్రువు, మౌర్య చంద్ర గుప్తుని, మౌర్య వంశ రాజుల జననాన్ని తప్పుగా నమోదు చేశారు. భారత దేశ చరిత్రను పునర్ లిఖించుకోవాల్సిన అవసరముంది.

* * *

Refference article:
1.(https://www.booksfact.com/history/gautamabuddha yearbirth1887bce.html)

– పుట్లూరు రాంనర్సింహారెడ్డి, 9505885249

మూఢ నమ్మకాలపై వైజ్ఞానిక ప్రచారం

ఎడిటర్‌కు లేఖ

జనవిజ్ఞాన వేదిక, హేతువాద, మానవవాద, నాస్తిక, మానవ వికాస తదితర సంఘాలకు విజ్ఞాపన. జ్యోతిష్యం చెప్పేవారిని, ముహూర్తాలు, గ్రహబలాలు ప్రచారం చేసేవారిని, అధికారంలో వుండి గ్రహణాలను, దుర్ముహూర్తాలను పాటించే వారిని రాష్ట్ర గవర్నర్, కీలక పదవుల్లో వున్న మిత్రులను కొందరిని ప్లానిటేరియంకు తీసుకువెళ్ళండి. ముందుగా అక్కడివారితో, రఘునందన్, చందనా చక్రవర్తి వంటివారితో సంప్రదించి ఏర్పాటు చేయండి.

టెలిస్కోపులో నక్షత్రాలను, గ్రహాలను చూపండి. ఉపగ్రహాలకు, గ్రహానికి తేడా విడమర్చి చెప్పండి. జ్యోతిష్యంలో నమ్మించే రాహువు, కేతువు వంటివి ఎక్కడైనా ఉన్నాయేమో టెలిస్కోపు ద్వారా అన్వేషించండి. గ్రహానికి, ఉపగ్రహానికి భేదం ఏమిటో స్పష్టం చేయండి. లేని గ్రహాల ప్రభావం చెప్పకూడదని వారికే తెలుస్తుంది. ఆ విధంగా వైజ్ఞానిక పద్ధతిలో ప్రచారం చేయగలిగితే చాలా ఉపయోగపడుతుంది. వారికి, మూఢ నమ్మకస్తులకు విషయం తెలిసివస్తుంది.

ఈ కృషి కష్టతరమైనా దీర్ఘ కాలికంగా చాలా ఉపయోగపడుతుంది. కేవలం జ్యోతిష్యం, వాస్తు శాస్త్రజ్ఞులను ముహూర్తాలను చెప్పేవారిని ఖండించటమే కాక వారి దోషంతో వారి ద్వారానే ఒప్పించగలిగితే మంచి ఫలితాలు వస్తాయి. ప్రజలకు విషయం తేటతెల్లమవుతుంది. ఇది కష్టసాధ్యమయినా సత్ఫలితాలనిచ్చే ప్రయత్నం.

– ఇన్నయ్య విజ్ఞప్తి

స్వాతంత్ర్య సమర సమయంలో భారతీయులను ఏకం చేసి వారిలో సమర స్ఫూర్తి నింపేందుకు బాలగంగాధర్ తిలక్ గణేశ మండపాలను వేదికచేసుకున్నాడు. ఈ మండపాలునగరాలు, పట్టణాల్లో మాత్రమే ఏర్పాటయ్యాయి. కాలానుగుణంగా అన్నింటిలో మార్పు వచ్చినట్లే గణేశ విగ్రహాలు, మండపాల్లో కూడా మార్పు వచ్చింది. ఈ ఆచారం పట్టణాలు, నగరాల నుంచి దేశంలోని మారుమూల పల్లెలకూ వ్యాపించింది. ఒకప్పుడు దేశ యువతను ఏకం చేసేందుకు ఏర్పాటుచేసిన గణేశ మండపాలు నేడు అనేకంగా ఏర్పడ్డాయి. సమాజంలో ఉన్న అన్ని రకాల చీలికలు గణేశుని మీద కూడా ప్రసరించాయి. ఫలితంగా ఆయన కులాలు, వాడలు, పిల్లా, పెద్దల వారీగా విభజన చెందాడు. విడిపోయిన మండపాలు మనుషులను విడదీశాయి. పోటాపోటీగా మండపాల్లో కొలువవుతున్న గణేశ విగ్రహాల మధ్య స్పర్థ ఘర్షణలకు దారితీయడం కూడా అడపాదడపా చూస్తున్నాం. పోటీకి తగ్గట్లుగా విగ్రహాలను తయారుచేయడంలో కళాకారులు కూడా పోటీ పడుతున్నారు. పర్యవసానంగా ఏటికేడు వివిధ రంగులు, సరికొత్త డిజైన్లలో విగ్రహాలు దర్శనమిస్తున్నాయి. ఇలా సంఖ్యాపరంగా పెరిగిన గణేశ విగ్రహాలు కేవలం మనుషులను విడదీయడమే కాకుండా, వాటి తయారీలో వాడే హానికారక రసాయనాల వల్ల పర్యావరణం దెబ్బతింటోంది.

మొక్కే గణేశుడు

దేశంలో అన్నివర్గాలకు చెందినవారు వినాయక చవితికి పదిహేను రోజుల ముందు నుంచి ఉత్సాహంగా ఏర్పాట్లలో నిమగ్నమయి, బప్పా మోరియా రాకకై ఎదురుచూస్తారు. ఇంతటి ఉత్సాహభరితమైన పండుగను కొన్ని మార్పులు చేర్పులతో చేసుకుంటే ఎవరికి ఏ రకమైన హాని కలుగదు. 'షేర్ ఎ సర్వీస్' అనే స్వచ్ఛంద సంస్థ ఈ ఆలోచనకు కార్యరూపం ఇచ్చి పర్యావరణహితమైన గణేశులను తయారుచేస్తోంది. సంస్థ అనేక సమాజ హిత కార్యక్రమాలతో పాటు పది సంవత్సరాలనుంచి మట్టి గణేశ విగ్రహాలను తయారుచేసి అందిస్తోంది. ఇటీవలి కాలంలో ఆలోచనలకు మరింత పదునుపెట్టి మొక్క గణేశుడిని తయారుచేస్తున్నారు. దీంతో పాటు అంతగా ఆదరణకు నోచుకోని కుమ్మరి వృత్తి వారిని చేరదీసి మట్టి వినాయకుల తయారీతో వారినీ ప్రోత్సహిస్తున్నారు. పలు పాఠశాలల్లో కూడా మొక్క గణేశ విగ్రహ తయారీకి సంబంధించిన వర్క్‌షాప్స్ నిర్వహిస్తూ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రజల్లో అవగాహన కూడా కల్పించేందుకు స్వచ్ఛందంగా ఈ సంస్థలో పనిచేస్తున్న హైదరాబాదీ విశాల గుమ్ములూరు **మన తెలంగాణ**తో పంచుకున్న మరిన్ని ముచ్చట్లు ...



'షేర్ ఎ సర్వీస్' లో భాగంగా వినాయక చవితి సమయంలో మట్టి వినాయక విగ్రహాలను తయారుచేసి అందిస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారుచేసిన విగ్రహాలను చెరువులు, కుంటలు, నదుల్లో నిమజ్జనం చేయడం వల్ల అవి కలుషితమై, జీవ, జంతుజాలానికి హానికారకంగా మారుతున్నాయి. పర్యవసానంగా బయోడైవర్సిటీ దెబ్బతిని పర్యావరణానికే ముప్పు ఏర్పడుతోంది. అలాగని సంవత్సరానికోసారి వచ్చే పండుగను జరుపుకోకుండా ఉండమని ఎవరూ చెప్పలేరు. దీనికి విరుగుడే పర్యావరణహితమైన మట్టి గణేశ విగ్రహాలు. చిన్న విగ్రహాలతో మొదలైన వీరి ప్రయాణం భారీ విగ్రహాల వరకు వెళ్లింది.

కుమ్మరులకు ఆసరాగా నగరంలో, నగరశివారుల్లో నివసిస్తున్న దాదాపు 100 మంది కుమ్మరుల లిస్టు సేకరించి, వారికి వినాయక విగ్రహాల ఆర్డర్లను ఇస్తారు. మట్టితో వినాయకులను చేసే విధానాన్ని కలకత్తా కళాకారులను చూసి ఈ విధంగా మనదగ్గరి కుమ్మరులతో చేయించాలని సంకల్పించారు ఈ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి నుంచే సాంచా(మౌల్డ్స్) చేసుకొని విగ్రహాలను తయారుచేయడం మొదలుపెడతారు. ఈ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు అదే సమయం నుంచి వారికి సూచనలు ఇస్తూంటారు. వివిధ కాలనీలు, హౌసింగ్ సొసైటీల వద్దకు వెళ్లి మట్టి గణేశుల వాడకంపై అవగాహన కల్పిస్తారు. అయితే చిన్నసైజు విగ్రహాలు కేవలం ఇండ్లలోనే ఏర్పాటుచేసి, పరిసరాల్లోనే నిమజ్జనం చేస్తారు. పెద్ద సైజు విగ్రహాలను చెరువుల్లో, నదుల్లో నిమజ్జనం చేస్తారు. పర్యావరణానికి ముప్పు కూడా వీటితోనే ఉంటుందని గత కొన్నేళ్లుగా మండపాలు ఏర్పాటుచేసే వారిదగ్గరికి వెళ్లి మట్టి విగ్రహాలపై అవగాహన కల్పిస్తున్నారు. వారి కోరుకున్న సైజు, డిజైన్లలో విగ్రహాలను తయారుచేయించి అందిస్తున్నారు. ఈ క్రమంలో మట్టితో చేసిన పెద్ద విగ్రహాలకు బీటలు వారితే పూర్తి బాధ్యత స్వచ్ఛంద సంస్థవారే తీసుకుని మరో విగ్రహాన్ని అందించే గ్యారంటీ కల్పిస్తున్నారు. ఇలా కుమ్మరులకు, మండపాల నిర్వాహకులకు మధ్యన వారధిగా నిలుస్తూ మట్టి గణేశ ప్రతిమలను మండపాల్లో పెట్టేవిధంగా ప్రయత్నిస్తున్నారు. వినాయక విగ్రహం వెనక ఒక పేపర్ గ్లాస్‌ను అమర్చి



దాన్ని మట్టితో కప్పేసి అందులో మొక్కను నాటుతారు. ఈ విగ్రహాన్ని నిమజ్జనం చేసేప్పుడు ఇంటి దగ్గర ఖాళీ స్థలం ఉన్నవారు ఓ గుంటను తవ్వి దాన్లో నీళ్లు నింపి నిమజ్జనం చేసుకోవచ్చు. విగ్రహం నీటిలో పూర్తిగా కరిగిపోయాక మరింత మట్టివేసి గుంటను పూడిస్తే, మొక్క మానుగా మారి స్వచ్ఛమైన గాలిని అందిస్తుంది. ఖాళీ స్థలం లేనివారు ఓ కుండీలో నీటిని నింపి దాన్లో విగ్రహాన్ని నిమజ్జనం చేస్తే అదే మొక్కగా ఎదుగుతుందన్నది వీరి ఆలోచన. ఈ రకమైన గణేషునితో ఉసిరి, మామిడి, నేరేడు, కానుగ వంటి ఔషధమొక్కలను, బాల్కనీల్లో పెట్టుకునేవారికి తులసి, కిచెన్ గార్డెన్‌కు సంబంధించిన మొక్కలను అందిస్తున్నారు.

మొక్క గణేశ విగ్రహాల తయారీకి కావల్సిన మొక్కలను అందివ్వాల్సిందిగా జిహెచ్ఎమ్‌సి గచ్చిబౌలి వారికి లెటర్ అందిస్తే, వారూ సహకరించేందుకు సిద్ధమయ్యారు. సంస్థకు సంబంధించిన పదిమంది సభ్యులు కలిసి వివిధ కాలనీల్లో వీటి తయారీకి సంబంధించిన వర్క్‌షాప్స్ నిర్వహిస్తున్నారు.

పాఠశాలల్లో పిల్లలకు మట్టి విగ్రహాల గురించిన అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నారు. శేరిలింగంపల్లిలో సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్స్‌కు శిక్షణ ఇస్తున్నారు 'షేర్ ఎ సర్వీస్' స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు. పర్యావరణహితమైన వీరి ఆలోచన విజయవంతమవ్వాలని మనమూ ఆశిద్దాం.

జల కాలుష్యానికి ఇదో విరుగుడు



ప్రతి సంవత్సరం వినాయక నిమజ్జనం సందర్భంగా నదులు, చెరువుల్లోకి చేరే గ్రహాలు నీటికాలుష్యానికి కారణమవుతున్నాయి. భారీ గణేశ విగ్రహాల తయారీకి వాడే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, జిప్సం అనే మినరల్ నుంచి వేరుచేసిన క్యాల్షియం సల్ఫేట్ హెమి హైడ్రేట్ అనే రసాయనాల మిశ్రమం. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారైన విగ్రహాలను నీటి వనరుల్లో నిమజ్జనం చేశాక అవి కరగడానికి కొన్ని నెలల నుంచి సంవత్సరాల కాలం పడుతుంది. దీనికి తోడు విగ్రహాల అలంకరణకు వాడే రంగుల్లో పాదరసం, లెడ్ లాంటి భారీ లోహాలుంటాయి, ఇవి నీటిలో కలిసిపోయి ఉపయోగించేవారికి హానికరంగా మారతాయి. నీటిలోకి వచ్చి చేరే రసాయనాల వల్ల ఆ నీటిలో యాసిడ్ స్థాయిలు పెరుగుతాయి. నీటిలో కరిగే ఘనపదార్థాల స్థాయి పెరుగుతుంది. ఈ రకమైన కాలుష్యం వల్ల నీటిలో ఉండే మొక్కలు, జంతువులు మృత్యువాత పడి, జీవవైవిధ్యానికి ముప్ప తెస్తుంది. గణేశ విగ్రహాలతో పాటు అలంకరణకుపయోగించే థర్మాకోల్, ప్లాస్టిక్ వస్తువులు వేయడంవల్ల జలకాలుష్యం పెరుగుతుంది.

నిర్భాగ్యుల జీవితంలో బ్రింగ్ ఎ స్మైల్



హైటెక్ సిటీగా ప్రపంచంలో ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న హైదరాబాద్ అంటే నచ్చని వారుండరు. ప్యారడైజ్ బిర్యానీ, ఇరానీ చాయ్, రోడ్ల వెంబడి చాట్, పానీపూరీలాంటివన్నీ ఎప్పుడంటే అప్పుడు దొరుకుతూ మజానిచ్చే సిటీలో మానవత్వం ఉన్న మనుషులకీ కొదువ లేదు. ఇక్కడివారికి జాలిగుణం ఎక్కువే. ఎవరైనా ఆపదలో ఉన్నారంటే చాలు ఆదుకొనేవారెందరో... అలాంటి కోవకు చెందినవారే అర్చన సురేష్. రోడ్డుపక్కన నివసించేవారు, కట్టుకోవడానికి సరైన బట్టలు లేకుండా జానెడు పొట్టకోసం పరితపించేవారు, బస్టాపుల్లో భిక్షమెత్తుకునే జీవించే వృద్ధులను చూసి చలించిపోయింది. దిక్కూమొక్కూలేని వాళ్ళ, అనాథలు, ఒంటరి వృద్ధులు ఇలా అనేకమందిని చూసి వారి కోసం ఏమైనా చేయాలనుకుంది. చేసే చిన్న సాయంతో వాళ్ల ముఖాల్లో చిరునవ్వు చూడాలనుకుంది. దీని కోసం ఫేస్‌బుక్, వాట్సప్, ట్విట్టర్‌లాంటి సోషల్ మాధ్యమాన్ని వేదికగా చేసుకుంది. అలా ఆమె ఆలోచనల్నించి వచ్చిందే 'బ్రింగ్ ఎ స్మైల్ హైదరాబాద్' సంస్థ.

హైటెక్ సిటీలో గేటెడ్ కమ్యూనిటీలో నివాసముంటుంది అర్చన కుటుంబం. తనకు వచ్చిన ఆలోచనను ముందు గా తల్లికి చెప్పింది. "మా రోజుల్లో ఏమైనా మంచి పని చేద్దామని ఉన్నా, అందర్నీ కలుపుకోవడం చాలా కష్టం. ఇప్పుడలా కాదు గదా. సోషల్ మీడియా ద్వారా నీ ఆలోచనను ఆచరణలో పెట్టు "అంటూ ప్రోత్సహించింది ఆమె. వెంటనే పదుల సంఖ్యలో నివాసముంటున్న వాళ్ల అపార్ట్‌మెంట్ వారికి ఓ మెసేజ్ పెట్టింది అర్చన. దాని సారంశమేమంటే.. "మీకు అవసరంలేని దుప్పట్లు, వస్తువులను ఇవ్వండి వాటిని అభాగ్యులకు అందిద్దాం". వచ్చిన స్పందనకు ఆశ్చర్యపోయింది. అంతా అర్చనను అభినందించారు. మేం కూడా ఉన్నాం నీవెంట అంటూ ..సుమారుగా 40 కుటుంబాల వాళ్లు బీద బిక్కి వారికి సేవా భావంతో ఏడాది పొడవునా సాయం చేస్తున్నారు. అలా 2012లో మొదలైంది బ్రింగ్ ఎ స్మైల్ హైదరాబాద్ నెట్‌వర్క్ . ఈ సంస్థ వ్యవస్థాపకురాలైన అర్చన సురేష్ 12 ఏళ్లుగా వివిధ మల్టీనేషనల్ కంపెనీలలో పనిచేసింది. బట్టలు, దుప్పట్లు ఇవ్వడంతో మొదలైన సర్వీసు ..క్రమంగా మురికివాడల్లోని పిల్లలు చదువుకునేందుకు పుస్తకాలు, పెన్సిళ్లు, బ్యాగులు పోగేసి ఇవ్వడం మొదలెట్టారు. ఫేస్‌బుక్, వాట్సప్‌లో ఎవరికి ఏ అవసరం ఉన్నా ఓ చిన్న మెసేజ్ పెడితే చాలు వ్యక్తులైనా, సంస్థలైనా బ్రింగ్ ఎ స్మైల్ సమీకరించి పెడుతుంది. స్కూల్ , కాలేజీ ఫ్రెండ్స్ ఇలా అందరూ అర్చనకు తోడై నిలిచారు. ఏ సంస్థకైతే డబ్బు అవసరముందో దాతలంతా నేరుగా సంస్థలకే ఇచ్చేటట్టుగా చూడగలిగింది. వీలైనంత మందికి రసీదులు కూడా పంపించడం ఈ సంస్థ ప్రత్యేకత. ప్రతిరోజు ఈ ట్రస్ట్ నుంచి 6,500 మంది ఏదో ఒక రూపంలో సాయం పొందుతుంటారు. 2015 – 16లో ఆర్గనైజేషన్ ద్వారా 56 మంది అనాథ పిల్లలకు చదువుకుంటున్నారు. వికలాంగులకు వీల్‌చైర్లు, సొంతంగా కర్రీపాయింట్లు పెట్టుకుంటామన్నవారికి ఆర్థిక సాయం అందించింది. ప్రస్తుతం ఈ ట్రస్ట్‌లో 200 మంది సభ్యులున్నారు. అందులో 50 మంది యాక్టివ్ పార్టిసిపేట్స్. ముఖ్యంగా తమ సంస్థకు చేయూతనిస్తున్న కార్పొరేట్ కంపెనీల సాయం మరువలేనిదంటారు అర్చన. మెర్క్ ఫార్మాస్యూటికల్స్ వాళ్లు అర్చన సర్వీసును మెచ్చుకుంటూ , ఆమె మరో పదిమందికి ఆదర్శం కావాలంటూ ఆమెమీద ఓ వీడియో తీసి యూట్యూబ్‌లో పెట్టారు. దానికి 7లక్షల పైనే వ్యూస్ వచ్చాయి. బ్రింగ్ ఎ స్మైల్ వాట్సప్ గ్రూపులోని వారు దయార్ద్ర హృదయులు. ఈ గ్రూపులో ఫుల్ టైమ్ పనిచేసేవారితోపాటు వాలంటీర్లుగా కూడా పనిచేస్తుంటారు. హెలెన్‌కెల్లర్ చెప్పినట్లు ఈ ప్రపంచంలో చాలా బాధలున్నాయి. వాటిని అధిగమించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్న ఆమె మాటలను స్ఫూర్తిగా తీసుకుంది ఈ టీమ్. ఈ సంవత్సరం జూన్‌లో హైదరాబాద్, అదిలాబాద్‌లోని అనాథ పిల్లలకు వెయ్యికి పైగా నోట్ పుస్తకాలను అందించిందీ సంస్థ. తన తల్లి ప్రోత్సాహం వల్లనే ఇదంతా సాధ్యమైందని అంటుంది అర్చన . సంస్థ ద్వారా మరింత మంది సాయం పొందాలని ఆశిస్తున్నారు.



పార్లర్ లిప్‌స్టిక్ కాటుకలను వాడొద్దు

ఈ రోజుల్లో గల్లీకో బ్యూటీ పార్లర్లు వెలుస్తున్నాయి. ఏదో పనైపోతుందని ఎక్కడ పడితే అక్కడ నాణ్యతలు పాటించని చోట వెళ్లడం మంచిది కాదు. పార్లర్‌లో కొన్ని నియమాలు పాటించడం మర్చిపోవద్దు. ఖర్చుకు వెనుకాడకుండా అందరూ వెళ్లే బ్యూటీపార్లర్‌లో కొన్ని నియమాలు తప్పనిసరిగా పాటించాలి. శుభ్రతకు పెద్దపీట వేయాలి. సాధారణంగా అక్కడ అమ్మే వస్తువులను బ్యూటీషియన్ చెప్పే మాటలు విని కొనేస్తుంటారు. హెన్నా కొనేటప్పుడు పాత స్టాకు ఉన్నట్లయితే కొనకూడదు. ఫేషియల్ చేయించుకునేటపుడు తప్పనిసరిగా తలకు ఓ బట్టను కట్టించుకోవాలి. బ్యూటీపార్లర్‌లో ఉండే లిప్‌స్టిక్, కాటుకలను అస్సలు వాడకూడదు. అక్కడ ఉండే దువ్వెనలను వాడొద్దు. తరచూ బ్లీచింగ్ చేయించుకోవద్దు. మూడు నెలలకు ఒకసారి చేయించుకుంటే సరిపోతుంది. మానిక్యూర్, పెడిక్యూర్‌లు చేసే పరికరాలు ఇన్‌ఫెక్షన్లు కలిగించే అవకాశం ఉంది. అవి ఉపయోగించిన ప్రతిసారి స్టెర్లింగ్ చేశారో లేదోనని బ్యూటీషియన్‌ను మొహమాటం లేకుండా అడిగి తెలుసుకోవాలి.

చిన్నారుల విషాదాన్ని మోడీ వక్రీకరిస్తున్నారు: మాయావతి



లక్నో: గోరఖ్‌పూర్‌లో చిన్నారుల మృతిపై ప్రధాని నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలను బిఎస్‌పి అధ్యక్షురాలు మాయావతి తీవ్రంగా విమర్శించారు. చిన్నారుల మృతిని నేరం, అధికారుల నిర్లక్ష్యం, ప్రకృతి విపత్తు లాగా ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారని ఆమె తెలిపారు. ఇలాంటి ఘటనలు జరగడం దేశంలో ఇదే మొదటి సారి కాదని అమిత్ షా పేర్కొనడం పట్ల తాను దిగ్భ్రాంతికి గురైనట్లు మాయావతి తెలిపారు. బిజెపి నేతల వక్రీకరణ ఆలోచనను ప్రజలు అర్థం చేసుకోవాలని మాయావతి పేర్కొన్నారు. ప్రతి స్థాయిలో భారీ అవినీతి జరగడంతోనే పిల్లలు మృతి చెందినట్లు ప్రతి ఒక్కరికి తెలుసన్నారు. ఈ ఘటనను బిజెపి నేతలు, ఆర్‌ఎస్‌ఎస్‌లు ఖండించారని ఆమె గుర్తు చేశారు. చిన్నారుల విషాదాన్ని ప్రకృతి విపత్తుగా పేర్కొన్న మోడీ పార్టీని, ముఖ్యమంత్రిని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారని మాయావతి విమర్శించారు. ఈ ఘటనకు బాధ్యులైన మంత్రులు, ఇతరులపై చర్యలు తీసుకోవాల్సిన మోడీ, షాలు ఆత్మాభిమానానికి పోవడాన్ని బిఎస్‌పి తీవ్రంగా ఖండించింది. అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతున్నామని చెప్పడం వట్టి బూటకమని మాయావతి అన్నారు. గత మూడేళ్లలో లోక్‌పాల్ వ్యవస్థను ఏర్పాటు చేయడంలో కేంద్రం విఫలమైందని ఆమె విమర్శించారు.



దశరథ్‌ను అభినందించిన మహిళా శిశు సంక్షేమశాఖ కార్యదర్శి జగదీశ్

మన తెలంగాణ / హైదరాబాద్ : మహిళా శిశు సంక్షేమ శాఖలో 26 ఏళ్లుగా సైకిల్ మెసెంజర్‌గా పని చేసిన ఉద్యోగి దశరథ్‌కు రాష్ట్ర ప్రభుత్వ స్వాతంత్ర్య దినోత్సవ అవార్డు రావడం పట్ల మహిళా శిశు సంక్షేమశాఖ కార్యదర్శి జగదీశ్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డు ఛైర్ పర్సన్ రాగం సుజాత యాదవ్ అభినందించారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందుకున్న జ్ఞాపిక, 5 లక్షల నగదు బహుమతి, ప్రశంసా పత్రాన్ని ఈ సందర్భంగా దశరథ్ వారికి చూపించారు. మరింత బాధ్యతాయుతంగా పని చేసి మరిన్ని అవార్డులను అందుకోవాలని ఈ సందర్భంగా దశరథ్‌ను వారు అభినందించారు.

నిజాయితీ, నిబద్ధతతో ఏదైనా సాధ్యమే : సి.వి.ఆనంద్



మన తెలంగాణ/హైదరాబాద్ : నిజాయితీ, నిబద్ధతతో పని చేస్తే ఏదైనా సాధ్యమేనని పౌర సరఫరాల శాఖ కమిషనర్ సి.వి.ఆనంద్ అన్నారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా రాష్ట్ర ప్రభుత్వ ఎక్సలెన్స్ అవార్డును అందుకున్న ఆనంద్‌ను బుధవారం పౌర సరఫరాల శాఖ, సంస్థ, లీగల్ మెట్రాలజీ ఉద్యోగులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ అవార్డు ఒక్కరి విజయం కాదు. సమిష్టి కృషితోనే ఇది సాధ్యమైందన్నారు. నాకు అవార్డు వస్తే అందరికి వచ్చినట్టేనని ఆయన అన్నారు. శాఖలోని ప్రతి ఒక్కరు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కింది స్థాయి నుండి పై స్థాయి వరకు నిజాయితీగా, నిబద్ధతతో పని చేయడం వల్లే అవార్డు లభించిందన్నారు.

పుస్తకాల బరువు తగ్గించండి బాలల హక్కుల సంఘం

మన తెలంగాణ/హైదరాబాద్ : పిల్లల బరువుకన్నా వారు మోస్తున్న పుస్తకాల బరువు ఎక్కువగా ఉండి ఆరోగ్యం దెబ్బతింటుందని బాలల హక్కుల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు సంఘం అధ్యక్షులు అనురాధ రావు మానవ హక్కుల కమిషన్‌లో పిటిషన్ దాఖలు చేశారు. చిన్న పిల్లలను హోమ్ వర్క్ పేరుతో నిద్రాహారాలు లేకుండా చేస్తున్నారని, హోం వర్క్‌ల భయంతో పిల్లలు నిద్రకు సైతం దూరమై మానసికంగా దెబ్బ తింటున్నారని, పిల్లలకు హోంవర్క్ లేకుండా చేసేలా ఆదేశాలివ్వాలని కోరారు. పిటిషన్‌ను స్వీకరించిన కమిషన్ దీనిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శులుకు అక్టోబర్ 31వ తేదీ లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.

న్యాయ వివాదాలకు తావు ఇవ్వొద్దు

(మొదటిపేజీ తరువాయి)

భవిష్యత్తులో 84 వేలకు పైగా ఉద్యోగాలు భర్తీచేయాల్సి ఉన్నందున కమిషన్ గురుతర బాధ్యతను పోశించాలని సిఎం కోరారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు పనిభారం పెరిగినందున అందులో కొత్తగా 90 మంది ఉద్యోగులను నియమించడానికి సిఎం అంగీకరించారు. సిఎం ఆదేశాల నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, టిఎస్‌పిఎస్‌సి చైర్మన్ ఘంటా చక్రపాణి, సిఎస్ ఎస్‌పి సింగ్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, న్యాయశాఖ కార్యదర్శి నిరంజన్‌రావు, పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శి వాణీప్రసాద్, జిఎడి ముఖ్య కార్యదర్శి అధర్ సిన్హా తదితరులు సమావేశమై నియామక ప్రక్రియ, ఇందుకోసం అవలంభించాల్సిన వ్యూహంపై చర్చించారు. శాఖల వారీగా ఉద్యోగాల భర్తీకి వెనువెంటనే నోటిఫికేషన్లు జారీచేయాలని, వచ్చే ఏడాది ఏర్పడే ఖాళీల వివరాలను కూడా ముందుగానే తీసుకొని నియామకాలు చేపట్టాలని నిర్ణయించారు. నోటిఫికేషన్లపై కోర్టు కేసుల్లో సమర్థ వాదనలు వినిపించాలని, నియామకాలను వివాదాస్పదం చేయాలని కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండి, తెలంగాణ యువతకు న్యాయం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని నిర్ణయించారు. ఈ నెల 21వ తేదీన సచివాలయంలో మరోమారు సమావేశం కావాలని నిర్ణయించారు.

బిపి పైపైకి!

(మొదటిపేజీ తరువాయి)

తీవ్రమైన సమస్యలకు దారి తీస్తున్నాయని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అం టున్నారు. దీనితో ప్రాథమిక దశలో నిర్లక్ష్యం చేసిన హైపర్‌టెన్షన్ సంక్లిష్టంగా మారిన పరిస్థితుల్లో చికిత్స చేయడం మరీ ఇబ్బందికరంగా మారుతున్నట్లు గుర్తించారు. చికిత్స చేయని క్యా న్సర్ మాదిరిగానే చికిత్స చేయని బ్లడ్ ప్రెషర్ (రక్తంలో ఒత్తిడి) కూడా ఇబ్బందులను కలుగజేస్తుంది. హైబిపి అనేది నిశ్శబ్ద హంతకిగానే కాకుండా హైబిపి ఉన్న మనిషి ముందు, ముందు ఎదుర్కోబోయే అనేక సంక్లిష్ట పరిస్థితులకు సంకేతంగా పరిగణించాలని వైద్యులు సూచిస్తున్నారు. హైబిపిని కేవలం ఒక వ్యాధిగానే కాకుండా ముందస్తు హెచ్చరికగా తీసుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

హైబిపితో వివిధ అవయవాలపై ప్రభావం పడుతుంది. స్ట్రోక్ (ఆకస్మిక దెబ్బ)గు గురైన వ్యక్తిలో చేయి, కాలు, మాట, వాసన చూసే సామర్థ్యం లాంటివి ప్రభావితం కావచ్చు. జాతీయ కుటుంబ ఆరోగ్య అధ్యయనం వరకు రాష్ట్రంలో 20 మంది పెద్దల్లో హైబిపి ఉన్నట్లు తేలింది. మరో ఏజెన్సీ చేసిన అధ్యయనంలో హైదరాబాద్‌లో 4060 మధ్య వయస్సు కలిగిన వారిలో 30 శాతం మంది మహిళలు, పురుషులు హైపర్‌టెన్షన్ కలిగి ఉన్నారు.

వీరు గుండె జబ్బుల విషయంలో హైరిస్క్‌లో ఉన్నారు. గత డిశంబర్, జనవరిలో నిర్వహించిన అధ్యయనంలో 8,952 మంది ముందస్తు ఆరోగ్య తనిఖీ నిర్వహించిన తర్వాత వీటి ఫలితాలను విడుదల చేశారు. మొత్తంగా పట్టణాల్లో 21.4 శాతం, గ్రామాల్లో 14.8 మందిలో హైపర్ టెన్షన్ ఉంది. 2530 సంవత్సరాల లోపు ఉండి రెగ్యులర్‌గా ఆల్కహాల్‌ను సేవిస్తూ, పొగాకు సిగరెట్, హుక్కా తదితర రూపాల్లో ఊదే అలవాటు ఉన్నవారిలో 10 శాతం మందిలో హైపర్‌టెన్షన్ వచ్చే లక్షణాలను గుర్తించారు.

ప్రశ్నిస్తున్నామనే అరెస్టులు

- దసరా తర్వాత బహిరంగ సభ : కోదండరామ్
- ఉద్యోగ నియామకాల క్యాలెండర్ విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొ॥ కోదండరామ్

మన తెలంగాణ/ ఖమ్మం ప్రతినిధి : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాలకు సంబంధించి క్యాలెండర్‌ను విడుదల చేయాలని అప్పుడు ఉద్యోగ నియామకాలపై నిరుద్యోగులకు స్పష్టత వస్తుందని టిజెఏసి చైర్మన్ ప్రొ॥ కోదండరాం తెలిపారు. రాష్ట్రంలో రెండు లక్షలకు పైగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని వాటిని త్వరితగతిన భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. బుధవారం అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో స్థానిక భక్తరామదాసు కళాక్షేత్రంలో నిరుద్యోగ సదస్సు జరిగింది. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన కోదండరాం మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటు సమయానికి లక్ష ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని చెప్పారని 2014 నుండి ఇప్పటి వరకు 47వేల మంది పదవీ విరమణ చేశారని కొత్త జిల్లాల కారణంగా 10వేల ఉద్యోగ అవకాశాలు వచ్చాయన్నారు. పబ్లిక్ రంగ సంస్థల్లో మరో 50వేల ఖాళీలు ఉన్నాయని మొత్తం రెండు లక్షల పై చిలుకు నియామకాలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేయాల్సి ఉందన్నారు. గతంలో జరిగిన ఎస్‌ఐ రాత పరీక్షల ఫలితాలను ఏడాది కావస్తున్నా ఇంత వరకు విడుదల చేయలేదని ఉపాధ్యాయ ఖాళీలకు సంబంధించి స్పష్టత లేదన్నారు. ప్రభుత్వాన్ని నియామకాలకు సంబంధించి ప్రశ్నిస్తే కేసులు నమోదు చేసి వేధిస్తున్నారని కోదండరాం ఆరోపించారు. ప్రభుత్వం ప్రకటించిన ఉద్యోగాలు కాక వివిధ ప్రభుత్వ శాఖల్లో క్లాస్3, క్లాస్4 ఉద్యోగాల్లో పలు ఖాళీలు ఉన్నాయన్నారు. వీటి భర్తీకి నియామకాల క్యాలెండర్‌ను విడుదల చేస్తే నిరుద్యోగులు తమ తమ సమయానికి అనుకూలంగా పరీక్షలకు సిద్ధమవుతారని కోదండరాం తెలిపారు. రాష్ట్రంలో అప నమ్మకాల మధ్య నిరుద్యోగులు ఉన్నారని ఆయన తెలిపారు. నిరుద్యోగుల తల్లిదండ్రులు ఆవేదనకు గురవుతున్నారన్నారు. పబ్లిక్ రంగ సంస్థల్లో స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోదండరాం డిమాండ్ చేశారు. స్థూల జాతీయోత్పత్తి పెరిగినంత మాత్రాన రాష్ట్రం అభివృద్ధి చెందినట్లు కాదని ఆ ఒక్కటి మినహా మిగిలిన అన్ని రంగాల్లో రాష్ట్రం మధ్యస్థంగా ఉందని ఉద్యోగ కల్పన, శిశు మరణాల తగ్గింపు, జీవన ప్రమాణాల పెరుగుదల మొదలైన వాటిలో మిగిలిన రాష్ట్రాల కంటే బాగా వెనుకబడి పోయామన్నారు. అత్యధికులు ఆధారపడిన వ్యవసాయ రంగం నుంచి కేవలం 12 లేదా 13 శాతం మాత్రమే ఆదాయం లభిస్తుంటే అల్ప సంఖ్యాకులు ఆధారపడిన సేవారంగానికి ఇతర రంగాల నుంచి 80శాతానికి పైబడి ఆదాయం లభిస్తుందని కోదండరాం తెలిపారు. సూక్ష్మ పరిశ్రమల ఏర్పాటు వ్యవసాయ రంగానికి పునర్జీవం కల్పించడంతో పాటు నియామకాలను త్వరితగతిన పూర్తి చేస్తే నిరుద్యోగ సమస్యకు ఓ పరిష్కారం దొరుకుతుందన్నారు. తెలంగాణరాష్ట్రం సాధించుకోవడంతోనే సరిపోదని అభివృద్ధి చెందే వరకు పోరాటం కొనసాగించాలన్న ప్రొ॥ జయశంకర్ సూచనలకు అనుగుణంగా తాము పనిచేస్తున్నామన్నారు. అభివృద్ధి ఇసుక కాంట్రాక్టర్లు ఇతర ఆస్తుల పెంపకాలే లక్ష్యంగా సాగరాదని తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి సాగాలన్నారు. కోపాలు, తాపాలు వ్యక్తం చేస్తున్నారని తమ పోరాటాన్ని విరమించుకోబోమని కోదండరాం స్పష్టం చేశారు.ఈ దేశ పౌరునిగా ప్రశ్నించే హక్కు ఉందని కొట్లాడి తెలంగాణ సాధించుకున్నాం కాబట్టి ప్రభుత్వాన్ని ప్రశ్నించే అధికారం మాకు ఉందని ప్రశ్నిస్తుంటే అరెస్టులు చేస్తున్నారని తెలిపారు.ఉద్యోగ నియామకాలకు సంబంధించి ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చేందుకు దసరా తర్వాత హైద్రాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు కోదండరాం తెలిపారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో ఉపాధి కల్పన సమ్మిళిత అభివృద్ధి కోరుతూ కోట్లాడక తప్పదని ఆయన తెలిపారు. ఏఐవైఎఫ్ నాయకులు సిద్దినేని కర్ణకుమార్, అబ్బూరి మహేష్, అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన ఈ సదస్సులో సిపిఐ నాయకులు, మాజీ శాసన సభ్యులు పువ్వాడ నాగేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి బాగం హేమంతరావు, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు పోటు కళావతి, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారపాక అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేను సిఎం అవుతా

(మొదటిపేజీ తరువాయి)

దుర్మార్గ పాలన సాగుతోందన్నారు. ఎన్నికలకు ముందు దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని హామీ ఇచ్చి వారి ఓట్లతోనే కేసిఆర్ ముఖ్యమంత్రి పదవిని అనుభవిస్తున్నాడని అన్నారు. పదే పదే ప్రజలకు తప్పుడు వాగ్దానాలు చేస్తున్న ముఖ్యమంత్రిది నోరుకాదు తాటిమట్ట అని అన్నారు. మూడున్నర సంవత్సరాలలో పాలన గాడి తప్పిందన్నారు. ప్రశ్నించే వారిపై తీవ్ర అణిచివేతకు ప్రభుత్వం పాల్పడుతోందని విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మళ్లీ మాయమాటలతో ప్రజలను మోసగించడానికి తయారవుతున్నాడని అన్నారు. అంబేద్కర్‌కాలనీలో రూ.7 లక్షల ఎమ్మెల్యే నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం, మూడు హైమాక్స్ లైట్లను ఏర్పాటు చేసి కాలనీని అభివృద్ధి చేస్తామన్నారు. మరో రూ.5 లక్షల వ్యయంతో కమ్యూనిటి హాల్ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. రానున్న రోజుల్లో గౌడ, యాదవ సంఘాలకు కమ్యూనిటీ హాల్స్ నిర్మిస్తానని హామీ ఇచ్చారు. మున్సిపాలిటీ అమృత్ పథకం క్రింద కోటి రూపాయల నిధులతో మర్రిగూడ, ఆర్జాల బావి ప్రజల దాహర్తిని తీర్చేందుకు వాటర్ ట్యాంక్‌ను నిర్మిస్తామని అన్నారు. త్వరలో రూ.700 కోట్లతో నిర్మితమౌతున్న బ్రాహ్మణంవెల్లంల నిర్మాణం పూర్తయిన పక్షంలో మర్రిగూడ చెరువుకు నీటిని విడుదల చేసి రైతులకు సాగునీరందిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిఫల్ చైర్‌పర్సన్ బొడ్డుపల్లి లక్ష్మి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, మాజీ జడ్పీటీసి, కాంగ్రేస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహరెడ్డి, మండలపార్టీ అధ్యక్షులు మాజీ సర్పంచ్ ఊట్కూరి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు బాలికల గల్లంతు

(మొదటిపేజీ తరువాయి)

నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. మంచిర్యాలజిల్లా బెల్లంపల్లి పట్టణానికి చెందిన తిరుపతి కుమార్తె స్వప్నతోపాటు భూపాల గ్రామానికి చెందిన సాంబయ్య కుమార్తె వెంకటరమణిలు గత కొంత కాలంగా సిరోంచాలో నివాసం ఉంటున్నారు. స్వప్న సోదరి స్వరూపతో పాటు వెంకటరమణిలు కలసి బట్టలు ఉతికేందుకువెళ్లగా ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరగడంతో కొట్టుకుపోయారు. దీంతో స్వరూప వెంటనే పోలీసులకు సమాచారం అందించగా సిరోంచా డిఎస్‌పి గజానంద్ రాథోడ్ ఆధ్వర్యంలో పోలీసులు బలగాలు, గజ ఈతగాళ్లు రంగంలోకి దిగి గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. ప్రాణహిత నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో ఇప్పటి వరకు మృతదేహాలు లభించలేదు. కాగా కొట్టుకుపోయిన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

శివార్లకు నల్లానీరు

(మొదటిపేజీ తరువాయి)

జలమండలి ఎండి దానకిశోర్‌లతో కలిసి ప్రారంభించారు. అనంతరం షాపూర్‌నగర్‌లో కొత్తగా నిర్మించిన 6 మిలియన్ లీటర్ల రిజర్వాయర్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ మాట్లాడుతూ రూ.628 కోట్ల వ్యయంతో ఔటర్ రింగ్ రోడ్డు లోపలి 183 గ్రామాలకు, ఏడు మున్సిపాలిటీలకు నల్లాల ద్వారా మంచినీటిని అందిస్తామన్నారు. రాబోయే సంవత్సరం లోగా ఈ ప్రాజెక్టు పనులు పూర్తి చేసి ఔటర్ రింగ్ రోడ్డు గ్రామాలకు నల్లాల ద్వారా నీటిని సరఫరా చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ఔటర్ రింగ్ రోడ్డు గ్రామాల్లో లక్షా 50 వేల కొత్త నల్లా కనెక్షన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. దీంతో దాదాపు పది లక్షల జనాభా ఈ ప్రాజెక్టు ద్వారా లబ్ధిపొందనున్నట్లు వివరించారు. ప్రతి మనిషికి 135 లీటర్ల నీటిని సరఫరా చేస్తామన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టులో భాగంగా రూ.628 కోట్లతో రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని నూతనంగా 410 రిజర్వాయర్లు, 285 కిలో మీటర్ల మేర మెయిన్ ట్రంక్, 1712 కిలోమీటర్ల డిస్ట్రిబ్యూషన్ పైపులైన్ల విస్తరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఓఆర్‌ఆర్ గ్రామాల్లో రోజుకు 7 మిలియన్ గ్యాలన్ల నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే రోజుకు 30 మిలియన్ గ్యాలన్ల నీటిని సరఫరా చేస్తామన్నారు.వందల కిలో మీటర్ల సుదూర ప్రాంతాల నుంచి నీటిని తీసుకువస్తున్నామని, వీటిని అధిగమించి హైదరాబాద్ మహానగరానికి మంచినీటిని అందించేందుకు నగర శివారులోని శామీర్‌పేట మండలం కేశవాపూర్ వద్ద భారీ రిజర్వాయర్ నిర్మించనున్నట్లు తెలిపారు. జీహెచ్‌ఎంసీలో విలీనమైన 13 మున్సిపాలిటీలకు మంచినీటిని అందించేందుకు రూ.1900 కోట్లతో చేపట్టిన హడ్కో ప్రాజెక్ట్ పనులను జల మండలి రికార్డు సమయంలో పూర్తి చేసిందని అభినందించారు. నగరంలోని ఇంటింటికి ప్రతి రోజు మంచినీటిని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అపార్ట్‌మెంట్,గ్రేటెడ్ కమ్యూనిటీ వాసులకు సైతం నల్లాల ద్వారా నీటిని అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని జల మండలి అధికారులకు మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఎండీ ఎం.దానకిశోర్, మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఎం.వీ.రెడ్డి, నగర మేయర్ బొంతు రామ్మోహన్‌రావు, ఎంపీలు చామకూర మల్లారెడ్డి, బూర నర్సయ్య గౌడ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, శాసనసభ్యులు వివేకానంద,తీగల కృష్ణారెడ్డి, సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శంభీర్‌పూర్ రాజు, నరేందర్‌రెడ్డి, కొంపల్లి గ్రామ సర్పంచ్ నాగమణి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

రెండు కీలక కేసులలో వ్యతిరేక తీర్పుల నేపథ్యంలో

పోలీసు దర్యాప్తులో అనుమానాలు

మన తెలంగాణ/హైదరాబాద్ : అందివచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని కేసుల దర్యాప్తులో బలమైన ఆధారాలను సమకూర్చుకోవాల్సిన రాష్ట్ర పోలీసు శాఖ రోజురోజుకు నిర్వీర్యమవుతున్నట్లు స్పష్టమవుతోంది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రెండు ప్రధాన కేసులలో పోలీసుల వైఫల్యంతో తెలంగాణ పోలీసు శాఖ దర్యాప్తుపై సర్వత్రా చర్చ మొదలైంది. ఒకప్పుడు కేసు నమోదు చేసి నిందితులని పేర్కొంటూ జైలుకు పంపిస్తే కచ్చితంగా శిక్ష పడుతుందన్న విశ్వాసం ప్రజల్లో ఏర్పడేది. ఇటీవల ఈ విశ్వాసాన్ని కోల్పోయే విధంగా పోలీసుల దర్యాప్తు సాగుతుందని తేలడంతో లోపం ఎక్కడ ఉందన్న అంశంపై ఆరాలు మొదలయ్యాయి. 2005 అక్టోబర్ 12 బేగంపేటలోని అప్పటి టాస్క్‌ఫోర్స్ కార్యాలయంపై మానవ బాంబు జరిగింది. ఈ ఘటనలో కార్యాలయానికి కాపలాగా ఉన్న హోంగార్డు ప్రాణాలను కోల్పోయాడు. ఈ కేసును అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పోలీసు శాఖ 12 మందిని కారకులుగా గుర్తించి 10 మందిని అరెస్టు చేసింది. మానవబాంబుకు పథకం వేసిన ఇద్దరు ఆ తర్వాత పాకిస్తాన్‌లో జరిగిన ఎదురు కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో ఒకరు బంగ్లాదేశ్‌కు చెందిన వారని తేల్చారు. ఈ కేసును కోర్టు దాదాపు 12 సంవత్సరాల పాటు విచారించింది. చివరకు నిందితులని నిరూపించేందుకు పోలీసులు సరైన ఆధారాలను చూపలేదని పేర్కొంటూ వారందరినీ కోర్టు నిర్ధోషులుగా ప్రకటించింది. హైదరాబాద్‌లో జరిగిన మొట్టమొదటి మానవ బాంబు దాడి ఇదే కావడంతో పోలీసు శాఖ దీన్ని సీరియస్‌గా తీసుకుంటుందని, నిందితులకు కఠినమైన శిక్షలు పడేలా కోర్టుకు ఆధారాలను సమర్పిస్తుందని అందరూ భావించారు. కానీ చివరకు సాక్ష్యాలను చూపలేకపోయారన్న కారణంతో వారందరినీ నిర్ధోషులుగా కోర్టు ప్రకటించింది. ఈ కేసులో పోలీసులు ఘటనా స్థలిలో లభించిన ఆధారాలను తప్ప ఆ తర్వాత జరిపిన దర్యాప్తులో కానీ, బంగ్లాదేశ్‌కు చెందిన వ్యక్తి ప్రమేయంపై కానీ సరైన ఆధారాలను చూపక పోవడం వల్లే కేసు వీగిపోయిందని తేలింది.

శాసనసభలో ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీపై దాడి ఘటనలోనూ పోలీసుల దర్యాప్తు వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. వాస్తవానికి ఈ కేసులో మహ్మద్ పహిల్వాన్ ప్రధాన నిందితుడని మొదటి నుంచీ పోలీసులు వాదిస్తూ వచ్చారు. కానీ కోర్టులో అందుకు సంబంధించిన ఆధారాలను ప్రవేశపెట్టడంలో వైఫల్యం చెందారు. వందల మంది సాక్షులను, వీడియో క్లిప్పింగ్‌లను కోర్టుకు సమర్పించిన పోలీసులు పహిల్వాన్ ప్రమేయంపై మాత్రం ఎలాంటి ఆధారాలను చూపించక లేకపోవడంతో కోర్టు ఆయనను నిర్ధోషిగా ప్రకటించింది. దర్యాప్తు సందర్భంగా ఆధారాల సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తల విషయంలో పోలీసులు అలసత్వం ప్రదర్శించడం వల్లే కీలక కేసులలో తీర్పు వ్యతిరేకంగా వచ్చిందని పోలీసు అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. కీలకమైన కేసు దర్యాప్తును అప్పగించిన బృందాలకు ఇతరత్రా పనులను కూడా కేటాయించడం వల్ల పని వత్తిడికి గురై అసలైన ఆధారాల సేకరణలో అలసత్వం చూపించారని అంటున్నారు. స్వల్ప వ్యవధిలోనే రెండు కేసుల తీర్పు పోలీసు శాఖకు వ్యతిరేకంగా రావడంతో ఆ శాఖ దర్యాప్తుపై అనేక అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి.

హాజరు కావాల్సిందిగా ఇద్రాణి ముఖర్జీకి ప్రత్యేక కోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: నగదు అక్రమ చలామణి కేసులో సెప్టెంబర్ 9న తమ ఎదుట హాజరు కావాలని జైలు జీవితం అనుభవిస్తున్న ఐఎన్‌ఎక్స్ మీడియా డైరెక్టర్ ఇంద్రాణి ముఖర్జీ, మాజీ కేంద్రమంత్రి చిదంబరం తనయుడు కార్తీ చిదంబరాన్ని ప్రత్యేక కోర్టు ఆదేశించింది. ఇడి ప్రవేశ పెట్టిన పిటిషన్‌ను ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సునిల్ రాణా అనుమతిచ్చారు. తన కుమార్తెను హత్య చేసిన కేసులో ఇంద్రాణి ముఖర్జీ జైలు జీవితం అనుభవిస్తున్నారు. మనీ లాండరింగ్ కేసు పురోగతి సాధించాలంటే ఇంద్రాణీ ముఖర్జీని కస్టోడియల్ విచారణ జరుపాల్సిన అవసరం ఉందని ఇడి తరుపు న్యాయవాది నితేశ్ రానా పేర్కొన్నారు. ఈ కేసులో కార్తీ చిదంబరానికి ఇది వరకే లూకౌట్ నోటీసులు జారీ చేసినట్లు సిబిఐ తెలిపింది. నేరపూరిత కుట్ర, మోసం, అవినీతి, ప్రభుత్వ ఉద్యోగులను ప్రభావితం చేయడం, నేర పూరిత దుష్ప్రవర్తనకు గానూ కార్తీ, ఇంద్రాణిలపై సిబిఐ కేసులు నమోదు చేసింది. మనీలాండరింగ్ పాల్పడినందుకు కొనసాగుతున్న విచారణను ప్రభావితం చేసేందుకు ఐఎన్ఎస్ మీడియా నుంచి కార్తీ డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

విద్యకు కార్పస్ ఫండ్

(మొదటిపేజీ తరువాయి)

జరుగుతుంది. మాధ్యమిక్, ఉచ్చతర్ శిక్షా కోశ్ (ఎంయుఎస్‌కె) పేరుతో పిలిచే ఈ కార్పస్ ఫండ్ ఖాతా నిర్వహణ బాధ్యతలను పూర్తిగా కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ చూసుకుంటుంది. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)కి కొత్తగా ఒక డైరెక్టర్‌తో పాటు మరో ముగ్గురు బోధనేతర సిబ్బంది నియామకానికి కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. మరోవైపు కొత్త మెట్రోరైల్ పాలసీకి కూడా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దేశంలోని వివిధ నగరాల్లో మెట్రో నెట్‌వర్క్‌ని విస్తరించడం ఈ పాలసీ ఉద్దేశం. ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ పాలసీకి ఆమోదముద్ర పడింది. మెట్రో ప్రాజెక్టుల అమలు కోసం నిబంధనలను ప్రామాణీకరించడంతో పాటు ఒక సేకరణ యంత్రాంగాన్ని రూపొందించడం గురించి ఈ పాలసీ వివరిస్తుంది. అంతేకాక పెట్టుబడులు, రుణాల గురించి కూడా తెలుపుతుంది. ప్రస్తుతానికి, దేశంలోని ఢిల్లీ, బెంగళూరు, కోల్‌కతా, చెన్నయ్, కోచి, ముంబై, జైపూర్, గూర్గావ్ మెట్రో నగరాల్లో మొత్తం దాదాపు 350 కిలోమీటర్ల మేర పొడవుతో మెట్రో ప్రాజెక్టుల పనులు అమలవుతున్నాయి. మరోవైపు హైదరాబాద్, నాగ్‌పూర్, అహ్మదాబాద్, పుణె, లక్నో నగరాల్లోనూ మెట్రో పనులు జరుగుతున్నాయి.

నార్త్ కోయెల్ రిజర్వాయర్‌కూ మోక్షం

జార్ఖండ్, బీహార్ రాష్ట్రాల్లో సుమారు రూ.1622 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న నార్త్ కోయెల్ రిజర్వాయర్ ప్రాజెక్టుకు సంబంధించి అసంపూర్ణంగా ఉన్న పనులను పూర్తి చేయడానికి ఉద్దేశించిన ప్రతిపాదనను కూడా కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. ఈ రిజర్వాయర్‌ను జార్ఖండ్‌లోని పాలమౌ, గర్హ్వా జిల్లాల్లోని అత్యంత వెనుకబడిన గిరిజన ప్రాంతాల్లో నిర్మిస్తున్నామని కేంద్ర జలవనరుల శాఖా మంత్రి ఉమా భారతి తెలిపారు. ఆయా ప్రాంతాల్లోని మావోయిస్టు సమస్యను అధిగమించే విషయంలో ఈ ప్రాజెక్టు ఒక ఆయుధం లాగా పనిచేస్తుందని ఆమె అన్నారు. ప్రాజెక్టులో భాగంగా మండల్ డ్యామ్‌లో నీటి నిల్వకు కూడా కేబినెట్ ఆమోదించింది. ఈ రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే జార్ఖండ్‌లోని పాలమౌ, గర్హ్వా, బీహార్‌లోని ఔరంగాబాద్, గయా జిల్లాల్లోని అత్యంత వెనుకబడిన, కరువు తాకిడి ప్రాంతాల్లో ఏటా 1.11 లక్షల హెక్టార్లకు పైగా సాగునీరు లభిస్తుంది. ఈ మావోయిస్టు ప్రభావిత జిల్లాల్లోని అసమానతలు కూడా ఈ ప్రాజెక్టు వల్ల రూపుమాపబడుతాయని ఉమా భారతి విలేకరులతో ఆశాభావం వ్యక్తం చేశారు.

అండమాన్‌లో అటవీ అభివృద్ధి కార్పొరేషన్ రద్దుకు గ్రీన్‌సిగ్నల్ అండమాన్, నికోబార్ దీవుల్లో అడవుల అభివృద్ధికి ఉద్దేశించిన మొక్కల పెంపక అభివృద్ధి, నిర్వహణను చేపడుతున్న ఒక కార్పొరేషన్ రద్దుకు కూడా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. 'కేంద్ర ప్రభుత్వ అజమాయిషీలోని అండమాన్ అండ్ నికోబార్ ఐలాండ్స్ ఫారెస్ట్ అండ్ ప్లాంటేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎఎన్‌ఐఎఫ్‌పిడిసిఎల్), పోర్ట్‌బ్లెయిర్ మూసివేతకు, కంపెనీకి చెందిన ఉద్యోగులందరినీ బాధ్యతల నుండి తప్పించడానికి ప్రధాని అధ్యక్షతన సమావేశమైన కేబినెట్ కమిటీ నిర్ణయించింది' అని ఒక అధికారిక ప్రకటన తెలిపింది. ఈ రద్దు నిర్ణయం పోర్ట్ బ్లెయిర్‌లోని ఎఎన్‌ఐఎఫ్‌పిడిసిఎల్‌కు కేంద్రప్రభుత్వం నుండి అనుత్పాదక రుణాలు అందకుండా అడ్డుకోవడంలో దోహదపడుతుంది. అంతేకాకుండా ఆస్తులను మరింత ఉత్పాదకమైన రీతిలో వినియోగించుకోవడం కూడా వీలవుతుందని సదరు ప్రకటన పేర్కొంది.

ప్రయోగాత్మక భూసర్వే పూర్తి

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా తర్కగూడ, ఎర్రకుంట, చింతపల్లిగూడ, సిద్ధిపేట జిల్లా జగదేవ్‌పూర్‌లో ఈనెల 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు సర్వే చేపట్టారు. డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (డిజిపిఎస్) విధానంతో ప్రతి గ్రామంలో మూడు వందల ఎకరాలలో నిర్వహించారు. ప్రతి గ్రామంలో 5 డిజిపిఎస్ పరికరాలను వినియోగించారు. ఇంతకు ముందు నిజామాబాద్ జిల్లాలో భూ భారతి ప్రాజెక్టు కింద ప్రయోగాత్మకంగా భూముల సర్వే నిర్వహించారు. ఏడెనిమిది సంవత్సరాలు కావస్తున్నా ఇంత వరకు సర్వే పూర్తి కాలేదు. ఇమాజినరీ విధానంతో భూ భారతి సర్వే జరిగింది. డిజిపిఎస్‌తో పాటు ఇమాజినరీ, ఇతర రాష్ట్రాలలో అమలవుతున్న విధానంపై కమిటీ సభ్యులు బుధవారం సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో మూడు జిల్లాల కలెక్టర్లతో పాటు ముగ్గురు ఆర్‌డిఒలు, సర్వే సెటిల్‌మెంట్ విభాగం అధికారి, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ విభాగం అధికారి పాల్గొన్నారు.

డిటోనేటర్ల స్వాధీనం

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. కారును తీసుకువెళ్లడానికి ఈనెల 16న నిందితుడు వచ్చాడని తెలిసి మహ్మద్ యాకుబ్ పాష, గఫార్ ఖాన్‌లను అరెస్ట్ చేశామని, మరో నిందితుడు అన్వర్ పరారీలో ఉన్నాడని డిఎస్‌పి తెలిపారు. నిందితులను తుంగతుర్తి కోర్టులో హాజరుపరుస్తామన్నారు. నిందితుడు యాకుబ్ పాషాపై మహబూబాద్, కురవి, బయ్యారం, నెల్లికుదురు పోలీస్ స్టేషన్‌లలో పలు కేసులు నమోదు కాగా, ఇంతకు ముందే జైలు జీవితం గడిపాడని ఆమె చెప్పారు. నిందితులను పట్టుకోవడంలో హెడ్ కానిస్టేబుల్ వెంకన్న, రషీద్, హోం గార్డు వెంకన్న ఎంతో కృషి చేసారని. డిఎస్పి వారిని అబినందించారు. ఈ విలేకరుల సమావేశంలో తుంగతుర్తి సిఐ దండి లక్ష్మణ్, తిరుమలగిరి ఎస్‌ఐ కె.మహేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముద్దాయిగా డిఐజి

(మొదటిపేజీ తరువాయి)

చేశారో పూర్తి వివరాలను డిఐజి నివేదిక ఇవ్వాలని సూచించారు. బాధితులందరికి ఒకేలాగా ఒకే చోట గాయాలు ఎందుకయ్యాయని హైకోర్టు ప్రశ్నించింది. గతంలో హైకోర్టు ఎంజిఎం వైద్యుల బృందంతో నిందితులకు వైద్యపరీక్షలు నిర్వహించాలని, రెండు వారాల్లో నివేదిక సమర్పించాలని కోరిన నేపథ్యంలో బుధవారం వైద్యుల బృందం సీల్డ్ కవర్‌లో హైకోర్టుకు నివేదిక సమర్పించింది. నివేదికలో నిందితులందరికి ఒకేచోట, ఒకేరీతిగా గాయాలుండడం పట్ల హైకోర్టు ఆశ్చర్యం ప్రకటించింది. అయితే ఈ ఘటనకు సంబంధించి ఎస్సై రవీందర్‌ను బాధ్యుడని డిఐజి నివేదిక ఆధారంగా సస్పెండ్ చేశామని ప్రభుత్వం వెల్లడించింది. ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ రాంచందర్‌రావు వాదించగా ఎస్సై రవీందర్‌ను సస్పెండ్ చేసిన సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు డిఐజి నివేదిక ద్వారా అందించాలని హైకోర్టు ఆదేశించింది.



బీహార్‌కు రూ. 2.75 లక్షల కోట్లు కోరిన నితీశ్

న్యూఢిల్లీ: జాతీయ ప్రజాస్వామ్య కూటమి(ఎన్‌డిఎ)కు తిరిగొచ్చిన బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తన రాష్ట్రాభివృద్ధికి కేంద్రం నుంచి రూ. 2.75 లక్షల కోట్ల ప్యాకేజీని కోరారు. ఈ విషయాన్ని జెడి(యు) ప్రతినిధి కె.సి.త్యాగి బుధవారం తెలిపారు. నితీశ్ కుమార్, ప్రధాని నరేంద్ర మోడీతో ఆగస్టు 11న సమావేశమైనప్పుడు బీహార్‌లో తన ప్రభుత్వం మొదలుపెట్టే వివిధ పనులను వివరించారు. వారిద్దరూ తిరిగి ఈ నెల చివరి వారంలో సమావేశం కాబోతున్నారు. బీహార్ ప్రజల ఆకాంక్షలు బాగా పెరిగాయని, అభివృద్ధి పనులు చాలా వేగంగా జరగాలని వారు కోరుకుంటున్నారని నితీశ్ ప్రధాని నరేంద్ర మోడీకి వివరించారని సమాచారం. బీహార్‌కు సంబంధించిన ప్రాజెక్టుల విషయంలో ప్రధాని కార్యాలయం పనిచేయడం ఆరంభించినట్లు త్యాగా తెలిపారు. నితీశ్ కుమార్ ఏడు తీర్మానాలు(సాత్ నిశ్యయ్‌లు) చేశారు. వాటిలో ప్రతి ఇంటికి విద్యుత్తు, త్రాగునీరు, మురికినీటి కాలువ సదుపాయం, మరుగు దొడ్ల నిర్మాణం వంటివి ఉన్నాయి. 2015లో నితీశ్ కుమార్ ప్రభుత్వం వచ్చాక పెట్టుకున్న అజెండాలోనివే ఇవి. బీహార్‌లోనూ, కేంద్రంలోనూ ఒకే కూటమి ఉన్నందున బీహార్ ప్యాకేజి కార్య రూపం దాలుస్తుందని భావిస్తున్నారు. బీహార్‌కు మంచి రోజుల రానున్నాయని త్యాగి చెప్పారు. రాష్ట్రానికి కేంద్ర సాయం కోసం బీహార్ అసెంబ్లీ ఓ తీర్మానాన్ని ఆమోదించింది.



మాజీ రాంరెడ్డి దామోదర్‌రెడ్డిని పరామర్శించిన ఉత్తమ్, జానా

మన తెలంగాణ/ హైదరాబాద్ : హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డిని బుధవారం నాడు పిసిసి అధ్యక్షులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రతిపక్ష నాయకులు జానారెడ్డి పరామర్శించారు. సూర్యాపేటలో పోలీసులు అరెస్టు సందర్భంగా స్పృహతప్పి పడిపోవడంతో ఆయనను కిమ్స్‌కు తరలించారు. దామోదర్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మల్లు రవి, యూత్ కాం గ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు అనిల్‌కుమార్ యాదవ్, అధికార ప్రతినిధులు అద్దంకి దయాకర్, ఇందిర పరామర్శించి సంఘీభావం తెలియజేశారు.
డిఎస్‌పిని సస్పెండ్ చేయాలి : మాజీ మంత్రి దామోదర్‌రెడ్డిపై అతిగా ప్రవర్తించిన సూర్యాపేట డిఎస్‌పిని సస్పెండ్ చేయాలని పిసిసి ఉపాధ్యక్షులు డాక్టర్ మల్లు రవి డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ పోలీసులు ఇలాగే వ్యవహరిస్తే సూర్యాపేట నుండే ప్రజా ఉద్యమాన్ని ప్రారంభిస్తామని హెచ్చరించారు. అద్దంకి దయాకర్ మాట్లాడుతూ మంత్రి జగదీశ్‌రెడ్డి ఓటమి ఖాయమని ముఖ్యమంత్రి సర్వేలో తేలడంతో పోలీసులను ఉపయోగించి ప్రత్యర్థులను అణిచివేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు.

హైదరాబాద్ చేరుకున్న గల్ఫ్ బాధితులు



మన తెలంగాణ/శంషాబాద్ : పొట్టకూటి కోసమని ఏడేళ్ల క్రితం గల్ఫ్ లోని ఒమన్ దేశంకు వెళ్లి తిండి లేక జీతాలు లేక పడరాని పాట్లుపడి ఎట్టకేలకు గల్ఫ్ వర్కర్స్ అసోసియేషన్ సహకారంతో బుధవారం ఉద యం ఆరుగురు బాధితులు హైదరాబాద్ చేరుకున్నారు.ఈ సం దర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు భీంరెడ్డి మాట్లాడుతూ గల్ఫ్ పెట్రో కంపెనీలో ఏడేళ్ల క్రితం కార్మికులుగా చేరారు. వీరి మాదిరిగానే రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన దాదాపు 300మంది ఈ కంపెనీలో చేరారు. అయితే గత నాలుగు నెలలుగా జీతం, గ్రాట్యుటీ కలిపి రూ.34లక్షలు చెల్లించ కుండా యాజమాన్యం వీరందరినీ ఉద్యోగాల నుండి తొలగిం చారు. దీంతో వీరంతా రోడ్డున పడ్డారు. ఈనేపథ్యంలో గల్ఫ్‌లో చిక్కు కున్న బాధితులను రక్షించేందుకు గల్ఫ్ వర్కర్స్ అసోసియేషన్ కృషి చేసి ఇండి యన్ ఎంబసి అధికారుల సహాయంతో ఆరుగురు బాధితులను ఒమన్ ఏర్ ఫ్లైట్ నెం. డబ్ల్యువై 235 ద్వారా ఈరోజు ఉదయం హైదరా బాద్‌కు తరలించినట్లు తెలిపారు. బాధితులు స్వగ్రామాలకు చేరుకొవడానికి వీరి కి బస్ చార్జీలు చెల్లించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు.

కార్యకర్తలు అధైర్య పడొద్దు

మన తెలంగాణ/యాదాద్రిభువనగిరి : ఈ మధ్యకాలంలో ఎఐసిసి కుంతియా మాటలపై అధైర్యపడవద్దని, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ రోజు రోజుకు బలోపేతమవుతుందని ఎమ్మెల్సీ రాజగోపాల్‌రెడ్డి పార్టీ కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. పట్టణంలోని విశ్రాంతి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిసిసి అధ్యక్షులుగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఇంఛార్జిగా నేనే కొనసాగుతానని కుంతియా అనడం భావ్యం కాదని, ఇది తాత్కాలిక నిర్ణయమేనని, నిర్ణయం తీసుకునేందుకు హైకమాండ్ ఉందని, హైకమాండ్‌పై సంపూర్ణ నమ్మకం ఉందని ఆయన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజల విశ్వాసానికి దూరమయ్యాయని వివరించారు. సిఎం కెసిఆర్ స్వార్థంతోనే నయీంను ఎన్‌కౌంటర్ చేశారని, ఏడాది దాటినప్పటికి నయీం కేసులో అసలైన నిందితుల పట్ల నేర పరిశోధన జరగడం లేదని ఆయన విమర్శించారు. ఈ కేసును సిట్‌బృందం నిర్లక్ష్యం చేస్తున్నందున సిబిఐకి అప్పగించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. గుళ్ళు, కోపురాలకు వేలాది కోట్ల రూ॥లు వెచ్చిస్తున్నటికి యాదాద్రిభువనగిరి బీబీనగర్ మండలంలో ఉన్న నీమ్స్ ఆసుపత్రిపై స్పష్టత లేదని ఇన్‌పేషెంట్ వైద్యసేవలు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయిందని ఆయన ఆరోపించారు. ఈ విలేకరుల సమావేశంలో పిసిసి మాజీ కార్యదర్శి తంగెళ్ళపల్లి రవికుమార్, కాంగ్రేస్ పార్టీ భువనగిరి మాజీ ఇంచార్జి పోతంశెట్టి వెంకటేశ్వర్లు, మున్సిపల్ మాజీ చైర్మెన్ బర్రె జహాంగీర్, యువజన కాంగ్రేస్ పార్టీపార్లమెంట్ అధ్యక్షులు ఉదయ్‌రెడ్డి, చౌటుప్పల్ ఎంపిపి ప్రభాకర్‌రెడ్డి, భువనగిరి వెంకటరమణ, కాంగ్రేస్ నాయకలు ఈరపాక నర్సింహ్మా, బండారు అశోక్‌వర్ధన్, యాట నాగరాజు, సయ్యద్ ముల్తానీ, అపోజు, బర్రె నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా నిర్బంధాల మధ్య కొనసాగుతున్న ప్రభుత్వ పరిపాలన

● **సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం**



మన తెలంగాణ/సిద్ధిపేట్/గజ్వేల్ : ప్రజా సమస్యలను పరిష్కరించ కుండా బాధ్యతారాహిత్యంగా ఉన్న ప్రభుత్వాన్ని ప్రశ్నించటమే నేరంగా పరిగణిస్తున్న దారుణ పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. మంగళవారం సిద్దిపేట్ జిల్లా గజ్వేల్ స్థానిక ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌజ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కీలకంగా, క్రియాశీలకంగా పని చేసిన కోదండరాంను ఎక్కడబడితే అక్కడ ప్రభుత్వం ఎందుకు నిర్బంధిస్తుందని ఆయన సూటిగా ప్రశ్నించారు. కోదండరాంకు నయీంతో గానీ, మియాపూర్ భూములతో, ఇసుక మాఫియాలతో కానీ సంబంధాలు లేవన్నారు. ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం రైతులను మభ్య పెట్టి భూసేకరణ జరుపుతుంటే ప్రజలకు చట్టాల గురించి అవగాహన కల్పించి చైతన్యపరుస్తున్న కోదండరాం నేరస్తుడా అన్నారు. ప్రతిపక్షాలు బాధితులను పరామర్శించటానికి వెళ్తే కూడా పోలీసులు నిర్బంధించటం ఈ ప్రభుత్వ నియంతృత్వ పోకడలను స్పష్టం చేస్తుందన్నారు. మల్లన్నసాగర్ భూ నిర్వాసితులకు ఒక రకమైన పరిహారం, కొండ పోచమ్మ భూ నిర్వాసితులకు మరో రకరకమైన పరిహారం ఇవ్వటం ప్రభుత్వ ధ్వంధ్వ వైఖరికి నిదర్శనమన్నారు. సిఎం కెసిఆర్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవటంలో విఫలమయ్యారని చివరకు తన సొంత నియోజకవర్గంలో కూడా చేసిన వాగ్దానాలను నెరవేర్చలేకపోయారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వెంకట్, జిల్లా నాయకులు జయరాజు, గోపాల స్వామి, రేవంత్, నాగరాజు, ఎల్లయ్య, రాజు, అరవింద్, యాదగిరి పాల్గొన్నారు.

బహిరంగ మలమూత్ర విసర్జన రహిత సిటీగా

'మహా'నగరం



● **150 డివిజన్ కార్పొరేటర్లకు బాధ్యతలను అప్పగించిన బల్దియా**

మన తెలంగాణ /హైదరాబాద్ సిటీ బ్యూరో : విశ్వ నగరంగా రూపాం తరం చెందుతున్న హైదరాబాద్‌ను బహిరంగ మలమూత్ర విసర్జన రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు జిహెచ్‌ఎంసి చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఇప్పటికే అనేక కార్యక్రమాలను చేపట్టిన ప్రభుత్వం మరిన్ని చర్యలకు ఉపక్రమించింది. జిహెచ్‌ఎంసి పరిధిలోని 150 డివిజన్లను బహిరంగ మలమూత్ర రహితంగా తీర్చిదిద్దే బాధ్యతను ఆయా కార్పొరేటర్లకు అప్పగించింది. ఇప్పటికే గ్రేటర్ పరిధిలో 1975 వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను పూర్తి చేసిన జిహెచ్‌ఎంసి, 135 బయో టాయిలెంట్లు, 109 ప్రీ ఫ్యాబ్రికెటెట్ , 46 సులబ్ కాంప్లెక్స్, 57 ఇంజినీరింగ్ టాయింటెట్లు, 17 షీ ఈ టాయింటెట్లు, 20 కమ్యూనిటీ మరుగుదొడ్లు మొత్తం 384 టాయింటెట్లను అందుబాటులోకి తెచ్చింది. అదనంగా 44 మూత్రశాలలు నిర్మాణంలో ఉండగా వీటికి తోడు మరో కొత్తగా మరో 25 టెండర్లను పిలిచారు. అంతే కాకుండా మహిళలకు సంబంధించి మరో 25 మూత్రశాలలు నిర్మాణ దశలో ఉన్నాయి. వీటికి తోడు నగర వ్యాప్తంగా 295 పెట్రో బంకులు, 390 హోటల్స్, రెస్టారెంట్లలో ఉన్న ముత్రశాలలను సాధారణ ప్రజలు కూడా ఉపయోగించుకునే విధంగా ఆయా యాజమన్యాలను ఒప్పించడంలో సఫలీకృతం కావడంతో బహిరంగ మలమూత్ర విసర్జనకు పరిష్కారం లభించింది. బహిరంగ మలమూత్ర రహిత నగరం కార్యక్రమానికి సంబంధించి సమస్యలను, సూచనలను ఈ నెల 28వ తేదీ లోపు అందజేయాల్సిందిగా కమిషనర్ డాక్టర్ బి.జనార్ధన్‌రెడ్డి ప్రజలకు ప్రజాప్రతినిధులకు సూచించారు.

కాంగ్రెస్ ఆరోపణలు అర్థరహితం

● **జూపల్లి కృష్ణారావు వ్యాఖ్య**



మన తెలంగాణ/ హైదరాబాద్ : పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు నుండి డిండి రిజర్వాయర్‌కు నీళ్ళు తీసుకుపోతే పాత మహబూబ్‌నగర్ జిల్లాకు నష్టం జరుగుతుందనికాంగ్రెస్ నాయకుల అర్థరహితంగా మాట్లాడుతున్నారని పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రస్తు తం నిర్మిస్తున్న ప్రాజెక్టులు పూర్తయితే మహబూబ్‌నగర్ జిల్లాకు ముఖ్యమంత్రి చెప్పిన దాని కంటే ఎక్కువ నీళ్ళు వస్తాయని, 200 టిఎంసిల నీళ్ళతో 20 లక్షల ఎకరాలు సాగులోకి వస్తాయని చెప్పా రు. టిఆర్ఎస్ శాసనసభా పక్ష కార్యాలయంలో ఎంఎల్‌ఏలు శ్రీనివాస్ గౌడ్, ఎ.వెంకటేశ్వర్‌రెడ్డి, అంజయ్య యాదవ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిలతో కలిసి బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. డిండికి నీళ్ళు తరలిస్తే మహబూబ్‌నగర్‌కు అన్యాయం జరుగుతుందని కాంగ్రెస్ నాయకులు అనడాన్ని తప్పుబట్టారు. 'పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నుండి డిండికి నీరెందుకు ఇవ్వొద్దు. నల్లగొండ జిల్లా తెలంగాణలో లేదా? ఆ జిల్లా ఉద్యమంలో పాల్గొన లేదా? కృష్ణాబేసిన్‌లో అది లేదా? మనకేమి కావాలో అడగాలే తప్ప ఇంకొకరికి వద్దనే హక్కు ఎక్కడిద'ని జూపల్లి ప్రశ్నించారు. డిండికి ఏదుల నుండి నీళ్ళు తీసుకు పోయేటప్పు డు దారిలో అచ్చంపేట నియోజకవర్గంలోని 40 వేల ఎకరాల కు నీళ్ళు రావా అని అన్నారు. అయి నా పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా మొదట మహబూబ్‌నగర్‌కు నీళ్ళు ఇచ్చాకే ఇతర జిల్లాలకు వెళ్తాయని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు ఇంకా సమైక్య రాష్ట్రంలో మాట్లాడినట్లే మాట్లాడుతున్నారని చెప్పారు.

పాలమూరు–రంగారెడ్డితో పాటు, కల్వకుర్తి, బీమా, నెట్టెంపాటు, కోయల్‌సాగర్ ప్రాజెక్టులన్నీ పూర్తయితే కేవలం మహబూబ్‌నగర్ జిల్లాకే 200 టిఎంసిల నీరు అందుబాటులో ఉంటుందని, తద్వారా 20 లక్షల ఎకరాలు సాగులోకి వస్తాయన్నారు. ఎస్ఆర్ఎస్‌పి పునరుజ్జీవ పథకం తరహాలో జూరాల పునరుజ్జీవ పథకాన్ని చేపట్టాలన్న కాంగ్రెస్ నేతలు అవగాహన లేని వ్యాఖ్యలు చేస్తున్నారని, జూరాల సామర్థ్యాన్ని పెంచడం సాధ్యం కాదని వారికి తెలియదా? అని అన్నారు. తెలంగాణ వచ్చాక మొదలు పెట్టిన మొట్టమొదటి ప్రాజెక్టు పాలమూరు–రంగారెడ్డి అని, దానిని ఎన్నికల నాటికి పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. ఒకవైపు పాలమూరుకు నీళ్ళు తగ్గుతాయని దుష్ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులే మరో వైపు ప్రాజెక్టులపై కోర్టులు, గ్రీన్ ట్రిబ్యూనల్‌లో కేసులు వేసి అడ్డుకుంటున్నారని విమర్శించారు. శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ నేతలు అధికారంలో ఉన్నప్పుడు పాలమూరుకు అన్యాయం చేసే విధంగా చేపట్టిన పోతిరెడ్డిపాటు హెడ్ రెగ్యులేటరీ కెనాల్‌ను అడ్డుకోలేదన్నారు. సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ డిండికి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నుండి నీరొద్దంటున్న మహబూబ్‌నగర్ కాంగ్రెస్ నాయకులు అదే మాటను నల్లగొండ జిల్లాకు చెందిన పిసిసి అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సిఎల్‌పి నేత జానారెడ్డితో అనిపిస్తారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు జిల్లాకో మాట మాట్లాడుతూ జిల్లాల మధ్య విద్వేషాలు సృష్టిం చేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు.


కాపులను బిసిల్లో కలిపితే యుద్ధమే!

● **బిసి సంఘాల కోర్ గ్రూప్ సమావేశంలో హెచ్చరిక**



మన తెలంగాణ/హైదరాబాద్/ముషీరాబాద్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కాపులను బిసి జాబితాలో కలిపితే బిసిలకు అన్యాయం జరుగుతుందని, ఇది చారిత్రక తప్పదమవుతుందని జాతీయ బిసి సం క్షేమ సంఘం కోర్ గ్రూప్ కమిటీ స్పష్టం చేసిం ది. కాపులను బిసి జాబితాలో కలిపితే యుద్ధం జరు గుతుందని కోర్ గ్రూప్ కమిటీ ఎపి ప్రభుత్వాన్ని హెచ్చరించింది. బుధవారం హైదరాబాద్ విద్యానగర్ బిసి భవన్‌లో జాతీయ బిసి సంక్షేమ సంఘం కోర్ గ్రూప్ కమిటీ అత్యవసర సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య, జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ కాపులకు కేవలం విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను మాత్రమే కల్పిస్తామని, రాజకీయ రిజర్వేషన్లు (స్థానిక సంస్థల)కు కల్పించబోమని ఎపి సిఎం చంద్రబాబునాయుడు ప్రకటించారని, కానీ ఇది ఆచరణలో సాధ్యం కాదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మైనార్టీలను బిసి జాబితాలో కలిపినప్పుడు వీరికి విద్య, ఉద్యోగాలలో మాత్రమే రిజర్వేషన్లు కల్పించే విధంగా జివో. జారీ చేశారని, కానీ ఆ తర్వాత కొందరు మైనార్టీలు కోర్టుకు వెళ్లి స్థానిక సంస్థలలో కూడా బిసి కోటా కావాలని కేసులు వేశారని గుర్తు చేశారు.

జివో ప్రకారం వీరికి విద్య, ఉద్యోగాలకే పరిమితం చేయాలని, రాజకీయ రిజర్వేషన్లు ఇవ్వరాదని బిసి సంఘాలు, రాష్ట్ర ప్రభు త్వం వ్యతిరేకించినా హైకోర్టు మాత్రం మైనార్టీలను బిసి జాబితాలో ఒకసారి కలిపినా తర్వాత బిసిలకిచ్చే అన్ని సదుపాయాలు కల్పించాలని తీర్పు చెప్పిందన్నారు. బిసి జాబితాలో కాపులను ఒక్కసారి కలిపితే అన్ని సదుపాయాలు రిజర్వేషన్లు కాపులకు ఆటోమెటిక్‌గా వర్తిస్తాయన్నారు. అలాంటప్పుడు భవిష్యత్‌లో జరుగబోయే జెడ్‌పిటీసి, ఎంపిటీసి, సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలలో అన్ని రకాలుగా బలవంతులైన కాపులలో అత్యంత వెనకవడిన చాకలి, మంగలి, వడ్డెర, కుమ్మరి, వడ్రంగి, మేదర, ఉప్పర, కురుమ, మత్స్యకారులు, గీత కార్మికులు, నేత కార్మికులు తదితర కులాల వారు పోటీ చేయలేరన్నారు. దీంతో బిసి కోటా కింద వచ్చే స్థానాలు మొత్తం కాపు సోదరులే కాజేస్తారని విమర్శించారు. బిసి జాబితాలో చేర్చే కులాలకు రాజకీయ నిర్ణయాలతో చేర్చరాదని, ఇది పూర్తిగా సాంకేతికపరమైన, రాజ్యాంగ బద్ధమైన అంశమన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు లొంగి కలిపితే భవిష్యత్‌లో బలమైన ఇతర కులాల వారు కూడా తమను కూడా బిసి జాబితాలో కలుపుమనే ప్రమాదముందన్నారు. రిజర్వేషన్ల లక్ష్యం దెబ్బతింటుందన్నారు. ఈ సమావేశంలో బిసి సంక్షేమ సంఘం జాతీయ సమన్వయకర్త డాక్టర్.ర్యాగ అరుణ్, జాతీయ కార్యదర్శి గుజ్జ రమేష్, కోట్ల శ్రీనివాస్, అంజి, పగిళ్ల సతీష్, నీల వెంకటేష్ మాట్లాడారు.



గోదావరిలో యువకుడి గల్లంతు

మనతెలంగాణ/చెన్నూర్‌రూరల్ : పట్టణంలోని గోదావరి నదిలో పుణ్యస్నానం ఆచరించుటకు భీమారం మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన తిరుపతి తన కుటుంబంతో వచ్చారు. గోదావరి నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో తిరుపతి గల్లంతు అయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలా నికి చేరుకొని గజ ఈత గాళ్ల తో గాలింపు చర్యలను చేపట్టారు. అయినా వారి ఆచూకీ లభించలేదు. గాలింపును ముమ్మరం చేస్తామని ఎస్‌ఐ తెలిపారు.

11 డ్రగ్స్ కేసులు నమోదు

● **డిసెంబర్ 15లోపు చార్జీషీటు**
● **ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ వెల్లడి**



మనతెలంగాణ/వరంగల్‌బ్యూరో : డ్రగ్స్ నియంత్రణపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. డ్రగ్స్‌ను అరికట్టేందు ప్రత్యేకమైన నిఘాను ఏర్పాటు చేసి దాడులు నిర్వహిస్తున్నామని రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ అన్నారు. బుధవారం వరంగల్‌లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ ఆధ్వర్యంలో గుడుంబా, గంజాయి, డ్రగ్స్ తదితర అంశాలపై ఉమ్మడి వరంగల్ జిల్లా అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 11 డ్రగ్స్ కేసులను నమోదు చేశామని, వాటిపై విచారణ కొనసాగుతుందన్నారు. సెప్టెంబర్ చివరి వారం నుంచి డిసెంబర్ 15లో ఈ 11కేసులకు సంబంధించిన చార్జీషీటును వేస్తామని అకున్ సబర్వాల్ తెలిపారు. ఇప్పటికి ప్రతి రోజు ఇద్దరు, ముగ్గురిని డ్రగ్స్ కేసులో విచారణ చేస్తున్నామని, సంబంధాలు ఉన్నవారిపై కేసులను నమోదు చేస్తున్నారమన్నారు. డ్రగ్స్ నియంత్రణపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు పోలీసు, ఎక్సైజ్, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను, ర్యాలీలను నిర్వహిస్తున్నామన్నారు. గంజాయి నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. బయటి రాష్ట్రాల నుంచి వచ్చే గంజాయి నియంత్రణకు ప్రత్యేకమైన టీంలను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో గుడుంబా తయారీదారులు, అమ్మకందారులకు ఉపాధి కల్పన కల్పించడంతో వరంగల్ రూరల్ జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. వరంగల్ అర్బన్ జిల్లా, జనగామ జిల్లాలో నూటికి నూరు శాతం గుడుంబాను నియంత్రంచగలిగామన్నారు. త్వరలో మిగిలిన మూడు జిల్లాలను కూడా గుడుంబా రహిత జిల్లాలుగా ప్రకటించేందుకు కావలసిన అన్ని చర్యలను తీసుకుంటున్నామన్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

ఐటి ఉద్యోగి పాత్రలో...

పూరి జగన్నాథ్ దర్శకత్వంలో కళ్యాణ్‌రామ్ హీరోగా తెరకెక్కిన 'ఇజం' సినిమాలో హీరోయిన్‌గా మెరిసిన మాజీ మిస్ ఇండియా అదితి ఆర్య ఇప్పుడు మరో సినిమా చేస్తోంది. 'ఇజం' తర్వాత ఈ భామకు కొన్ని ఆఫర్లు వచ్చినా వాటిని వదిలేసుకుందట. అందుకు కారణం ఆమెకు నచ్చిన కథలు రాలేదట. బాలీవుడ్, కోలీవుడ్‌లో కూడా ఈ అమ్మడు పెద్దగా ప్రయత్నాలు ఏమీ చేయలేదట. అయితే అనుకోకుండా ఇటీవల తెలుగులో ఓ చిన్న తరహా లవ్ స్టోరీని ఓకే చేసింది అదితి ఆర్య. ఈ సినిమాలో ఒక సాఫ్ట్‌వేర్ అమ్మాయిగా కనిపించబోతుందట. అలాగే ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర చాలా బావుంటుందని తెలిసింది. ఈ రొమాంటిక్ లవ్ స్టోరీలో ఒక ఐటి ఉద్యోగినిగా హీరో హవీష్‌తో ప్రేమాయణం కొనసాగించనుందని సినిమా యూనిట్ ద్వారా తెలిసింది. శ్రీరామ్ దర్శకత్వంలో హీరో హవీష్ ఓ సినిమాను ఓకే చేశాడు. రమేష్ వర్మ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో జరుగుతోంది. అయితే మిస్ ఇండియా బ్యూటీలు తెలుగులో రెండో సినిమాకు భారీ పారితోషికం అడుగుతున్నారు. అందుకే దిశా పటాని నుంచి అదితి ఆర్య వరకు ఆఫర్లు లేకుండా ఖాళీగా ఉంటున్నారు.కానీ ఎక్కడో ఎవరో కొంత భారీ పారితోషికం ఇచ్చేస్తే... వెంటనే కథ నచ్చింది కాబట్టి ఈ సినిమా చేస్తున్నాం అంటున్నారు. అదితి ఆర్య కూడా ఇలాగే ఈ రొమాంటిక్ లవ్ ఎంటర్‌టైనర్‌లో చేస్తోందని టాక్.


అదితి ఆర్య


అల్లు అరవింద్, పరుచూరి గోపాలకృష్ణ, పరుచూరి వెంకటేశ్వరరావు, చిరంజీవి, సురేందర్ రెడ్డి, రామ్‌చరణ్, సురేఖ

మెగాస్టార్ 151వ చిత్రం షురూ

మెగాస్టార్ చిరంజీవి 151వ సినిమా హైదరాబాద్‌లోని కొణిదెల ప్రొడక్షన్ సంస్థ కార్యాలయంలో పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత చరిత్ర ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. ఈ చిత్రాన్ని కొణిదెల ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సురేందర్ రెడ్డి దర్శకత్వంలో రామ్‌చరణ్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఇక ఈనెల 22న చిరంజీవి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ సినిమా టైటిల్‌తో పాటు మోషన్ పోస్టర్‌ను విడుదల చేయాలని దర్శక నిర్మాతలు భావిస్తున్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో చిరంజీవి, సురేఖ, రామ్‌చరణ్, సురేందర్ రెడ్డి, అల్లు అరవింద్, పరుచూరి బ్రదర్స్, డా.కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


క్రియేటివ్ కమర్షియల్స్ కొత్త సినిమా ప్రారంభోత్సవంలో సాయిధరమ్‌తేజ్, కె.ఎస్.రామారావు, ఎ.కరుణాకరన్ తదితరులు

కలర్‌ఫుల్ లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

సాయిధరమ్‌తేజ్ హీరోగా ఎ.కరుణాకరన్ దర్శకత్వంలో క్రియేటివ్ కమర్షియల్స్ పతాకంపై ప్రొడక్షన్ నం.45గా కె.ఎస్.రామారావు నిర్మిస్తున్న భారీ చిత్రం పూజా కార్యక్రమాలు హైదరాబాద్‌లోని ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో జరిగాయి. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో నిర్మాత కె.ఎస్.రామారావు మాట్లాడుతూ ''మా క్రియేటివ్ కమర్షియల్స్ బ్యానర్‌లో రూపుదిద్దుకుంటున్న 45వ చిత్రం పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. విజయ దశమి రోజున ఈ చిత్రం షూటింగ్ మొదలవుతుంది. అయితే మా సినిమా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మా దర్శకుడు మ్యూజిక్ సిట్టింగ్స్‌లో ఉన్నారు. రచయిత డార్లింగ్ స్వామి మాటలు రాస్తున్నారు. సాయిధరమ్‌తేజ్‌తో ఈ సినిమా చేయడం అంటే మా కుటుంబంలోని ఒక యంగ్‌స్టర్‌తో ఈ సినిమా చేస్తున్న ఫీలింగ్ నాకు కలుగుతోంది. కరుణాకరణ్ ఇప్పటివరకు తీసిన సినిమాలన్నీ మంచి ప్రేమతో తెరకెక్కినవే. ఇప్పుడు మళ్లీ ఆయన ఓ మంచి లవ్ స్టోరీతో ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. దర్శకుడి ప్రోత్సాహంతో గోపీసుందర్ రెండు అద్భుతమైన ట్యూన్స్ ఇచ్చారు. మంచి టీమ్‌తో చేస్తున్న ఈ సినిమా మా బ్యానర్‌లో మరో సూపర్ హిట్ మూవీ అవుతుంది''అని అన్నారు. దర్శకుడు ఎ.కరుణాకరన్ మాట్లాడుతూ ''తేజుతో ఈ సినిమా చేస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఇది పూర్తిగా లవ్ స్టోరీ. కలర్‌ఫుల్ రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో జాలీగా ఉండే సినిమా ఇది'' అని తెలిపారు. హీరో సాయిధరమ్‌తేజ్ మాట్లాడుతూ ''సంవత్సరం నుంచి కె.ఎస్.రామారావు, నేను కలిసి ఓ ప్రాజెక్ట్ చేద్దామనుకుంటున్నాం. కానీ కథ సెట్ అవలేదు. ఎవరి దగ్గరికి ఏ కథ వెళ్లాలనేది ముందే రాసి పెట్టి ఉంటుందని చాలా మంచి చెప్పారు. అలా కరుణాకరన్ కథ నాకు రాసి పెట్టి ఉందని నేను అనుకోలేదు. కానీ అతని కథ నాకు కుదిరింది. ఇది ఒక మంచి సినిమాగా రూపుదిద్దుకుంటుందన్న నమ్మకం నాకుంది''అని చెప్పారు. సాయిధరమ్‌తేజ్, అనుపమ పరమేశ్వరన్ జంటగా నటించే ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః ఐ.ఆండ్రూ, సంగీతంః గోపీసుందర్, ఎడిటింగ్ః ఎస్.ఆర్.శేఖర్, ఆర్ట్ః సాహి సురేష్.

'సవ్యసాచి'గా నాగచైతన్య



అక్కినేని నాగచైతన్య కథానాయకుడిగా చందు మొండేటి దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్న ప్రొడక్షన్ నం.4కు 'సవ్యసాచి' అనే టైటిల్‌ను నిర్ణయించారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కనున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ ప్రీలుక్ పోస్టర్, టైటిట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు మాట్లాడుతూ ''చందు మొండేటి రాసిన సూపర్బ్ హీరో క్యారెక్టరైజేషన్‌కు 'సవ్యసాచి' అనేది సరైన టైటిల్. ప్రేమమ్ వంటి సెన్సేషనల్ హిట్ అనంతరం అక్కినేని నాగచైతన్యచందు మొండేటి కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో ఈ చిత్రంపై మంచి అంచనాలున్నాయి. హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం తెరకెక్కనుంది. ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే స్థాయిలో సినిమా ఉంటుంది. సెప్టెంబర్‌లో రెగ్యులర్ షూటింగ్ మొదలవనున్న ఈ సినిమా పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తాం''అని అన్నారు.

కొత్త కాన్సెప్ట్‌తో థ్రిల్లర్

ఆచార్య క్రియేషన్స్, ఆనంద్ రవి కాన్సెప్ట్ బ్యానర్‌లపై రూపొందుతున్న చిత్రం 'నెపోలియన్'. ఆనంద్ రవి దర్శకత్వంలో భోగేంద్ర గుప్తా మడుపల్లి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ట్రైలర్ విడుదల కార్యక్రమం హైదరాబాద్ ప్రసాద్‌ల్యాబ్స్‌లో జరిగింది. కె.ఎల్.దామోదర్ ప్రసాద్, సందీప్ కిషన్ కలిసి ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కె.ఎల్.దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ ''ఆనంద్ రవి చేసిన పేరెంట్స్ మూవీ చూసిన రోజే తప్పకుండా ఇతను మంచి దర్శకుడు అవుతాడని భావించాను. ప్రతినిధి సినిమా కూడా చాలా మంచి కథతో నడుస్తుంది. తను ఈ సినిమాలో నటిస్తున్నాడని తెలియగానే అతను ఎందుకు నటన పట్ల ఆసక్తి చూపుతున్నాడని అనుకున్నాను. అయితే ట్రైలర్, పోస్టర్స్ చూడగానే అతనైతేనే కరెక్ట్‌గా ఈ సినిమాకు సరిపోతాడనిపించింది. టెక్నికల్‌గా ఇది మంచి సినిమా. ఆనంద్ రవి అద్భుతంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాడు''అని అన్నారు. సందీప్ కిషన్ మాట్లాడుతూ ''ఆనంద్ రవితో నాకు 12 సంవత్సరాల పరిచయం ఉంది. ప్రతినిధి, ఈ సినిమా కూడా నేను చేయాల్సింది కానీ కుదరలేదు. నెక్స్ట్ మూవీ అయినా చేయాలనుకుంటున్నాను. ఆనంద్ రవి సినిమా కథలన్నీ బావుంటాయి. ఈ నెపోలియన్ సినిమా వాటన్నింటికంటే మరో ఎత్తులో ఉంటుందని భావిస్తున్నాను''అని తెలిపారు. నిర్మాత భోగేంద్ర గుప్తా మడుపల్లి మాట్లాడుతూ ''వ్యాపార రంగంలో ఉన్న నేను నిర్మిస్తున్న తొలి సినిమా ఇది. ఆనంద్ రవి లేకుంటే ఈ సినిమా లేదు. అతను చాలా చక్కగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాడు''అని చెప్పారు. ఆనంద్ రవి మాట్లాడుతూ ''ఇది థ్రిల్లర్ జోనర్ మూవీ అయినా కొత్త కాన్సెప్ట్‌తో సాగుతుంది. ఇంతవరకు ప్రేక్షకులు నా సినిమాల నుండి ఏం కోరుకుంటున్నారో అవన్నీ ఈ సినిమాలో ఉంటాయి. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే సినిమా ఇది''అని అన్నారు. ఈ కార్యక్రమంలో బి.ఎ.రాజు, లక్ష్మీ భూపాల్, కోమలి, సిద్ధార్థ్ సదాశివుని, మార్గల్ డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.


సందీప్‌కిషన్, కె.ఎల్.దామోదర్ ప్రసాద్, ఆనంద్ రవి, భోగేంద్ర గుప్తా మడుపల్లి, లక్ష్మీ భూపాల్, కోమలి తదితరులు

ఆ హీరోను ఎప్పటికీ మరచిపోలేను

మొన్నటికి మొన్న హీరోయిన్ శ్రియా... బాలకృష్ణను ఆకాశానికి ఎత్తేసింది. ఈమధ్య మరో బ్యూటీ కైరాదత్ కూడా ఈ హీరోను పొగడ్తలతో ముంచెత్తింది. రియల్ యాక్షన్ స్టార్ అంటూ ప్రశంసించింది. ఇప్పుడు ఈ లిస్ట్‌లోకి మరో హీరోయిన్ ముస్కాన్ కూడా చేరింది. బాలకృష్ణపూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'పైసా వసూల్' సినిమాతో హీరోయిన్‌గా పరిచయమవుతున్న ముస్కాన్... బాలయ్య ది గ్రేట్ అంటోంది. బాలకృష్ణలాంటి మంచి మనస్తత్వం ఉన్న హీరోను తను ఇప్పటివరకు చూడలేదని చెప్పింది ఈ భామ. అంత స్టార్‌డమ్ ఉన్నప్పటికీ అత్యంత సామాన్యంగా ఉండడం ఆయనకే చెల్లిందని తెగ పొగిడేసింది. ప్రారంభంలో బాలకృష్ణతో వర్క్ చేయడానికి చాలా ఇబ్బంది పడిందట ఈ భామ. అయితే తన జోకులతో ఆయన సెట్ వాతావరణాన్ని పూర్తిగా మార్చేశారని... నటనలో తనకు మంచి సలహాలు ఇచ్చారని చెప్పింది ముస్కాన్. తమ హీరోల్ని హీరోయిన్లు పొగడడం సాధారణమే అయినా తను మాత్రం మనస్ఫూర్తిగా ఈ విషయాలు చెబుతున్నానని అంది. స్టార్ హీరో బాలకృష్ణను ఎప్పటికీ మరచిపోలేనని ముస్కాన్ చెప్పడం విశేషం. ఈ ముద్దుగుమ్మ పొగడ్తలకు తన నెక్స్ట్ సినిమాలో బాలయ్య ఆమెకు మళ్లీ ఛాన్స్ ఇచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు.


ముస్కాన్

సొంత వాయిస్ వినిపించారు


సాయి పల్లవి
షాలిని పాండే

తెలుగు సినిమాల్లో ఇతర భాషల హీరోయిన్లకు మంచి ప్రాధాన్యత ఉంటోందన్న విషయం తెలిసిందే. ఉత్తరాది భామలతో పాటు సౌత్‌లోని తమిళ్, మలయాళ భామలు ప్రస్తుతం తెలుగులో పూర్తి హవా నడిపిస్తున్నారు. అయితే ఇప్పుడు వస్తున్న యంగ్ హీరోయిన్లు మాత్రం కేవలం నటనపైనే దృష్టి పెట్టకుండా స్వయంగా తెలుగులో డబ్బింగ్ చెప్పడానికి ఆసక్తి చూపుతుండడం విశేషం. తమ సొంత వాయిస్‌ను వినిపించి ప్రేక్షకులను అలరించాలని వారు కోరుకుంటున్నారు. 'ఫిదా' సినిమాలో హీరోయిన్‌గా నటించిన తమిళ్ భామ సాయి పల్లవి తెలంగాణ యాస తెలుగు నేర్చుకొని ఈ సినిమాలో స్వయంగా డబ్బింగ్ చెప్పింది. తన నటన, డబ్బింగ్‌తో సినిమా విజయంలో ఆమె కీలక పాత్ర పోషించింది. ఫిదాలో సాయి పల్లవి నటనకు మంచి ప్రశంసలు దక్కాయి. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సత్తా చాటి రికార్డు స్థాయి కలెక్షన్లను సాధించింది. సాయి పల్లవి బాటలో ఓ ఉత్తరాది భామ కూడా నడుస్తోంది. విజయ్ దేవరకొండ హీరోగా నటించిన 'అర్జున్ రెడ్డి' సినిమాలో షాలిని పాండే హీరోయిన్‌గా నటించింది. ఈ సినిమాలో ఆమె ఒక మెడికల్ స్టూడెంట్‌గా కనిపించనుంది. మధ్యప్రదేశ్‌లో పుట్టి జబల్‌పూర్‌లో పెరిగిన షాలిని ఈ సినిమాలో మంగుళూరు నుండి వచ్చిన అమ్మాయిగా కనిపించనుంది. అయితే డైరెక్టర్ సూచన మేరకు 'అర్జున్ రెడ్డి' సినిమాలో తన పాత్రకు తనే డబ్బింగ్ చెప్పుకుందట ఈ సుందరి. తెలుగులో ఆమెకు ఇది మొదటి సినిమా అయినా మధ్యప్రదేశ్‌లో థియేటర్ ఆర్టిస్టుగా ఆమెకు మంచి అనుభవం ఉందట. అందుకే అమ్మడు తెలుగులో డైలాగులు అలవోకగా చెప్పేసింది. తెలుగులో తమకు అవకాశాలను పూర్తిగా సద్వినియోగం చేసుకునేందుకు ఇతర భాషల అమ్మాయిలు తెలుగు తొందరగా నేర్చేసుకొని ఇప్పుడు ఉన్న హీరోయిన్లకు గట్టి పోటీ ఇస్తున్నారు. అయితే హీరోయిన్ తెలుగు మాట్లాడుతుంటే ఆ సినిమాకు కూడా మంచి ప్రచారం దొరుకుతుంది. అందుకే మన డైరెక్టర్లు కూడా దగ్గరుండి యంగ్ హీరోయిన్లకు తెలుగు నేర్పిస్తున్నారట.

నాలో పెద్ద బలహీనత అదే

''చిత్ర పరిశ్రమలో ఎన్నో ఎగుడు దిగుడులను చూశాను. కానీ అన్నింటినీ తట్టుకొని చివరికి ఈ స్థాయికి చేరుకోగలిగాను. నాలోని మొండి ధైర్యమే నా విజయరహస్యం'' అని అంటోంది అందాల తార కాజల్ అగర్వాల్. సౌత్‌లో తెలుగు, తమిళ చిత్రాల్లో టాప్ హీరోయిన్‌గా రాణిస్తోంది ఈ బ్యూటీ. అడపాదడపా బాలీవుడ్‌లోనూ సినిమాలు చేస్తూ గ్లామరస్ తారగా పేరుతెచ్చుకుంది. కాజల్ తనలోని బలం, బలహీనతలు గురించి వెల్లడించింది. ''ఎవరైనా తమ జీవితాలు సంతోషంగా సాగిపోవాలనే ఆశిస్తారు. తమ గురించే ఆలోచిస్తుంటారు. అయితే నేనలా కాదు. నా చుట్టూ జరుగుతున్న విషయాల గురించి పట్టించుకుంటాను. ఇతరుల గురించి ఆలోచిస్తుంటాను. ఒక రకంగా చెప్పాలంటే అనవసర విషయాలకు ప్రాముఖ్యతనిస్తుంటాను. నాలో పెద్ద బలహీనత అదే. నా గురించి, నా సినిమాల గురించి ఆలోచించాలని అనుకుంటాను. అయితే అలా ఉండలేకపోతున్నాను. నా చుట్టూ ఉన్న వాళ్ల గురించి ఆలోచించలేకుండా ఉండలేకపోతున్నాను. అలాంటి ఆలోచనల నుంచి బయటపడే ప్రయత్నం చేస్తున్నాను. ఇక నాలో మొండి ధైర్యం ఎక్కువ. ఏదైనా దక్కించుకోవాలనుకుంటే దాన్ని పొందేవరకు విశ్రమించను. ఆశించింది చేరువైన తరువాతే ఇతర విషయాలపై దృష్టిసారిస్తాను. ఈ మొండితనమే నన్ను ఉన్నత స్థాయిలో కూర్చోబెట్టింది. నా బలం అదే. నేను చిత్ర రంగ ప్రవేశం చేసిన తొలి రోజుల్లో మంచి కథా చిత్రాల్లో నటించే అవకాశాలు వచ్చాయి. అప్పట్లో భాష సమస్య ఉన్నా నటించగలనన్న ఆత్మస్థైర్యంతోనే వాటిని అంగీకరించాను. అప్పట్లో ఈ అవకాశాలను అంగీకరించడానికి సందేహించే ఉంటే వెనుకబడిపోయేదాన్ని. మొండి ధైర్యంతోనే ఆ అవకాశాలను అంగీకరించి ఉన్నత స్థానానికి చేరుకున్నాను. నాకు ఒక్కో చిత్రం ఒక్కో వినూత్న అనుభవాన్నిచ్చింది. చిత్ర పరిశ్రమలో చాలా నేర్చుకున్నాను. అవన్నీ భవిష్యత్‌లో ఉపయోగపడతాయి''అని కాజల్ చెప్పింది.


కాజల్ అగర్వాల్




యస్ బ్యాంక్ సేవింగ్ ఖాతాల వడ్డీలో కోత

న్యూఢిల్లీ: ప్రైవేటురంగ సంస్థ యస్ బ్యాంక్ బుధవారం సేవింగ్ ఖాతాలపై వడ్డీలో 1 శాతం కోత విధించింది. దీంతో రూ.1 లక్షల లోపు డిపాజిట్లకు వడ్డీ 5 శాతానికి తగ్గనుంది. లక్ష రూపాయల నుంచి కోటి లోపు ఉన్న మొత్తాలకు వడ్డీరేటును 6 శాతంగా ఉంచింది. కోటి రూపాయలు, ఆపై ఉన్న మొత్తాలపై వార్షిక వడ్డీరేట్లకు 25 బేసిస్ పాయింట్లు కోత పెట్టి 6.5 శాతం నుంచి 6.25 శాతానికి తగ్గించింది. సెప్టెంబర్ 1 నుంచి ఈ కొత్త రేట్లు అమల్లోకి వస్తాయని యస్ బ్యాంకు ప్రకటించింది. ఇప్పటికే ప్రభుత్వరంగ దిగ్గజం ఎస్‌బిఐ పొదుపు ఖాతాల డిపాజిట్లపై వడ్డీరేటును 50 బేసిస్ పాయింట్లు తగ్గించిన విషయం తెలిసిందే. కోటి లోపు ఉన్న నగదు నిల్వలపై వడ్డీరేటును అరశాతం తగ్గించి 3.5 శాతంగా నిర్ణయించింది. అలాగే ప్రైవేట్‌రంగ దిగ్గజం యాక్సిస్ బ్యాంకు కూడా 50 లక్షల కన్నా తక్కువున్న సేవింగ్స్ ఖాతా డిపాజిట్లపై 3.5 శాతం వడ్డీరేటును మాత్రమే చెల్లించనున్నట్టు ప్రకటించింది. కర్నాటక బ్యాంకు, బ్యాంకు ఆఫ్ బరోడాలు కూడా తమ సేవింగ్స్ ఖాతా డిపాజిట్లపై వడ్డీరేట్లను తగ్గించాయి. రానున్న రోజుల్లో మరిన్ని బ్యాంకులు పొదుపు ఖాతాల వడ్డీ రేట్లను తగ్గించవచ్చని అంచనా వేస్తున్నారు. అయితే సేవింగ్ ఖాతాల వడ్డీ తగ్గుముఖంతో రుణాల రేట్లు తగ్గనున్నాయని నిపుణులు చెబుతున్నారు.

2027 వరకు ట్యాక్స్ హాలిడే

- ఈశాన్య రాష్ట్రాలకు పన్ను మినహాయింపు కొనసాగింపు : జైట్లీ



న్యూఢిల్లీ: ఈశాన్య, హిమాలయ రాష్ట్రాల్లో పరిశ్రమలకు 2027 మార్చి వరకు పన్ను మినహాయింపులు కొనసాగుతాయని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ వెల్లడించారు. ఈ వ్యవధిలో జిఎస్‌టి చట్టం కింద ప్రతి పరిశ్రమ సొంతంగా రీఫండ్ యంత్రంగాన్ని ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలోని కేబినెట్ సమావేశం అనంతరం మీడియా ఆయన ఈ విషయాలను వెల్లడించారు. గతంలోని ఎక్సైజ్ విధానంలో మాధిరిగానే ఈశాన్య రాష్ట్రాలు, జమ్మూకాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి హిమాలయన్ రాష్ట్రాల్లోని పరిశ్రమలకు పదేళ్లపాటు మినహాయింపు ఉంటుందని మంత్రి తెలిపారు. ఈ స్కీమ్ కింద పరిశ్రమలు ఈ వ్యవధిలో టాక్స్ హాలిడేను 10 ఏళ్లు పొందుతాయి. కొత్త జిఎస్‌టి చట్టం కింద మినహాయింపునకు ఎలాంటి నియమం లేనప్పటికీ చట్టం కింద ఒక సెక్షన్ రీఫండ్‌కు అనుమతి ఇస్తోందని అన్నారు. దీంతో డిబిటి ద్వారా రీఫండ్‌కు అనుమతి ఇవ్వనుండగా, మినహాయింపు 2027 సంవత్సరం వరకు పొడిగించినట్టు మంత్రి వివరించారు. దీనికి బడ్జెట్ కేటాయింపు రూ.27,413 కోట్లు సాయం పొందనున్నాయని తెలిపారు. ఈ రాష్ట్రాల్లో ఉన్న పరిశ్రమలు జిఎస్‌టి చట్టం అమల్లోకి రావడానికి ముందు సెంట్రల్ ఎక్సైజ్ మినహాయింపు ప్రయోజనాలు పొందాయి. సిక్కిం సహా ఈశాన్య రాష్ట్రాల కోసం ఎన్‌ఇఐఐపి(ఈశాన్య పరిశ్రమల, పెట్టుబడి ప్రోత్సాహక పాలసీ) 2007ని కేంద్రం అమలు చేస్తోంది. పరిశ్రమలను ప్రోత్సహించేందుకు గాను జమ్మూకాశ్మీర్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాలకు ప్రత్యేక కేటగిరీ కింద ప్యాకేజీని ఇచ్చింది. ఎన్‌ఇఐఐపి 2007 కింద ప్రయోజనాల్లో భాగంగా వాణిజ్య ఉత్పత్తులను ప్రారంభించిన తర్వాత ఈ రాష్ట్రాలు పదేళ్ల పాటు ఎక్సైజ్ సుంకం మినహాయింపును పొందుతాయి. కాగా పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి అమలు వల్ల పన్నుల చెల్లింపు, డిజిటైజేషన్ పెరుగుతాయని ఇటీవల జైట్లీ వెల్లడించారు. ప్రత్యక్ష, పరోక్ష పన్నుల వ్యవస్థ పరిధి విస్తరించిందని తెలిపారు. విదేశాల్లో డబ్బు పోగేసుకుంటున్నవారిపై కఠిన చర్యలను ప్రారంభించడం వ్యవస్థను కుదిపేసిందని, ఇది ప్రభుత్వం తీసుకున్న మొదటి కీలక చర్య అని చెప్పారు. అవినీతిపరులు షెల్ కంపెనీలను సృష్టించి అక్రమాలకు అడ్డాగా మార్చుకుంటున్నారని అన్నారు. అవినీతికి పాల్పడే వ్యాపారులు, రాజకీయ నేతలు, ప్రభుత్వాధికారులు వీటిని వాడుకుంటున్నారని పేర్కొన్నారు. బినామీ చట్టాన్ని ప్రయోగించి అక్రమాస్తులను ప్రభుత్వపరం చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఈ పనిని రెవిన్యూ శాఖ ప్రారంభించిందన్నారు. షెల్ కంపెనీల ద్వారా డబ్బును దారి మళ్లించే వ్యాపారం త్వరలోనే కుప్పకూలుతుందని తెలిపారు. బినామీ ఆస్తుల చట్టానికి సవరణలు జరిగిన తర్వాత పన్ను ఎగవేతదారులు, అవినీతిపరుల వెన్నులో వణుకుపుట్టిందని, స్వాతంత్ర్యానంతరం అమలవుతున్న అతి పెద్ద సంస్కరణ జిఎస్‌టి అని అన్నారు. దీనివల్ల జీడీపీ పెరుగుతుందని తెలిపారు.

తొలి విడతగా 100 డొల్ల కంపెనీలకు ఆడిట్

- సమాయత్తమవుతున్న స్టాక్ ఎక్స్ఛేంజీలు బిఎస్‌ఇ, ఎన్‌ఎస్‌ఇ



న్యూఢిల్లీ: డొల్ల కంపెనీలపై చర్యలు వేగవంతమవుతున్నాయి. 331 అనుమానిత షెల్ కంపెనీలకు గాను తొలి విడతగా 100 కంపెనీల ఆడిట్ ప్రక్రియ చేపట్టాలని స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు బిఎస్‌ఇ, ఎన్‌ఎస్‌ఇలు నిర్ణయించినట్టు సమాచారం. మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ సహరాలంతో ఈ విచారణ చేపట్టనున్నాయి. దీనికోసం ఆడిటర్ల బృందాన్ని కూడా ఏర్పాటు చేసేందుకు స్టాక్‌ఎక్స్ఛేంజిలు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. ఈ సంస్థలపై విచారణ ముగిసే వరకు ప్రమోటర్ల షేర్లు స్తంభింప చేయనున్నాయి. సెబీ గుర్తించిన అన్ని అనుమానిత షెల్ కంపెనీ ట్రేడింగ్ వివరాలను స్టాక్ ఎక్స్ఛేంజిలు పరిశీలించనున్నాయి. డొల్ల కంపెనీలపై ఆడిట్ నిర్వహించాలని సెబీ సూచించిన నేపథ్యంలో బిఎస్‌ఇ 331 కంపెనీల్లో 162 కంపెనీల జాబితా తయారు చేయగా, 154 కంపెనీల సమాచారం మాత్రమే లభ్యమైంది. అయితే ఇందులో 50 కంపెనీలు వరుసగా నాలుగేళ్లుగా నష్టాల్లో ఉన్నాయని, 24 కంపెనీల అమ్మకాలు గతేడాది నుంచి నిలిచిపోయినట్లు తెలిసింది. ఇప్పటివరకు రిటైల్, ఎక్కువ సంపద ఉన్న వ్యక్తులే ఈ సంస్థల్లో 95 శాతం వరకు వాటాలను కలిగి ఉన్నట్టు సమాచారం. షెల్ కంపెనీల ప్రభావంతో బ్యాంకులు కూడా తీవ్రంగా దెబ్బతినబోతున్నాయి. 331 స్టాక్స్ విలువ పడిపోవడంతో ఇప్పటికే మొండిబకాయిలతో సతమతమవుతున్న బ్యాంకులు మరింత నష్టపోనున్నాయి. కాగా ఆగస్టు 8న అనుమానిత డొల్ల కంపెనీల్లో ట్రేడింగ్‌పై మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నిషేధం విధించింది. దాదాపు 331 డొల్ల కంపెనీల్లో(నల్లధనం, పన్నుల ఎగవేత కోసం ఏర్పాటు చేసేవి) ట్రేడింగ్‌ను నిలుపుదల చేయాలని స్టాక్ ఎక్స్ఛేంజ్‌లను ఆదేశించింది. ఈ లిస్టెడ్ కంపెనీల ట్రేడింగ్‌లో జిఎస్ఎం (గ్రేడెడ్ సర్విలెన్స్ మీసర్) స్టేజ్ 6 తక్షణమే అమల్లోకి వస్తుందని సెబి పేర్కొంది. దీంతో డొల్ల కంపెనీల్లో ట్రేడింగ్‌ను నెలలో ఒక్కసారి మాత్రమే పరిమితం చేస్తారు. అది కూడా ట్రేడ్ నుంచి ట్రేడ్ విభాగంలో ఉంటుంది. 331 లిస్టెట్ కంపెనీలు ఎలాంటి వ్యాపార లావాదేవీలు లేకుండా ఉన్నాయని గుర్తించారు. వీటిపై ఆడిట్ నిర్వహించాలని, అవసరమైతే ఫోరెన్సిక్ ఆడిట్‌ను నిర్వహించాలని సెబీ సూచించింది.

ఊపందుకున్న ఈక్విటీ మార్కెట్లు

- 321 పాయింట్ల పెరిగిన సెన్సెక్స్



న్యూఢిల్లీ: దేశీయ ఇన్వెస్టర్ల నుంచి భారీగా మూలధన నిధులు పెరగడంతో బుధవారం ఈక్విటీ మార్కెట్లు ఉత్సాహంగా ముందుకు సాగాయి. నిఫ్టీ 9900 పాయింట్ల స్థాయిని ఇంకా తాకలేదు. గతవారం నష్టాలను మూటగట్టుకున్న దేశీయ సూచీలు ఎట్టకేలకు ఈ వారం లాభాల బాట పట్టాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల ప్రభావం మార్కెట్ సెంటిమెంట్‌కు కలిసొచ్చింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి స్వల్పంగా తగ్గి 103.15 లాభంతో 9,897.30 పాయింట్ల వద్ద ముగిసింది. 30 షేర్ల బిఎస్‌ఇ సెన్సెక్స్ 321.86 పాయింట్లు లాభపడి 31,770.89 పాయింట్ల వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ ప్రారంభంతో సెన్సెక్స్ లాభాల బాటలోనే పయనించాయి. 42.71 పాయింట్ల వద్ద ప్రారంభమైన సెన్సెక్స్ 31 వేల బెంచ్ మార్కును చేరుకుంది. నిరంతర పెట్టుబడులు, రిటైల్ ద్రవ్యోల్బణం ముఖ్యంగా మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేశాయి. నిఫ్టీలోలో టెక్ మహీంద్రా, సిప్లా, టాటా మోటార్స్, బ్యాంక్ ఆఫ్ బరోడా, టాటా పవర్ షేర్లు భారీ గా లాభపడ్డాయి. మరోవైపు పవర్‌గ్రిడ్, ఏషియన్ పెయిం ట్, ఎస్ బ్యాంకు, ఎటిపిసి షేర్లు స్వల్పంగా నష్టపోయాయి. కొద్ది నెలలుగా దిగువకు చేరుకున్న ద్రవ్యోల్బణ గణాంకాలు మళ్లీ పెరుగుదలను వైపు పయనిస్తున్నాయి. జులై నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం, టోకు ద్రవ్యోల్బణం రెండు సూచీలు పెరిగాయి. అయితే ఈ సూచీలు ఆర్‌బిఐ అంచ నా స్థాయి 4 శాతం స్థాయి కంటే దిగువనే ఉన్నాయి. దీం తో వడ్డీ రేటు తగ్గింపునకు మరింత అవకాశాలు ఏర్పడినా యి. సిపిఐ(వినిమయ ధర సూచీ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం జులైలో 2.36 శాతానికి పెరిగింది. ఇంతకుముం దు జూన్‌లో ఇది 1.46 శాతంగా ఉంది. మరోవైపు జులై నెలలో టోకు ద్రవ్యోల్బణం 1.88 శాతంతో స్వల్పంగా పెరిగింది. అంతకు ముందు నెలలో ఇది 0.90 శాతంగా ఉంది. ఆహార పదార్థాలు, కూరగాయల ధరలు పెరగడంతో ద్ర వ్యోల్బణ ఆధారిత డబ్ల్యుపిఐ(టోకు ధర సూచీ) స్వల్పంగా పెరిగింది.

ఇప్పటివరకు 81 లక్షల ఆధార్ కార్డులు రద్దు



న్యూఢిల్లీ: ప్రభుత్వం పాన్ కార్డులతో పాటు ఆధార్ కార్డులనూ పరిశీలిస్తోంది. ఇప్పటివరకు దాదాపు 81 లక్షల ఆధార్ కార్డులను రద్దు చేసినట్టు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటి శాఖ సహాయ మంత్రి పిపి చౌదరీ తెలిపారు. రాష్ట్ర, సంవత్సరం వారీగా గణాంకాలను యుఐడిఎఐ(యునిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా) నిర్వహించడం లేదని తెలిపారు. ఒక్కొక్కరికి ఒక్కొక్క ఆధార్ సంఖ్యను జారీ చేయాలన్న లక్ష్యంతో ఈ విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇప్పటి వరకు 111 కోట్ల ఆధార్ సంఖ్యలు జారీ అయ్యాయి. ఆధార్ వల్ల పన్నుల ఎగవేత, నల్లధనాన్ని పోగేసుకోవడం వంటి అక్రమాలను నిరోధించవచ్చునని ప్రభుత్వం చెప్తోంది. అయితే వివిధ కారణాలను చూపుతూ ప్రభుత్వం 81 లక్షల ఆధార్ సంఖ్యలను డీయాక్టివేట్ చేసింది. ఆధార్ యాక్టివేషన్‌లో ఉందా? లేదా? తెలుసుకోవాలంటే వెబ్‌సైట్ https://uidai.gov.in లో లాగ్ ఆన్ అవాలి. దానిలో వెరిఫై ఆధార్ నంబర్ అనే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. అప్పుడు ఓ కొత్త పేజీ ఓపెన్ అవుతుంది. దీనిలో రెండు బాక్స్‌లు ఉంటాయి. ఒకదానిలో ఆధార్ సంఖ్యను టైప్ చేసి, రెండోదానిలో ఆ బాక్స్ పక్కనే ఇచ్చిన సెక్యూరిటీ కోడ్‌ను ఎంటర్ చేయాల్సి ఉంటుంది. అనంతరం మరొక పేజీ ఓపెన్ అవుతుంది. దీనిలో పరీక్షిస్తున్న ఆధార్ సంఖ్య యాక్టివ్‌గా ఉందా? లేదా? అనేది తెలుసుకోవచ్చు.

21 స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థలకు కేంద్రం ఆదేశాలు



న్యూఢిల్లీ : చైనా ఫోన్లపై కేంద్రం నిఘాను మరింతగా పెంచింది. దేశంలో వినియోగదారుల వ్యక్తిగత వివరాలను చైనా మొబైల్ ఫోన్లు దొంగిస్తున్నాయని కేంద్రం అనుమానం వ్యక్తం చేస్తోంది. ఈ మేరకు మొత్తం 21 కంపెనీలకు నోటీసులు పంపింది. వీటిలో చైనాకు చెందిన మొబైల్ తయారీ కంపెనీలు వివో, ఒప్పో, షియోమి, జియోనీలు ఉన్నాయి. వీటిలో యాపిల్, శాంసంగ్‌తో పాటు దేశీయ కంపెనీ అయిన మైక్రోమ్యాక్స్ తదితర కంపెనీలు కూడా ఉన్నాయి. మొబైల్ ఫోన్ల భద్రత కోసం, కంపెనీలు తీసుకుంటున్న భద్రతా ప్రమాణాలేమిటో తమకు తెలియజేయాలని ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన కంపెనీల్లో ఎక్కువగా చైనీస్ సంస్థలే ఉన్నాయి. కంపెనీలు అందిస్తున్న భద్రతా భరోసాలో డివైజ్, ప్రీలోడెడ్ యాప్స్ ఉన్నాయి. మొబైల్ ఫోన్లు లేదా స్మార్ట్‌ఫోన్ భద్రతా, రక్షణ ఎంతో అవసరమని, విలువైన సమాచారాన్ని యూజర్లు దీనిలో కలిగి ఉంటారని ఈ మంత్రిత్వ శాఖకు చెందిన ఓ అధికారి చెప్పారు. తనిఖీల్లో పట్టుబడితే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. సమాచారం లీక్ విషయంలో తాము ఎవరినీ ఉపేక్షించబోమని అన్నారు. ప్రస్తుతం డాటా పాత్ర చాలా కీలకమని, దాన్ని సురక్షితంగా ఉంచాల్సిన బాధ్యత ఉందని అధికారి పేర్కొన్నారు. ఐటీ చట్టం, సెక్షన్ 43(ఎ) కింద యూజర్ల డేటాను సురక్షితంగా ఉంచే బాధ్యత కంపెనీలదేనని కూడా తెలిపారు. నిబంధనలకు అందరూ కట్టుబడి ఉండాల్సిందేనని అన్నారు.



ఇండియన్ బ్యాంక్ 111వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్‌తో కలిసి రక్తదాన శిబిరాలను నిర్వహించింది. ఇండియన్ బ్యాంక్ హైదరాబాద్ జోన్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

19న డిజిటల్ మార్కెటింగ్ జాబ్ మేళా

మన తెలంగాణ / హైదరాబాద్ : డిజిటల్ మార్కెటింగ్, ఈవెంట్ మేనేజ్‌మెంట్ అంశాలపై ఈ నెల 19న జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు ట్రేడ్ హైదరాబాద్ డాట్ కామ్ డైరెక్టర్ కుశ లవ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏదేని డిగ్రీ, లేదా ఎంబిఏ పూర్తి చేసిన అభ్యర్థులు ఉద్యోగ మేళాలను పాల్గొనవచ్చని, ఇందుకు గాను ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు. అభ్యర్థులు మరిన్ని వివరాలకు ఫోన్ 7337556150లో సంప్రదించవచ్చన్నారు.

జియో రీచార్జ్ ఆఫర్



న్యూఢిల్లీ: రిలయన్స్ జియో మరో బంపర్ ఆఫర్‌ను అందిస్తోంది. మొబైల్ పోస్ట్ పెయిడ్, ప్రీపెయిడ్ రీచార్జిలపై సరికొత్త ఆఫర్లను ప్రారంభించింది. పేటీఎం, ఫ్లిప్‌కార్ట్‌కు చెందిన ఫోన్‌పే ద్వారా క్యాష్‌బ్యాక్ ఆఫర్‌ను ప్రకటించింది. తాజా నివేదిక ప్రకారం జియో పేటీఎం, ఫోన్‌పే యాప్‌ల ద్వారా రీచార్జిలపై క్యాష్ బ్యాక్ ఆఫర్ అందిస్తోంది. జియో 8 ప్లాన్స్ ఆఫర్ చేస్తోంది. వీటిలో రూ.309, రూ.349, రూ.399, రూ.509, రూ.999, రూ.1,999, రూ.4,999, రూ.9,999 వంటి రీచార్జ్‌లతో ఆఫర్లను పొందవచ్చు. పేటీఎం ద్వారా రూ.300 ఆఫర్‌పై రూ.76ల క్యాష్ బ్యాక్ అందిస్తోంది. ఫోన్‌పే ద్వారా రీచార్జి చేసుకుంటే రూ.75 క్యాష్ బ్యాక్ ఆఫర్ అందిస్తోంది. అయితే దీనికి జియో యూజర్లకు కంపెనీ పంపిన ఒక ప్రోమో కోడ్‌ను ఎంటర్ చేయాల్సి ఉంటుంది.



స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	31770.89	321.86	1.02%
నిఫ్టీ	9897.30	103.15	1.05%

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	64.4700
యూరో	70.4270
బ్రిటిష్ పౌండ్	83.4957
ఆస్ట్రేలియన్ డాలర్	47.4050
కెనెడియన్ డాలర్	47.0500
ఎమిరైట్ దిర్హామ్	17.5040
స్విస్ ఫ్రాంక్	64.5500
చైనీస్ యువాన్	9.3344
మలేషియన్ రింగిట్	14.8460
న్యూజిలాండ్ డాలర్	44.4990
హాంగ్‌కాంగ్ డాలర్	8.2824
జపనీస్ యెన్	0.5688
కువైట్ దినార్	212.0888
సౌతాఫ్రికన్ రాండ్	4.7209

బులియన్




బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	27480	29390.37	0.76%
ముంబై	28480	30459.89	0%
ఢిల్లీ	28050	30000.00	0.18%
కోల్‌కతా	28410	30385.03	0%
కేరళ	27000	28877.01	0%
బెంగళూరు	27450	29358.29	0%
హైదరాబాద్	27590	29508.02	0.36%
గల్ఫ్	1347.1	1440.75	0.64%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	బుధవారం	మంగళవారం	మార్పు (%)
చెన్నై	42200.00	42400.00	-0.47
ముంబై	42200.00	42400.00	-0.47
ఢిల్లీ	42200.00	42400.00	-0.47
కోల్‌కత్తా	42200.00	42400.00	-0.47
హైదరాబాద్	42200.00	42400.00	-0.47



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	351	విశాఖపట్నం	360
వరంగల్	350	చిత్తూరు	380
విజయవాడ	355	చెన్నై	387
గోదావరి	355	బెంగళూరు	375


సెబీ నిబంధనలు
సడలింపు

న్యూఢిల్లీ: మొండి బకాయిల సమస్యలను పరిష్కరించేందుకు బ్యాంకులకు నిబంధనలను మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ సడలించింది. వాటాదారులకు ఓపెన్ ఆఫర్ చేయడం నుంచి మినహాయింపునిచ్చింది. ఒత్తిడి ఆస్తుల్లో వాటాల కొనుగోలుకు నిబంధనలను సడలించింది. మొండి బకాయిల సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం, ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్)లు చర్యలు వేగవంతం చేసేందుకు సెబీ ఈ నిర్ణయం తీసుకుంది. బ్యాంకుల్లో మొండి బకాయిలు రూ.8 లక్షల కోట్లకు చేరున్న విషయం తెలిసిందే. ఎక్స్ఛేంజ్ వద్ద లిస్ట్ అయిన నష్టాల కంపెనీల్లో వాటాల కొనుగోలు కోసం సెబీ నిబంధనలను సడలించింది. అదే సమయంలో దివాలా చట్టం కింద సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టింది.



వొడాఫోన్
రూ.348 ఆఫర్

న్యూఢిల్లీ: రిలయన్స్ జియో నుంచి గట్టిపోటీ నేపథ్యంలో తాజాగా వొడాఫోన్ కూడా సరికొత్త ఆఫర్లను ప్రకటించింది. అయితే ఈసారి రాజస్థాన్ రాష్ట్ర ప్రజలకే ఈ ఆఫర్‌ను ఇస్తోంది. రూ.348 ప్రీపెయిడ్ రీచార్జ్ కింద అపరిమిత వాయిస్ కాల్స్, 1 జిబి 4జి డాటాను అందిస్తోంది. ఈ ఆఫర్ ప్రస్తుతానికి రాజస్థాన్‌లోని వొడాపోన్ వినియోగదారులకు మాత్రమే సంస్థ ప్రకటించింది. 4జి, 3జి, 2జి ప్రీపెయిడ్ కస్టమర్లందరూ ఈ అపరిమిత వాయిస్ కాలింగ్, డాటా ప్రయోజనాలను పొందవచ్చని పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని వొడాఫోన్ స్టోర్లు, రిటైల్ అవుట్‌లెట్లలో అందుబాటులో ఉంటుందని కంపెనీ తన అధికారిక ప్రకటనలో తెలిపింది. మై వొడాఫోన్ యాప్ ద్వారా కస్టమర్లు ఈ రీఛార్జ్ చేసుకోవచ్చని పేర్కొంది.



నేటి నుంచి భోపాల్‌లో అమిత్ షా మూడు రోజుల పర్యటన



భోపాల్: బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షా మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో గురువారం నుంచి మూడు రోజులు పర్యటించనున్నారు. ఈ పర్యటనలో ఆయన పార్టీ నాయకులతో భేటీ కానున్నారు. జన్‌సంఘ్ వ్యవస్థాపకుడు పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ విగ్రహాన్ని ఇక్కడ ఆవిష్కరించనున్నారు. మధ్యప్రదేశ్ బిజెపి అధ్యక్షుడు నంద్‌కుమార్ సింగ్ చౌహాన్ ఈ విషయమై విలేకరులతో బుధవారం మాట్లాడుతూ అమిత్ షా భోపాల్‌కు గురువారం సాయంత్రం వస్తారన్నారు. ఆగస్టు 18న లాల్‌ఘాటీ స్క్వేర్ వద్ద దీన్‌దయాళ్ ఉపాధ్యాయ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారన్నారు. పార్టీని బలోపేతం చేసే లక్ష్యంతోనే షా భోపాల్‌కు వస్తున్నారని చౌహాన్ తెలిపారు. తన మూడు రోజుల పర్యటనలో అమిత్ షా సంస్థ నాయకులు, క్యాబినేట్ సభ్యులు, ఎంపీలు, ఎంఎల్‌ఎలు, ఇతరులతో భేటీ అవుతారని కూడా చౌ హాన్ తెలిపారు. మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు 2018లో జరగనున్నాయి. బిజెపి సీనియర్ నాయకుడు కైలాస్ నారాయణ్ సారంగ్ రాసిన పుస్తకాన్ని కూడా అమిత్ షా ఆవిష్కరించనున్నారు. తన పర్యటనలో అమిత్ షా ప్రతిభావంతులైన విద్యార్థులను, మేధావులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అంతేకాక విలేకరుల సమావేశంలో కూడా పాల్గొంటారని చౌహాన్ చెప్పారు.

మోడీ కశ్మీర్ విధానం పాక్‌కు అవకాశం ఇస్తోంది : రాహుల్




బెంగళూరు: జమ్మూకశ్మీర్ విషయంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని బుధవారం రాహుల్ గాంధీ విమర్శించారు. ఆ కల్లోలిత రాష్ట్రంలో పాకిస్థాన్ దుష్ప్రవర్తనకు మోడీ విధానం అవకాశం ఇస్తోందన్నారు. ఇక్కడి కాంగ్రెస్ ర్యాలీలో ప్రసంగిస్తూ రాహుల్ ఈ విషయాన్ని చెప్పారు. కశ్మీర్‌లో మోడీ కోపం, ద్వేష వాతావరణాన్ని సృష్టించారని అన్నారు. అక్కడ ద్వేషం, హింస నుంచి లాభంపొందేవారెవరైనా ఉన్నారంటే అది పాకిస్థాన్ అని చెప్పారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా, పి.చిదంబరం, జైరామ్ రమేశ్ మంత్రులుగా ఉన్నప్పుడు తాను వారితో కలసి కశ్మీర్ విషయంలో పనిచేశానని, అయితే ఎలాంటి నాటకాలాడకుండా నిశ్శబ్దంగా పనిచేసుకుపోయామన్నారు. జమ్మూకశ్మీర్ ప్రజలు మనల్ని కలుపుకోవాలి, మనం వారిని కల్పుకోవాలి అని రాహుల్ అన్నారు. ఈ సందర్భంగా కర్నాటక సిఎం సిద్ధరామయ్య, లోక్‌సభలో కాంగ్రెస్ నాయకుడు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర ఇన్‌ఛార్జి కె.సి.వేణుగోపాల్, పిసిసి అధ్యక్షుడు జి.పరమేశ్వర, తదితరులు ఉన్నారు.

మిజోరాంలో మూడు చిన్న పార్టీల ముందస్తు ఎన్నికల పొత్తు



ఐజ్వాల్: వచ్చే ఏడాది మిజోరాంలో జరుగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు మూడు చిన్న పార్టీలు కలిసి ముందస్తు ఎన్నికల పొత్తు కుదుర్చుకున్నాయి. జోరాం నేషనలిస్ట్ పార్టీ (జెడ్ఎన్‌పి), మిజోరాం పీపుల్స్ కాన్ఫరెన్స్(ఎంపిసి), జోరాం ఎక్సోడస్ మూవ్‌మెంట్(జడ్ఇఎం) కలిసి కూటమిగా ఏర్పడినట్లు జడ్ఇఎం కన్వీనర్ కె సప్తాంగ తెలిపారు. ఈ మేరకు మూడు పార్టీలు కలిసి ఒక ఒప్పందంపై సంతకాలు చేసినట్లు ఆయన మీడియాకు తెలిపారు. అధికార కాంగ్రెస్ పార్టీ, మాజీ మిజో నేషనల్ ఫ్రంట్ పట్ల అసంతృప్తితో ఉన్న వారితో చర్చలు జరుపుతున్నామని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఆరు గ్రూపులతో చర్చలు జరుపుతున్నాయని, వచ్చే వారం తుది నిర్ణయం వెల్లడవుతుందని సప్తాంగ పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, ఎంఎన్‌ఎఫ్ కు వ్యతిరేకంగా మూడో ఫ్రంట్‌ను ఏర్పాటు చేయాలనుకుంటున్నామని తెలిపారు. 2018లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న మిజోరాంలో 40 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. 1972లో కేంద్ర పాలిత ప్రాంతంగా ఏర్పడిన మిజోరాం 1987లో రాష్ట్రంగా ఆవిర్భవించింది.

డిఎంకె అధ్యక్షుడు కరుణానిధికి ఆస్పత్రిలో స్వల్ప చికిత్స, డిశ్చార్జి



చెన్నై: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎం కరుణానిధికి స్వల్ప వైద్య చికిత్స అనంతరం ఆయనను ఆస్పత్రి నుంచి బుధవారం డిశ్చార్జి చేశారు. 93 ఏళ్ల కరుణానిధికి చిన్న పెగ్ (పెర్క్యుటేనస్ ఎండోస్కోపిక్ గ్యాస్ట్రోస్టమీ) ట్యూబ్‌ను మార్చినట్లు కావేరి ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్ అరవిందన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయనకు 40 నిమిషాల పాటు స్వల్ప వైద్య చికిత్స అందించిన అనంతరం డిశ్చార్జి చేసినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. కరుణానిధి వెంట ఆస్పత్రిలో ఆయన కుటుంబ సభ్యులు ఉన్నారు. ప్రతి ఆరు నెలలకోసారి ట్యూబ్‌ను మార్చినట్లైతే ఆరోగ్యాని ఎలాంటి ప్రమాదం లేదని ఆయన కుమార్తె కనిమొళి తెలిపారు. మందుల ప్రభావంతో అస్వస్థతకు గురైన కరుణానిధి గత ఏడాది అక్టోబరులో ఒకసారి, డిసెంబర్‌లో మరోసారి ఆస్పత్రిలో చేరారు. కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ, మాజీ కేంద్ర మంత్రి పి చిదంబరం, ఎఐఎడిఎంకె నేతలు ఎం తంబిదొరై, డి జయకుమార్ సహా పలువురు నేతలు ఆస్పత్రిని సందర్శించిన వారిలో ఉన్నారు.

మోడీ ఉపన్యాసంపై సామ్నాలో శివసేన వ్యంగ్య వ్యాఖ్యలు



ముంబై: ప్రధాని నరేంద్ర మోడీ స్వాతంత్ర్య దినోత్సవ ఉపన్యాసంపై శివసేన ధ్వజమెత్తింది. కేంద్రానికి దమ్ముంటే రాజ్యాంగ నిబంధన 370ని రద్దు చేయాలని డిమాండ్ చేసింది. ఆ నిబంధనను రద్దు చేసినట్లైతే దేశ ప్రజలంతా కశ్మీర్‌ను సందర్శించి ప్రజలతో మమేకమవుతారని పేర్కొంది. కశ్మీర్ సమస్య బుల్లెట్లు లేదా అధికార దుర్వినియోగంతో పరిష్కారం కాదని, ప్రజలతో మమేకం కావడం వల్లనే పరిష్కారమవుతుందని తన ఉపన్యాసంలో ప్రధాని పేర్కొన్నారు. ఇలాంటి ఆలోచన ఇంతకు ముందు ఎందుకు రాలేదని శివసేన పేర్కొంది. మతం పేరుతో దేశంలో హింస పెరిగిపోయిందని, ముస్లింలతోపాటు హిందువులు కూడా భయపడుతున్నారని శివసేన వ్యాఖ్యానించింది. హిందూ సమాజంలో కొంత మంది గోరక్షణ పేరుతో ఉగ్రవాదం, హింసకు పాల్పడుతున్నారని ఆరోపించింది. గోరక్షకులను కేవలం హెచ్చరించి వదిలి పెట్టినట్లైతే సమస్య పరిష్కారం కాదని ఎన్‌డిఎలో భాగస్వామ్య పార్టీ అయిన శివసేన పేర్కొంది. పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి పట్ల వ్యవహరించినట్లుగానే వందే మాతరం పాటను పాడేందుకు నిరాకరిస్తున్న వారిపట్ల ఎందుకు వ్యవహరించడం లేదని ప్రశ్నించింది. విదేశాల్లోని నల్లధనం తీసుకొచ్చి ప్రతి భారతీయుడి అకౌంట్‌లో రూ. 15 లక్ష లు వేస్తామని మోడీ వాగ్దానం చేశారని పేర్కొంది. రాబోయే రెండేళ్లలో ఆయన వాగ్దానం నెరవేర్చుతారని నమ్ముతున్నట్లు శివసేన పేర్కొంది.

బ్లూవేల్ గేమ్ వేదికలపై చర్యలు



న్యూఢిల్లీ: దేశంలో అమాయక పిల్లల ఆత్మహత్యలకు కారణమవుతున్న బ్లూవేల్ గేమ్ లింకులను తొలగించని ఇంటర్నెట్ సామాజిక మాధ్యమా లపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఈ విషయాన్ని న్యాయ, సమాచార సాంకేతిక మంత్రి రవి శంకర్ ప్రసాద్ బుధవారం చెప్పారు. 'బ్లూవేల్ గేమ్ కారణంగా ప్రజలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. సంబంధిత శాఖలు సహా అనేక ఫిర్యాదులు మాకు అందాయి' అని ఆయన చెప్పారు. ఆ ఆటను డిలింక్ చేయాలని స్పష్టమైన ఆదేశాలి చ్చామన్నారు. బ్లూవేల్ ఛాలెంజ్ అనే ఆ అపాయకరమైన ఆ ఆట అను సంధానాలను ఆన్‌లైన్ నుంచి వెంటనే తొలగించాలంటూ ఇంటర్నెట్ దిగ్గజాలైన గూగుల్, ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, మైక్రోసాఫ్ట్, యాహూలకు ప్రభుత్వం ఆగస్టు 11న ఆదేశించింది. ఆ గేమ్ భారత్, ఇతర దేశాలలో బాలల ఆత్మహత్యలకు కారణమైంది. బ్లూవేల్ ఛాలేంజ్ అనేది సామాజిక మాధ్యమంగా ఆడే ఆట,ఇది అనేక మంది ఆత్మహత్య లకు దారితీసింది. ఈ అపాయకరమైన ఆడేందుకు ఆ ఆట నిర్వాహకులు పిల్లలను సామాజిక మాధ్యమ వేదికల ద్వారా ఆహ్వానించడం, పురికొల్పడం చేస్తున్నారని, అది చివరికి తీవ్ర చర్యలు తీసుకునేలా చేస్తోందని, గాయాలను కలిగించడమేకాక, ఆత్మహత్యలకు కూడా దారితీస్తోందని ప్రసాద్ చెప్పారు. ఈ ఆట వల్ల ముంబయి, పశ్చిమ మిడ్నాపూర్ జిల్లాలో మరణాలు సంభవించాయి. కేరళలో కూడా మంజో సి మనూ(16) అనే ఓ టీనేజర్ ఈ ఆటకు బానిసై ఆత్మహత్య చేసుకున్నాడు. సోలాపూర్, ఇండోర్‌లలో బాలలు ఆత్మహత్యలకు యత్నించినప్పుడు సకాలంలో జోక్యం చేసుకునా కాపాడగలిగారు.

కొత్త ఉద్యోగం.. ఎక్కువ వేతనం

- 91శాతం మంది నిపుణుల అభిప్రాయమిదే
- లింక్డ్‌ఇన్ సర్వేలో వెల్లడి



ముంబయి: భారత్‌లో దాదాపు 91 శాతం మంది నిపుణులు ఎక్కువ వేతనం, కొత్త ఉద్యోగావకాశాల కోసం ఎదురు చూస్తున్నారని లింక్డ్‌ఇన్ సర్వే నివేదిక పేర్కొంది. ఈ పోకడ గత ఏడాది నుంచి ఊపందుకుందని 'నేటి అభ్యర్థుల మనస్సులో' అన్న లింక్డ్‌ఇన్ నివేదిక పేర్కొంది. 2017 ఏప్రిల్‌లో భారత్‌లో 539 మందిపై సర్వే చేసి లింక్డ్‌ఇన్ ఈ నివేదిక రూపొందించింది. కొత్త రిక్రూటర్‌ల నుంచి వార్త అందగానే తాము ఉబ్బిపోయామని 46 శాతం మంది చెప్పారు. ఎక్కువ వేతనం కోసమే తాము కొత్త ఉద్యోగానికి మారామని 45 శాతం మంది చెప్పారు. ఇంటర్వ్యూ సమయంలోనే తమ జీతభత్యాల గురించి తెలుసుకోవాలనుకున్న వారు 37 శాతం మంది. ఇంటర్వ్యూకు సిద్ధమయ్యే ముందు కంపెనీ గురించి తెలుసుకునేందుకు 49 శాతం మంది అభ్యర్థులు కంపెనీ వెబ్‌సైట్ చూశారు. కాగా 47 శాతం మంది సెర్చ్ ఇంజిన్లు చూడగా, 35 శాతం మంది ప్రొఫెషనల్ నెట్‌వర్క్స్ చూశారు. నిపుణులలో 63 శాతం మంది సామాజిక మాధ్యమాన్ని ఉపయోగించుకున్నారు. అభ్యర్థులలో చాలా మంది కంపెనీ లీడర్‌షిప్ టీమ్‌తో చర్చించారు. ఇంటర్వ్యూ కోసం పనిస్థలంను చూడాలనుకున్న అభ్యర్థులు 54 శాతం మంది. ఉద్యోగం మారాలనుకున్న అభ్యర్థులు వేతనం, కెరీర్ వృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని లింక్డ్‌ఇన్ ఇండియా, దక్షిణాసియా డైరెక్టర్ (టాలెంట్ సొల్యూషన్స్ అండ్ లెర్నింగ్ సొల్యూషన్స్) ఇర్ఫాన్ అబ్దుల్లా చెప్పారు. తామున్న కంపెనీలోనే కొనసాగాలనుకున్న నిపుణులు మూడు విషయాలకు ప్రాధాన్యతనిచ్చారు. సవాళ్లకు, నైపుణ్యానికి అవకాశాలు(62 శాతం), పని–జీవితం మధ్య సమతుల్యత(42 శాతం), భవిష్యత్తులో కంపెనీ బాగుంటుందనుకోవడం(37 శాతం) అనేవి ఆ మూడు అంశాలు.

'లవ్ జీహాద్'లో కొత్త మలుపు

ఎన్ఐఎ దర్యాప్తుకు సుప్రీంకోర్టు ఆదేశం



న్యూఢిల్లీ : కేరళ హైకోర్టు కొట్టివేసిన లవ్ జీహాద్ కేసు బుధవారం కొత్త మలుపు తిరిగింది. బాధితుడు చేసిన విజ్ఞప్తిని పరిశీలించిన అత్యున్నత న్యాయస్థానం ఈ కేసును ఒక విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి పర్యవేక్షణలో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) దర్యాప్తుకు ఆదేశించింది. ఈ కేసు విచారణ ప్రక్రియను విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఆర్‌వి రవీంద్రన్ పర్యవేక్షిస్తారని ప్రధాన న్యాయమూర్తి జెఎస్ ఖేహర్ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. దర్యాప్తును పూర్తి చేసిన తర్వాత నివేదికను తనకు సమర్పించాలని న్యాయస్థానం ఎన్ఐఎని ఆదేశించింది. ఎన్ఐఎ నివేదిక, కేరళ పోలీసులిచ్చే సమాచారాన్ని పరిశీలించడంతో పాటు సంబంధిత మహిళతో మాట్లాడిన పిదప ఈ కేసులో ఒక అభిప్రాయానికి వస్తామని జస్టిస్ డివై చంద్రచూడ్‌తో కూడిన ఈ ధర్మాసనం స్పష్టం చేసింది. దర్యాప్తు వివరాలను ఎన్ఐఎతో పంచుకోవాలని కేరళ పోలీసులను ఈ నెల 10న సుప్రీంకోర్టు ఆదేశించింది. మరోవైపు ఎన్ఐఎ ఇటీవల కాలంలో కొన్ని లవ్ జీహాద్ కేసులను దర్యాప్తు చేసింది. ఐసిస్‌లో చేర్పించేందుకు మహిళలను సిరియాకి పంపుతున్నారనే విషయాన్ని దర్యాప్తు సంస్థ తెలిపింది. కాగా, కేరళ వాసి షఫిన్ జహాన్ తన వివాహాన్ని కేరళ హైకోర్టు రద్దు చేయడాన్ని సవాలు చేయడంతో ఈ కేసు సుప్రీంకోర్టుకు చేరుకుంది. కేరళ హైకోర్టు తన తీర్పు సందర్భంగా ఇలాంటి (లవ్ జీహాద్) కేసులను దర్యాప్తు చేయాలంటూ రాష్ట్ర పోలీసులను ఆదేశించింది. జహాన్ గతేడాది డిసెంబరులో ఒక హిందూ మహిళను వివాహం చేసుకున్నాడు.

జన్మత: హిందువైన సదరు మహిళ ఇస్లాంను స్వీకరించి జహాన్‌ను వివాహం చేసుకుంది. అయితే ఈ వివాహం దేశంలోని మహిళల స్వాతంత్ర్యానికి భంగకరమని పేర్కొంటూ కేరళ హైకోర్టు రద్దు చేసింది. సిరియాలోని ఉగ్రవాద సంస్థ, ఇస్లామిక్ స్టేట్ యంత్రాంగం ఆమెను నియమించిందని, జహాన్ తొత్తు మాత్రమేనని కోర్టు వ్యాఖ్యానిస్తూ ఈ మేరకు తీర్పునిచ్చింది. మత మార్పిడికి, ఇస్లాం తీవ్రవాదీకరణకు ఒక సమర్థవంతమైన, సులువైన క్రమబద్ధ యంత్రాంగం ఉందని మహిళ తండ్రి కెఎం అశోకన్ ఆరోపించారు.

సిట్ నిర్ణయంపై పర్యవేక్షక కమిటీ

సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసు తదుపరి విచారణ నవంబరు 28కి వాయిదా

న్యూఢిల్లీ: 1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసుకు సంబంధించిన 199 కేసులను మూసివేయాలన్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నిర్ణయాన్ని పరిశీలించడానికి సుప్రీంకోర్టు బుధవారం ఒక పర్యవేక్షక కమిటీని నియమించింది. ఈ కమిటీలో ఇద్దరు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు సభ్యులుగా ఉంటారు. అంతేకాక ఈ ఘటనకు సంబంధించి అదనంగా మరో 42 అల్లర్ల సంబంధిత కేసుల మూసివేతకు సిట్ తీసుకున్న నిర్ణయాన్ని కూడా పరిశీలించాలని ఆ కమిటీని జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని సుప్రీంకోర్టు బెంచ్ ఆదేశించింది. దీనికి సంబంధించి మూడు వారాల్లో నివేదికను అందజేయాలని కోరింది. ఈ కేసు తదుపరి విచారణను నవంబరు 28కి వాయిదా వేసింది. సిక్కు వ్యతిరేక అల్లర్ల ఘటనకు సంబంధించిన 199 కేసుల తాలూకూ దస్త్రాలను తనకు సమర్పించాలని ఈ ఏడాది మార్చి 24న కేంద్ర ప్రభుత్వాన్ని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. కేంద్ర హోం శాఖ నియమిత సిట్ ఈ కేసులను మూసివేయాలని నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు పర్యవేక్షక కమిటీని నియమిస్తూ ఆదేశాలు జారీ చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

కశ్మీర్‌లో ఎన్ఐఎ సోదాలు

న్యూఢిల్లీ/శ్రీనగర్: వేర్పాటువాదులు, ఇతరులపై దాఖలైన ఉగ్రవాద సంస్థలకు ఆర్థిక సాయం కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) జమ్ము–కశ్మీర్‌లోని సుమారు 12 చోట్ల బుధవారం సోదాలు చేపట్టింది. శ్రీనగర్, బారాముల్లా, హంద్వారాల్లోని 12 చోట్ల ఈ సోదాలు చేశామని ఎన్ఐఎ అధికారులు తెలిపారు. ఈ కేసులో తాము విచారిస్తున్న వ్యక్తులకు ఈ ప్రాంతాలతో సంబంధాలు ఉన్నాయని వారు చెప్పారు. ఉగ్రవాదులకు ఆర్థిక సాయం, కశ్మీర్ లోయలో అలజడులకు ఆజ్యం పోసే దిశగా విద్రోహ కార్యకలాపాలకు పాల్పడిన అభియోగాల కింద ఈ కేసులో జులై 24న ఏడుగురిని ఎన్ఐఎ అధికారులు అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. జమ్ము–కశ్మీర్‌లో వేర్పాటువాద, ఉగ్రవాద కార్యకలాపాలను చేపట్టడానికి నిందితులు నిధులను సమీకరిస్తున్నట్లు దర్యాప్తు సంస్థ అభియోగించింది.

విశ్రాంత ఉద్యోగుల శాశ్వత అటెండెంట్ భృతి పెంపు

న్యూఢిల్లీ: విశ్రాంత ఉద్యోగులకు ప్రతినెలా అందిస్తున్న శాశ్వత అటెండెంట్ భృతిని రూ.4500 నుండి రూ.6750కి పెంచుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. వందశాతం వైకల్యమున్న విశ్రాంత ఉద్యోగికి కనీసం మూడు నెలలకోసారి శాశ్వత అటెండెంట్ సేవలు అవసరమవుతాయని ఒక సమర్థాధికార వైద్య సంస్థ దృక్కోణంలో ఆలోచించి ఈ పెంపును మంజూరు చేస్తున్నట్లు కేంద్ర సిబ్బంది, ప్రజా సమస్యల, పింఛన్ల శాఖ ఇటీవల విడుదల చేసిన ఒక అధికారిక ఉత్తర్వులో పేర్కొంది. ఏడో కేంద్ర వేతన సంఘం సిఫార్సుల మేరకు ఈ భృతి పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకుంది. ఈ పెంపు జులై 1, 2017 నుండే అమల్లోకి వస్తుంది. విశ్రాంత వికలాంగ ఉద్యోగులకు ఇప్పటికే అందిస్తున్న వికలాంగ పించనుకు అదనంగా ఈ శాశ్వత అటెండెంట్ భృతిని ఇస్తున్నారు.

బెంగళూరులో 'ఇందిర క్యాంటీన్'లు

- రాహుల్ చేతుల మీదుగా ప్రారంభం
- రూ.5కే అల్పాహారం, రూ.10కి భోజనం



బెంగళూరు: పేదల క్షుద్బాధను తీర్చడానికి ఆహార పదార్థాలను రాయితీపై అందించేలా కర్నాటక ప్రభుత్వం రూపొందించిన బృహత్తర అన్నదాన పథకాన్ని కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ బుధవారం ఇక్కడ ప్రారంభించారు. రూ.5కే అల్పాహారం, రూ.10కి మధ్యా హ్న, రాత్రి భోజనాన్ని అందించే 'ఇందిర క్యాంటీన్'ను ఆయన ఆవిష్కరించారు. అమ్మ క్యాంటీన్ పేరుతో తమిళనాడు ప్రభుత్వం తొలుత ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆ పథకం స్ఫూర్తితో ఇపుడు కర్నాటక ప్రభుత్వం ఆవిష్కరించింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రభుత్వం తన 2017–18 రాష్ట్ర బడ్జెట్‌లో ఇందిర క్యాంటీన్ల ఏర్పాటు గురించి ఒక ప్రకటన చేసింది. తొలుత ఈ పథకానికి నమ్మ క్యాంటీన్ పేరును అనుకున్నారు. కానీ, వచ్చే ఏడాది మొదట్లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాజకీయంగా లబ్ధి పొందడానికి దివంగత ప్రధాని ఇందిర పేరుతో పథకాన్ని ప్రారంభిస్తే బావుంటుందని తమ పార్టీ ఎమ్మెల్యేలు సూచించడంతో సిద్ధరామయ్య పథకం పేరును మార్చారు. బెంగళూరు మహానగర పాలికే (బిబిఎంపి) పరిధిలోని 198 వార్డుల్లో ఈ క్యాంటీన్ల ఏర్పాటుకు బడ్జెట్‌లో రూ.100 కోట్లను కేటాయించారు. పేదల ఆకలిని గుర్తించి ఈ పథకాన్ని ప్రవేశపెట్టినందుకు రాష్ట్ర ప్రభుత్వాన్ని రాహుల్ ఈ సందర్భంగా మెచ్చుకున్నారు. బెంగళూరు నగరంలో ఏ ఒక్కరూ ఆకలితో అలమటించకుండా ఈ పథకాన్ని రూపొందించారని ఆయన ఈ సందర్భం గా చెప్పారు. తొలి విడతగా 101 క్యాంటీన్లను ఆవిష్కరించారు. మిగిలిన 97 క్యాంటీన్లను అక్టోబరు 2న ప్రారంభిస్తామని బిబిఎంపి అధికారులు తెలిపారు.



మళ్లీ పాక్ కాల్పులు

జమ్ము: పాకిస్థాన్ పదే పదే కాల్పుల విరమణ ఒప్పంద ఉల్లంఘనలకు పాల్పడుతూ కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. తాజాగా బుధవారం జమ్మూకశ్మీర్ పూంచ్ జిల్లాలోని నియంత్రణ రేఖా వెంబడి పౌరులు నివసించే ప్రాంతాల్లో, భారత జవాన్ల శిబిరాలపై బాంబుదాడులకు చేసి మరోసారి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. ఇంతకు ముందు కూడా యురి సెక్టార్‌లో జరిపిన బాంబుదాడులకు ఓ ఆర్మీ జవాన్ తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. నియంత్రణ రేఖా వెంబడి పాక్ దళాలు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడం వరుసగా ఇది ఐదో రోజు. ఈనెల 7న పాక్ జరిపిన కాల్పుల్లో హవల్దార్ నరేంద్ర సింగ్ అనే జవాన్ గాయపడి, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఒక ఆర్మీ అధికారి చెప్పారు. ఉత్తరాఖండ్‌లోని హరిపూర్ గ్రామానికి చెందిన ఈ జవాన్‌కు భార్య ఆశా దేవు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అదే విధంగా ఈనెల 12 నుంచి వరుసగా ఐదు రోజుల పాటు పాక్ 9 సార్లు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. ఈ దాడుల్లో ఇద్దరు జవాన్లు, ఒక మహిళ మరణించింది. నలుగురు జవాన్లు మరో మహిళకు గాయాలయ్యాయి. కాగా, బుధవారం ఉదయం 5.34 గంటలకు పూంచ్ సెక్టార్‌లోని ఎల్ఒసి వెంబడి పాకిస్థాన్ ఆర్మీ అధునాతన, మోర్టార్‌లతో దాడులు జరిపిందని రక్షణ ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు. అయితే వారి కాల్పులను భారత జవాన్లు సమర్థవంతంగా తిప్పికొట్టారన్నారు. పూంచ్ జిల్లాలో ఆరు చోట్ల (మన్‌కోటే, బసుని, మెంధార్, మాలిపూర్, ధార్న, పత్రి) పాక్ సైన్యం కాల్పులు, బాంబు దాడులు చేసినట్లు సమాచారం.

బదిలీ రాకెట్టు

న్యూఢిల్లీ: కోరుకున్న చోట బదిలీ చేయించేందుకు లంచం తీసుకున్న కేసులో ఇంటెలిజెన్స్ బ్యూరో అసిస్టెంట్ డైరెక్టర్, ఢిల్లీ పోలీస్ ఇన్‌స్పెక్టర్, మరి ఇద్దరికి సిబిఐ కస్టడీని మరి మూడు రోజులు పొడిగించింది. మొత్తం బదిలీ రాకెట్ కుట్రను ఛేదించేందుకు కస్టోడియల్ ఇంటరాగేషన్ అవసరం అని సిబిఐ చేసుకున్న వినతిని ప్రత్యేక జడ్జి వీరేంద్ర కుమార్ గోయల్ అంగీకరించారు. ఐబి అసిస్టెంట్ డైరెక్టర్ కామేశ్వర్, ఢిల్లీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ బనయ్ సింగ్ మీనాలకు సిబిఐ కస్టడీని పొడగించేందుకు అనుమతించారు. మధ్యవర్తులు రాజన్ కుమార్, అరుణ్ తివారిలకు కూడా కస్టడీని పొడిగించారు. కామేశ్వర్, మీనాలను ఆగస్టు 11న అరెస్టు చేయగా, మధ్యవర్తులను ఆగస్టు 9న నిర్బంధంలోకి తీసుకున్నారు. దర్యాప్తు సమయంలో ప్రైవేట్ వ్యక్తుల నుంచి దాదాపు రూ. 10 లక్షల డబ్బును లంచంగా పుచ్చుకున్నట్లు నిందితులు ఇంటరాగేషన్‌లో ఒప్పుకున్నారని సిబిఐ పేర్కొంది.

వరద బీభత్సం

అసోంలో మృతులు 123, బీహార్‌లో 72

గువాహటి/పాట్నా: అసోం, బీహార్‌లో ఎడతెరిపి లేకుండా వర్షాలకు భారీ వరదలు సంభవించి వందలాది మంది మృతి చెందారు. ఉత్తర బీహార్ ప్రాంతంలోని 14 జిల్లాలపై వరదల ప్రభావం తీవ్రంగా ఉంది. వరద మృతుల సంఖ్య 72 కు చేరినట్లు అధికారులు తెలిపారు. భారీ వరదల్లో గుడిసెలు, రేకుల ఇళ్లు, రోడ్లు కొట్టుకు పోయాయి. పంటలు ధ్వంసమయ్యాయి. బుధవారం వరద ప్రభావిత జిల్లాల్లో ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించారు. కాగా, అసోంలో భారీ వరదలకు గత 24 గంటల్లో 11 మంది మృతి చెందారు. దీంతో అసోంలో వరద మృతుల సంఖ్య 123కు చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాలకు గానూ 24 జిల్లాల్లో వరద ప్రభావం ఉందన్నారు. బీహార్, అసోంలో భారీ వరదలకు ప్రాణ, ఆస్తి నష్టం జరిగింది. భారీ వరదల్లో నష్టపోయిన రాష్ట్రాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని ప్రధాని మోడీ ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు తెలిపారు.









నైజీరియాలో ఆత్మాహుతి బాంబు దాడులు : 28 మంది మృతి

కనో : నైజీరియాలో ఆత్మాహుతి బాంబుదాడులు జరిగాయి. ఈశాన్య నైజీరియాలో నిరాశ్రయులైన ప్రజలు ఉంటున్న శిబిరం ప్రవేశ ద్వారం వద్ద ముగ్గురు మహిళా ఆత్మాహుతి బాంబర్లు తమకు తాము పేల్చుకున్నారు. ఈ ఘటనల్లో 28 మంది మృత్యువాతపడగా, 82 మందికి గాయాలైనట్లు స్థానిక వర్గాలు పేర్కొన్నాయి. బోర్నో రాష్ట్ర రాజధాని మైదుగూరికి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండరారి పట్టణంలో మంగళవారం ఈ దాడులు జరిగాయని జిహాదిస్టులకు వ్యతిరేకంగా పోరాడేందుకు ఏర్పాటు చేసిన నిఘా దళ సభ్యుడు బాబా కురా తెలిపారు. మొదటగా ఒక మహిళా బాంబర్ శిబిరం వెలుపల తనకు తాను పేల్చుకోవడంతో అక్కడ భయానక వాతావరణం ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు వారి దుకాణాలను మూసివేసేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలోనే మరో ఇద్దరు మహిళా బాంబర్లు ఆత్మాహుతికి పాల్పడ్డారు. దీంతో ప్రాణ నష్టం అధికంగా సంభవించిందని కురా చెప్పారు. ఈ దాడులను జిహాదిస్టుల తీవ్రవాద వ్యతిరేక దళ స్థానిక హెడ్ ఇబ్రహీం ధృవీకరించారు. ఈ దాడుల్లో క్షతగాత్రులైన 80 మందిని మైదుగూరి ఆసుపత్రికి తరలించినట్లు ఆయన వెల్లడించారు. ఇదిలా ఉండగా బోకో హారం జిహాదిస్టు గ్రూపు ఈశాన్య నైజీరియాను కేంద్రంగా చేసుకొని కాల్పులు, బాంబు దాడులు, అపహరణలకు పాల్పడుతోంది.

రోహిత్ వేముల మరణానికి ఎవరినీ నిందించలేం: కేంద్రం



న్యూఢిల్లీ: హైదరాబాద్ యూనివర్శిటీ రిసెర్చ్ స్కాలర్ రోహిత్ వేముల మరణానికి ఎవరూ బాధ్యులు కారు. అతడి ఆత్మహత్య పూర్తిగా అతడి స్వంత నిర్ణయం. పైగా అతడు దళితుడు కాదనేందుకు సాక్ష్యాలున్నాయి అని న్యాయమూర్తి ఎ.కె. రూపన్‌వాల్ కమిషన్ రిపోర్టు ఇచ్చినందున ఈ కేసులో ఎవరిపై చర్యలు కూడా చేపట్టనవసరం లేదని కేంద్ర ప్రభుత్వం అభిప్రాయపడింది. న్యాయమూర్తి రూపన్‌వాల్ కమిషన్ రిపోర్టుపై తీసుకున్న చర్యల నివేదికను బుధవారం పార్లమెంటులో ప్రవేశపెట్టారు. 'చర్యలేవి అవసరం లేదు. వేముల ఆత్మహత్యకు పురికొల్పిన పరిస్థితు ల కు తగు ఆధారాలు లేవు, పైగా ఎవరూ అతడి మరణానికి కారణం కాదు' అని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ పేర్కొంది. రోహిత్ వేముల ఓబిసికి చెందిన వ్యక్తి అని, అతడు ఎస్‌సి కాదనేందుకు సాక్ష్యాలున్నాయని జస్టిస్ రూపన్‌వాల్ పేర్కొన్నారన్నారు. అలాంటి ఘట న భవిష్యత్తులో మరోసారి జరగకుండా చూడాలన్న కమిషన్ సిఫారసుల పై చర్యలు చేపడతాం అని మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ పేర్కొంది. విశ్వవిద్యాలయాలలో అతి జరిగితే వినేందుకు యంత్రాంగా న్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. కౌన్సెలింగ్ సెంటర్లను, పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలి. సమాన అవకాశాల విభాగాల ను వివక్షారహిత అధికారుల నేతృత్వంలో నడపాలి. 'హైదరాబాద్ యూనివర్సిటీ సహా అన్ని కేంద్ర యూనివర్సిటీలకు సూచనలు/మార్గ దర్శకాలను జారీ చేయాలన్న యుజిసి విజ్ఞప్తిని అంగీకరించాం' అని చర్యలు తీసుకున్న నివేదిక పేర్కొంది.

ప్రత్యక్ష చర్చలతోనే సమస్యలకు పరిష్కారం : అమెరికా

వాషింగ్టన్ : ప్రత్యక్ష చర్చలు, సంప్రదింపుల ద్వారా దౌత్యపరంగా భారత్, చైనాలు తమ మధ్య సమస్యలను పరిష్కరించుకోవాలని కోరుకుంటున్నట్లు అమెరికా బుధవారం తెలిపింది. లడఖ్‌లోకి చొరబడేందుకు చైనా భద్రతా దళాలు చేసిన ప్రయత్నాన్ని భారత్ సైన్యం సమర్థవంతంగా తిప్పికొట్టిన మరుసటి రోజే అమెరికా ఈ మేరకు ఆకాంక్షించడం గమనార్హం. సిక్కిం సెక్టార్‌లోని డోక్లాం ప్రాంతం వద్ద భారత్, చైనాల మధ్య సైనిక ప్రతిష్టంభన నెలకొన్న నేపథ్యంలో తాజాగా లడఖ్‌లోకి ఆ దేశ దళాలు చొరబడేందుకు విఫలయత్నం చేయడం ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులను మరింత పెరిగేందుకు ఆస్కారం కల్పిస్తోంది. డోక్లాం వద్ద చైనా దళాలు తలపెట్టిన రహదారి నిర్మాణాన్ని భారత సైన్యం అడ్డుకున్నప్పటి నుండి ఇరు దేశాల మధ్య దాదాపు 50 రోజులుగా సైనిక సంక్షోభం కొనసాగుతోంది. 'ఇరు దేశాలు కలిసి కూర్చుని ప్రత్యక్ష చర్చలు జరపాలని మేం ఆకాంక్షిస్తున్నాం' అని అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి హీథర్ నౌయెర్ట్ విలేకరుల సమావేశంలో అన్నారు. డోక్లామ్‌లో సైనిక ప్రతిష్టంభనతో పాటు లడఖ్‌లో భారత్, చైనా సైనిక బలగాల మధ్య తాజాగా చోటుచేసుకున్న ఘర్షణపై అడిగిన ప్రశ్నకు ఆమె పై విధంగా బదులిచ్చారు.

అమెరికా - భారత్ సంబంధాల మెరుగుదలపై చైనా ఆశాభావం

బీజింగ్: భారత, అమెరికాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుచెందడం ప్రాంతీయ శాంతికి, అభివృద్ధికి ఉపయోగకరమని చైనా పేర్కొంది. అటువంటి సఖ్యత ఆ దేశాల మధ్య ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది. ఆ దేశాలు రెండు భారత పసిఫిక్ ప్రాంతంలో సుస్థిరత నెలకొల్పాలని అంగీకారానికి వచ్చినట్లు చైనా పేర్కొంది. ఇందుకు ఉభయ దేశాలకు చెందిన ఇద్దరు మంత్రుల స్థాయి చర్చలను జరపడానికి అవి అంగీకరించాయి. అధ్యక్షుడు ట్రంప్, ప్రధాని నరేంద్ర మోడీ అందుకు అంగీకరించినట్లు వైట్ హౌస్ కూడా తెలిపింది. భారత దేశపు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మోడీతో ట్రంప్ సోమవారం నాడు ఫోన్ సంభాషణ జరిపారు. దాని పట్ల చైనా ఆశాభావం వ్యక్తం చేసింది.

వర్జీనియా హింసాకాండపై వైఖరి మారని ట్రంప్



వాషింగ్టన్: వర్జీనియాలో శ్వేతజాతి ఆధిక్యతను సమర్థించే ర్యాలీలో జరిగిన హింసాకాండకు ర్యాలీ నిర్వాహకులను, నిరసనకారులను తప్పుపట్టిన ట్రంప్ తన వ్యాఖ్యను మంగళవారం సమర్థించుకున్నారు. ఎప్పుడూ ఓ ఘటనకు రెండు కోణాలు వుంటాయని అన్నారు. ఇంతకు ముందు వర్జీనియా ర్యాలీపై చేసిన వ్యాఖ్యలకు తిరిగి ఆయన కట్టుబడ్డారు. ఆ హింసాకాండలో ఒక మహిళ మరణించింది. దానిపట్ల ట్రంప్ సరిగా స్పందించకుండా జాత్యహంకారాన్ని సమర్థించారని వ్యాఖ్యలు వచ్చాయి. ట్రంప్ జాత్యహంకారాన్ని సమర్థిస్తున్నారంటూ న్యూయార్క్‌లో నిరసన ప్రదర్శనలు కూడా జరిగాయి. ఆ తరువాత కూడా ఆయన తన తొలి వ్యాఖ్యకు కట్టుబడుతూ తాజా ప్రకటన చేశారు.

ట్రంప్ తాజా ప్రకటనకు ఇండియన్ – అమెరికన్ల ఖండన

'ఇరు పక్షాలది బాధ్యత' అంటూ వర్జీనియా హింసాకాండపై ట్రంప్ చేసిన తాజా ప్రకటనను ఇండియన్ అమెరికన్లు ఖండించారు. చార్లట్స్‌విల్లీ ఘటనలో నియో నాజీలను సమర్థించడాన్ని సిగ్గు చేటుగా వారు పేర్కొన్నారు. ఆ హింసాకాండలో 19 మంది గాయపడ్డం కూడా జరిగిందని విమర్శకులు గుర్తు చేస్తూ ట్రంప్ వైఖరి జాత్యహంకారులను సమర్థించేదిగా వుందన్నారు. ఆ ర్యాలీకి నిరసనగా జరిగిన ర్యాలీపై నియో నాజీలు విరుచుకుపడ్డారని వారు విమర్శించారు.

భారతీయ యువకుడిని బేస్‌బాల్ బ్యాట్‌తో కొట్టిన దుండగులు

మెల్‌బోర్న్: భారత సంతతికి చెందిన వాడుగా భావిస్తున్న 25 ఏళ్ల యువకుడు న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్ నగరంలో తీవ్రంగా దాడికి గురయ్యాడు. అతడిని బేస్ బాల్ బ్యాట్‌లో దారుణంగా కొట్టినట్లు, అతని పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నట్లు మీడియా వార్తలు తెలుపుతున్నాయి. మంగళవారం రాత్రి 10.20 గంటలకు తీవ్రంగా కొట్టి టకానినిలోని ఒక ఫుట్‌పాత్‌పై దుండగులు వదిలి వెళ్లినట్లు పోలీసులు చెప్పారు. అతడి కుటుంబాన్ని సంప్రదించడానికి అతడి వివరాలను స్థానికులను అడిగి పోలీసులు సేకరిస్తున్నారు. ప్రస్తుతం అతడు ఆక్లాండ్‌లోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దాడి వివరాలు పూర్తిగా తెలియలేదు.

భారతీయుల సేవ అనన్యం

వాషింగ్టన్: భారత అమెరికా సంబంధాల భవిష్యత్తుపట్ల అధ్యక్షుడు ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు. తమ దేశానికి ఆకృతి ఇవ్వడంలో ఇండియన్ అమెరికన్ ప్రజల సేవలను ఆయన భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా చికాగోలో జరిగిన ప్రదర్శనకు శుభాకాంక్షలు తెలుపుతూ ప్రశంసించారు. ప్రజాస్వామ్యం, పరస్పరం భద్రత విలువలను గౌరవించుకోవడం ద్వారా ఇరు దేశాలు తమ మైత్రిని పెంపొందించుకున్నాయని ఆ సందేశంలో ట్రంప్ పేర్కొన్నారు.

మిశ్రమ సంస్కృతి పరిరక్షణే ధ్యేయం


❏ నేడు ప్రముఖులతో శరద్ యాదవ్ కీలక భేటీ ❏ మన్మోహన్, రాహుల్, అఖిలేశ్, వామపక్ష నేతలు హాజరు



న్యూఢిల్లీ : జెడి(యు) అసమ్మతి నేత శరద్ యాదవ్ రాజకీయంగా తన బలమెంతో తెలుసుకునే ప్రయత్నంలో భాగంగా నేడు ఒక కీలక సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. మిశ్రమ సంస్కృతి పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న ఈ సమావేశానికి మన్మోహన్ సింగ్, రాహుల్‌గాంధీ, అఖిలేశ్ యాదవ్, సీతారాం ఏచూరి సహా విపక్ష పార్టీలకు చెందిన అగ్ర నాయకులు హాజరయ్యే అవకాశముంది. కాంగ్రెస్, వామపక్షాలు, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి), బిఎస్‌పి, టిఎంసితో పాటు బిజెపిని వ్యతిరేకించే ఇతర పార్టీల అగ్ర నాయకులకు ఇప్పటికే ఆహ్వానం అందినట్లు తెలిసింది. బిజెపితో దోస్తీ కడుతూ పార్టీ చీఫ్ నితీశ్ కుమార్ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శరద్ యాదవ్ తనకున్న బలాన్ని అంచనా వేసుకోవడానికే ఈ భేటీని నిర్వహిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సమావేశానికి ఎవరెవరు హాజరవుతారన్న విలేకరుల ప్రశ్నకు, విపక్షాల నుండి దాదాపు అందరూ హాజరవుతారనే విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. 'మిశ్రమ సంస్కృతి' రాజ్యాంగ ఆత్మ అని, అయితే నేడు దానిని దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. అందువల్ల ఇలాంటి సమావేశాలను దేశవ్యాప్తంగా నిర్వహిస్తామని శరద్ చెప్పారు. బిజెపితో బీహార్ సిఎం నితీశ్ కుమార్ దోస్తీని వ్యతిరేకించడంపై అడిగిన ప్రశ్నలకు సమాధానమివ్వడానికి ఆయన విముఖత వ్యక్తం చేశారు. తన పార్టీ బలహీన విపక్ష కూటమిగా ఉన్న సమయంలో కొన్ని వారాల ముందే ఈ భేటీ నిర్ణయాన్ని తీసుకున్నామని ఆయన చెప్పారు. దేశంలోని 125 కోట్ల మంది భారతీయుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకునే ఈ మిశ్రమ సంస్కృతి పరిరక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా రైతుల ఆత్మహత్యలతో పాటు దళిత విద్యార్థి రోహిత్ వేముల ఆత్మహత్య, జెఎన్‌యు విద్యార్థి నజీబ్ అహ్మద్ అదృశ్య ఘటనలను కూడా శరద్ ప్రస్తావించారు. మరోవైపు దుష్ట శక్తుల సమూహాన్ని విడిచిపెట్టాలని తమ పార్టీ అసమ్మతి నేత శరద్ యాదవ్‌కు జెడి(యు) సూచించింది. పరోక్షంగా లాలూ నేతృత్వంలోని ఆర్‌జెడికి చురక అంటించింది. నేటి శరద్ సమావేశానికి లాలూ పార్టీ హాజరవుతున్న నేపథ్యంలో జెడి(యు) ఇలాంటి ప్రకటన చేయడం గమనార్హం.


దేనికైనా ఒప్పిస్తారా?

బ్లూవేల్ గేమ్ తరహాలో మారొద్దు : సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: 'బ్లూవేల్ గేమ్' వంటి ఇంటర్నెట్ ఆటలా మనుషుల్ని దేనికైనా ఒప్పించేస్తున్నారని సుప్రీంకోర్టు బుధవారం అభిప్రాయపడింది. బ్లూవేల్ గేమ్ అనేది ఓ రాక్షస క్రీడ. ఆ ఆట అడ్మినిస్ట్రేటర్ చెప్పినట్లు 50 రోజుల్లో అనేక విపరీత పనులు చేయాల్సి ఉంటుంది. చివరికి ఆత్మహత్య చేసుకోవలసి రావొచ్చు. ప్రతి పని ముగించాక ఫోటోలు తీసి ఇంటర్నెట్ ద్వారా పంపాల్సి ఉంటుంది. ప్రాణాలకు తెగించే ఆటకు ఒప్పించినట్లుగానే నేడు దేనికైనా మనుషుల్ని ఒప్పిస్తున్నారని ప్రధాన న్యాయమూర్తి జె.ఎస్.ఖేహర్, న్యాయమూర్తి డి. వై. చంద్ర చూడ్‌తో కూడిన ధర్మాసనం పేర్కొంది. కేరళకు చెందిన ఓ ముస్లిం వ్యక్తి, హిందూ అమ్మాయిని ఇస్లాం మతంలోకి మార్చుకుని పెళ్లి చేసుకున్న కేసు విచారణకు వచ్చినప్పుడు ధర్మాసనం ఈ వ్యాఖ్యానం చేసింది. ఇదే రోజు ఇంటర్నెట్ కంపెనీలైన గూగుల్, ఫేస్‌బుక్, యాహు, తదితరాలకు బ్లూవే గేమ్ లింకులు ఇవ్వకుండా ఆదేశాలు ఇవ్వాలని ఢిల్లీ హైకోర్టులో ఓ పిల్ దాఖలు అయింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ వ్యాఖ్యానం చేసింది. పిటిషనర్ షఫీన్ జహాన్ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదిస్తూ ఆ మహిళ ఇష్టపడే పెళ్లి చేసుకుందో లేదో ఆమెతో కోర్టు మాట్లాడి తెలుసుకోవాలన్నారు. ఈ కేసులో కోర్టు అతిగా ఊహించుకుంటోందని, ఆ అమ్మాయి మేజర్ అని, ఆమెకు తానెవరిని వివాహం చేసుకోవాలో నిర్ణయించుకునే అధికారం ఉందని వాదించారు. దానికి కోర్టు 'మేమేమి అతిగా ఊహించుకోవడంలేదు. మేము తప్పకుండా ఆ అమ్మాయితో మాట్లాడతాం. కానీ ఈ దశలో కాదు. మేము ఎన్‌ఐఎ దర్యాప్తు నివేదికను, కేరళ పోలీసులు ఏమి చెప్పారనేది పరిశీలిస్తాం. ఆ తర్వాతే ఆమెతో మాట్లాడతాం' అని స్పష్టం చేసింది. పిటిషనర్ తరపున హాజరైన మరో న్యాయవాది ఇందిరా జైసింగ్ వాదిస్తూ 'ఒకవేళ కోర్టు ఆమెను కలువదలచుకోలేకుంటే, కనీసం ఆమె అఫిడవిట్ దాఖలు చేయడానికైనా స్వేచ్ఛను ప్రసాదించాలి' అన్నారు. దీనికి కోర్టు ప్రతిస్పందిస్తూ 'ప్రతి ఒక్కరూ దర్యాప్తు సక్రమంగా సాగాలనే కోరుకుంటారు. జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్‌ఐఎ) దర్యాప్తును పర్యవేక్షించడానికి సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తిని నియమిస్తాం. ఎందుకంటే కేరళ హైకోర్టు చేసిన కొన్ని రిమార్కులను పరిశీలించాల్సి ఉంది' అని పేర్కొంది. ఓ ముస్లిం వ్యక్తి హిందూ మహిళను పెళ్లాడ్డమన్నది కేరళ చెదరుమదురు ఘటన కాదని, అక్కడ 'క్రమత'(ప్యాటర్న్) అని ఎన్‌ఐఎ పేర్కొంది. ఈ మతాంతీకరణ వివాహాన్ని కేరళ హైకోర్టు 'లవ్ జిహాద్' కింద పరిగణించి రద్దు చేసింది. దీనిపై దర్యాప్తు చేయాలని ఎన్ఎకు సుప్రీంకోర్టు ఆదేశించింది.


త్రిపుర ముఖ్యమంత్రి ప్రసంగంలో రాజకీయాలుంటే తప్పేంటి?



మన తెలంగాణ/న్యూఢిల్లీ: త్రిపుర సిఎం ప్రసంగంలో రాజకీయాలు ఉంటే తప్పేంటని సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రశ్నించారు. బుధవారం ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించిన ఆయన స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా త్రిపుర ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ఆలిండియా రేడియో, ప్రసార భారతిలో ప్రసారం చేయకపోవడాన్ని ఖండించారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు దూరదర్శన్ త్రిపుర సిఎం ప్రసంగాన్ని రికార్డు చేసి ప్రసారం చేయకపోగా, ప్రసంగాన్ని మార్చుకోవాలనడం ఇందిరా గాంధీ కాలం నాటి ఎమర్జెన్సీ పరిస్థితులకన్నా దారుణమని విమర్శించారు. త్రిపుర సిఎం మాణిక్ సర్కార్‌కు లేఖ పంపిన ప్రసార భారతి తీరును ఆయన ఖండించారు. ప్రజలచేత ఎన్నికైన సిఎం ప్రసంగాన్ని ప్రసారం చేయకపోవడం అంటే రాష్ట్రాల హక్కులపై కేంద్రం జోక్యం చేసుకోవడ మే అని సీతారాం ఏచూరి స్పష్టం చేశారు. రా జ్యాంగంలో పొందుపరిచిన సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం వ్యవహరిస్తుందని, బిజెపి యేతర రాష్ట్రాలపై కేంద్రం పెత్తనాన్ని చలాయిస్తుందని ఆరోపణాస్త్రాలు ఎక్కుపెట్టారు. కేంద్రం నియంతృత్వ పోకడతో వ్యవహరిస్తుందని, ఇది దేశానికి మంచిది కాదన్నారు. గతంలో విజయదశమి సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్‌చీఫ్ ప్రసంగాన్ని డిడి లో ప్రసారం చేశారని ఆరోపించారు. హిందుత్వ దేశంగా మార్చేందుకు కేంద్రం ప్రభు త్వం ప్రభుత్వ వ్యవస్థలను ఉపయోగించుకుంటుందని అన్నారు. మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన ప్రసంగంపై మాకు కూడా చాలా అభ్యంతరాలున్నాయని స్పష్టంచేశారు.

పుల్వామా ఎన్‌కౌంటర్‌లో లష్కరే తోయిబా కమాండర్ హతం

శ్రీనగర్: కశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో భద్రతా బలగాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో బుధవారం లష్కరే తోయిబా ఉగ్రవాది హతమయ్యాడు. కాకపోరా ప్రాంతంలో ఉగ్రవాదులు దాక్కున్నట్లు సమాచారం అందడంతో భద్రతా బలగాలు గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. భద్రతా బలగాలతో జరిగిన ఎన్‌కౌంటర్ లష్కరే తోయిబాకు చెందిన జిల్లా కమాండర్ అయూబ్ లెహరి మృతి చెందినట్లు పోలీస్ అధికారి తెలిపారు. లెహరి హతం చేయడం ఉగ్రవాదులపై భద్రతా బలగాలు సాధించిన మరో విజయంగా పేర్కొంటున్నారు.



ఉపరాష్ట్రపతి కార్యదర్శిగా ఐవి సుబ్బారావు

న్యూఢిల్లీ : నూతన ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడుకు కార్యదర్శిగా మాజీ ఐఎఎస్ అధికారి ఐవి సుబ్బారావు బుధవారం నియమితులయ్యారు. మంత్రిమండలి నియామకాల కమిటీ ఆయన నియామకాన్ని ఆమోదించింది. కాంట్రాక్టు బేసిస్‌పై ఐవి సుబ్బారావు కార్యదర్శి పదవిలో రెండేళ్లు కొనసాగనున్నారు. ఈ మేరకు సిబ్బంది, శిక్షణ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సుబ్బారావు 1979 బ్యాచ్ ఐఎఎస్ అధికారి. ఆగస్టు 2015లో ఆయన సర్వీసు నుంచి పదవీ విరమణ పొందారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి రూ.24 లక్షల పరిహారం

మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ తీర్పు

న్యూఢిల్లీ : వాహన ప్రమాదంలో 75 శాతం మేర ఎడమకాలి వైకల్యాన్ని పొందిన ఒక ద్విచక్రవాహన చోదకుడికి రూ.24లక్షలకు పైగా నష్టపరిహారం చెల్లించాలంటూ మోటారు యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ (ఎంఎసిటి) తీర్పునిచ్చింది. గతేడాది రిపబ్లిక్ డే రోజున ఇక్కడ డిఎన్‌డి రహదారిలో మోటారుసైకిలుపై మరో ఇద్దరిని ఎక్కించుకుని ప్రయాణిస్తున్న బాధితుడు మహ్మద్ అమీర్‌ని ఒక టాటా సుమో వాహనం ఢీకొంది. బాధితుడికి రూ.24,35,816 నష్టపరిహారం చెల్లించాలని ప్రమాదానికి కారణమైన టాటా సుమో వాహనానికి సంబంధించిన బీమా కంపెనీ నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌ని ఎంఎసిటి ప్రధాన అధికారి (ప్రిసైడింగ్ ఆఫీసర్) రాజీవ్ భన్సాల్ ఆదేశించారు. 'క్లెయిమ్‌దారుడు (అమీర్) తన ఎడమకాలికి సంబంధించి 75 శాతం శాశ్వత వైకల్యాన్ని పొందాడు. అతను మానసిక, శారీరక షాక్‌కు గురై ఉంటుంటాడు' అని ట్రిబ్యునల్ ఇటీవల వెలువరించిన తన తీర్పులో పేర్కొంది. బాధితుడు సమర్పించిన ప్రాథమిక సమాచార నివేదిక(ఎఫ్‌ఐఆర్), అభియోగపత్రం (చార్జ్‌షీట్), వైద్య నివేదిక (మెడికల్ రిపోర్ట్), వాహానానికి సంబంధించిన యాంత్రిక పరిశీలనా నివేదికను పరిశీలించిన పిదప అతనికి అనుకూలంగా ఎంఎసిటి తీర్పునిచ్చింది. మరోవైపు బాధితుడు తన వాహనంలో మరో ఇద్దరిని ఎక్కించుకోవడం ద్వారా స్వీయాపరాధ ప్రమాదానికి పాల్పడ్డాడంటూ బీమా కంపెనీ చేసిన వాదన పసలేనిదంటూ ట్రిబ్యునల్ కొట్టిపారేసింది.

ఉపరాష్ట్రపతికి మంత్రుల అభినందనలు



మన తెలంగాణ/న్యూఢిల్లీ: ఉపరాష్ట్రపతిగా ముప్పవరపు వెంకయ్య నాయుడు రాజ్యాంగ ఉన్నత పదవిని అలంకరించిన సందర్భంగా బుధవారం పలువులు కేంద్ర మంత్రులు మరియు ప్రముఖులు ఆయన నివాసంలో కలిసి అభినంద నలు తెలియజేశారు. రోడ్డు రవాణా, జాతీయ రహదారులు మరియు షిప్పింగ్ మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ, మైక్రో, స్మాల్ మరియు మీడియం ఎంటర్‌ప్రైజెస్ మంత్రి శ్రీ కల్‌రాజ్ మిశ్రా, నోబుల్ శాంతి బహుమతి గ్రహీత శ్రీ కైలాశ్ సత్యార్థి మరియు లోక్‌సభ సెక్రటరీ జనరల్ శ్రీ అనూప్ మిశ్రా వీరిలో ఉన్నారు. రైల్వే శాఖ సహాయ మంత్రి శ్రీ రాజన్ గొహైన్, మాజీ కేంద్రమంత్రి శ్రీ అనిల్ శాస్త్రి, సిక్కిం శాశన సభ సభ్యులు శ్రీ సోనమ్ లామా, పార్లమెంటు భద్రతా కార్యదర్శి శ్రీ సందీప్ మిట్టల్, చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ శ్రీ రాధాకృష్ణ మాథుర్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ వరల్ ఎఫైర్స్ డైరెక్టర్ జనరల్ శ్రీ నళిన్ సూరి, డా.వేద్ ప్రతాప్ వేదిక్, శ్రీ జె.ఎస్. రాజపుత్ తదితరులు కూడా ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడును కలిసిన వారిలో ఉన్నారు. రాజ్యసభ ప్రాధాన్యత, పార్లమెంటరీ వ్యవస్థను పటిష్టం చేసేందుకు, సభ ఔన్నత్యాన్ని పెంచేందుకు, సార్థక, నిర్మా ణాత్మక చర్చలు జరిపేందుకు అందరం కలసి కృషిచేద్దామని, ఈ సందర్భంగా తనను కలసిన పలువురు కేంద్రమంత్రులతో వెంకయ్యనాయుడు అన్నారు.

ఎపి పోలీస్ ప్రధాన కార్యాలయం ప్రారంభం




అమరావతి: ఆంధ్రప్రదేశ్ పోలీస్ ప్రధాన కార్యాలయాన్ని (డిజిపి కార్యాలయం) సిఎం చంద్రబాబు నాయుడు బుధవారం ప్రారంభించారు. మంగళగిరిలోని ఎపి ప్రత్యేక పోలీస్ 6వ పటాలం ప్రాంగణంలో ఆరెకరాల విస్తీర్ణంలో ఉన్న స్థలంలో రూ. 40 కోట్ల వ్యయంతో 10 నెలలో ఈ కార్యాలయ భవనాన్ని నిర్మించారు. నాలుగంతస్తుల కార్యాలయ భవనం ఇది. కొండల నడుమ జాతీయ రహదారి16లో 1.10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ భవనం ప్రత్యేకంగా కనిపిస్తుంది. ఒక్కో అంతస్తు 21,200 చ.అడుగులతో ఉంటుంది. గ్రౌండ్‌తో పాటు మొదటి అంతస్తులో సిఐడి కార్యాలయం, రెండు మూడు అంతస్తులలో డిజిపి, ఐజి స్థాయి అధికారుల కార్యాలయాలుంటాయి. ఇక నాలుగో అంతస్తులో డిజిపి కార్యాలయం, పేషీ, సమావేశ మందిరం వగైరా ఉంటాయి. భవన నిర్మాణంలో ఐదు శాతమే గోడలు కాగా, మిగతా 95 శాతం అద్దాలతో నిర్మించారు. ఈ పోలీస్ ప్రధాన కార్యాలయంలోని ఏ గదిలో ప్రవేశించాలన్నా బయోమెట్రిక్ తప్పనిసరి. వేలి ముద్ర వేస్తేనే తలుపులు తెరుచుకుంటాయి. భవనం మొత్తానికి వైఫై సదుపాయం ఉంది. విడియో గోడలు, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం కూడా ఈ కార్యాలయానికి ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన 2014లోనే జరిగినప్పటికీ ఎపి డిజిపి కార్యాలయం గత ఏడాదే విజయవాడకు మారింది. ఇన్నాళ్లు అక్కడి తాత్కాలిక భవనం నుంచే పనిచేస్తూ వచ్చింది. కొందరు సీనియర్ ఐపిఎస్ అధికారులు కూడా విజయవాడకు మారారు. కానీ కొన్ని పోలీసు విభాగాలు అక్కడ సరైన వసతులు లేనందువల్ల ఇప్పటికీ హైదరాబాద్‌లోనే ఉండి పనిచేస్తున్నాయి. అయితే ఇప్పుడు అమరావతిలో ఎపి పోలీస్ ప్రధాన కార్యాలయం పూర్తయినందున మొత్తం ఆంధ్రప్రదేశ్ పోలీస్ యంత్రాంగం అమరావతికి మారుతుంది. ఎపి డిజిపి కార్యాలయం ప్రారంభోత్సవంలో ఉప ముఖ్యమంత్రి(హోం) ఎన్. చిన రాజప్ప, పౌర సరఫరా శాఖ మంత్రి పిపి రావు, డిజిపి(ఇన్‌ఛార్జి) ఎన్. సాంబశివ రావు, విజయవాడ పోలీస్ కమిషనర్ గౌతం సావంగ్, ప్రధాన కార్యదర్శి(హోం) ఎ.ఆర్.అనూరాధ, అదనపు డిజిలు బి. వెంకటేశ్వర రావు(ఇంటెలిజెన్స్), సి.హెచ్.ద్వారకా తిరుమల రావు (సిఐడి), పోలీస్ గృహ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.రాజేంద్రనాథ్ రెడ్డి, ఇతర పోలీస్ సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

భారీ వర్ష సూచన

మన తెలంగాణ/హైదరాబాద్: వచ్చే మూడు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. గురు, శుక్రవారాల్లో రెండు, మూడో చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండగా, శనివారం కూడా రాష్ట్రమంతటా భారీ నుంచి అతి భారీ వర్షం కురుస్తుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ వైకె రెడ్డి తెలిపారు. రాయలసీమ నుంచి దక్షిణ తమిళనాడు వరకు ఉన్న ఆవర్తన ద్రోణి తెలంగాణ మీదుగా దక్షిణ తమిళనాడు తీరప్రాంతం వైపుకు పయనిస్తోంది. ఇది సముద్రమట్టానికి 900 మీటర్ల దూరంలో ఉంది. ఒడిషా, పశ్చిమబెంగాల్ తీరప్రాంతం సమీపంలో ఉపరితల ఆవర్తనం గురువారం ఏర్పడే అవకాశం ఉంది. ఒడిషా నుంచి దక్షిణ తమిళనాడు వరకు కోస్తాంధ్ర, రాయలసీమల మీదుగా మరో ఆవర్తన ద్రోణి పయనిస్తోంది. ఫలితంగా వచ్చే మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా గత 24 గంటల్లో ములుగులో 4 సెంటీమీటర్లు, సుల్తానాబాద్, జులపల్లిలో 2, కరీంనగర్, ఖాన్‌పూర్, మణుగూరు, ఉట్నూరు, గోవిందరావుపేటలో 2 , నందిపేట, జగిత్యాల, ఆలంపూర్, నవీపేట్, మక్తల్, మోర్తాడ్, తిమ్మాపూర్‌లలో 1 సెంటీమీటర్ వర్షపాతం నమోదైంది. బుధవారం నాడు ఖమ్మంలో 34, మహబూబ్‌నగర్‌లో 33.2 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.

ఆ బాలుడు మృత్యుంజయుడు



అమరావతి : ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లాలో మంగళవారం సాయంత్రం ప్రమాదవశాత్తు బోరుబావిలో పడిన రెండేళ్ల బాలుడు మృత్యుంజయుడయ్యాడు. జాతీయ విపత్తు స్పందన దళం, ఇతర బృందాలు పది గంటల పాటు శ్రమించి అర్ధరాత్రి 2.40 గంటల ప్రాంతంలో బాలుడిని విజయవంతంగా బయటకు తీశారు. ప్రస్తుతం ఆ బాలుడు గుంటూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సాధ్యమైనంత తొందరగానే అతన్ని డిశార్జ్ చేసే అవకాశముంది. గుంటూరు జిల్లా వినుకొండ మండలం ఉమ్మడిపాలెం గ్రామానికి చెందిన దంపతుల కుమారుడు చంద్రశేఖర్ (2) మంగళవారం సాయంత్రం ప్రమాద వశాత్తు బోరుబావిలో పడిన విషయం తెలిసిందే. సమాచారం అందుకున్న ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం ఘటనాస్థలికి చేరుకొని పది గంటల పాటు శ్రమించి బాలుడిని సురక్షితంగా వెలికి తీసినట్లు అధికారులు చెప్పారు. ముందుగా బోరుబావికి సమాంతరంగా 30 అడుగుల మేర గొయ్యి తవ్వారు. చిన్నారి బోరుబావిలో 15 అడుగుల లోతులో ఉన్నట్లు గుర్తించారు. ఈ క్రమంలో సమాంతరంగా తవ్విన గొ య్యి వైపు నుంచి బోరుబావికి 22 అడుగుల లోతులో రంధ్రం చేశారు. బాలుడు భయపడకుండా ఉండటానికి బోరుబావిలోకి మొబైల్ ఫోన్‌ను పంపి కుటుంబ సభ్యులతో మాట్లాడించారు. యంత్రాంగం యావత్తు చివరి వరకు వానను లెక్క చేయక చర్యలను చేపట్టింది. డిప్యూటీ కమాండెంట్ మధుసూదన్ రెడ్డి నేతృత్వంలో కొనసాగిన ఈ ఆపరేషన్‌లో మొత్తం 40 మంది సభ్యులగల ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం పాల్గొన్నది. బాలుడిని సురక్షితంగా వెలికి తీసినందుకు బృందాన్ని ఎపి డిప్యూటీ సిఎం ఎన్ చిన రాజప్ప అభినందించారు. కాగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారని ఆ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి కె. శ్రీనివాసరావు పరామర్శించారు.

త్వరలో ధోనీ క్రికెట్ అకాడమీ!



కొలంబో: టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ ఓ క్రికెట్ అకాడమీని ప్రారంభించనున్నాడు. అయితే ఇది భారత్‌లో కాకుండా యూఎఇలో ఏర్పాటు చేస్తున్నాడు. ఇప్పటికే భారత మాజీ క్రికెటర్లు వివి ఎస్.లక్ష్మ ణ్, సౌరభ్ గంగూలీ, వీరేంద్ర సెహ్వాగ్ తదితరులు క్రికెట్ అకాడమీలను ప్రారంభించిన విషయం తెలిసిందే. తాజాగా ధోనీ కూడా వారి బాటలో నడవనున్నాడు. దుబాయ్ పసిఫిక్ స్పోర్ట్స్ క్లబ్‌తో కలిసి సంయుక్తంగా ఈ అకాడమీని ప్రారంభిస్తున్నాడు. అంతేగాక, ఈ అకాడమీకి ధోనీ ప్రచారకర్తగా కూడా వ్యవహరించనున్నాడు. ఈ విషయాన్ని పసిఫిక్ స్పోర్ట్స్ క్లబ్ ప్రతినిధి పర్వేజ్ ఖాన్ తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా పలు నగరాల్లో ధోనీతో కలిసి తాము క్రికెట్ అకాడమీలను ప్రారంభించాలనే లక్ష్యంతో ఉన్నట్టు వివరించారు. కాగా, ధోనీ పేరిట ఈ అకాడమీలను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్టు పేర్కొన్నారు. కాగా, ప్రతి అకాడమీలో కూడా ధోనీకి వాటా ఉంటుందని, అన్నింటిలోనూ అతను యాజమాన్య హక్కులు కలిగి ఉంటాడని పర్వేజ్ తెలిపారు. శ్రీలంకతో వన్డే సిరీస్ ముగిసిన తర్వాత దీనికి సంబంధించి ధోనీ అధికార ప్రకటన చేస్తారని వెల్లడించారు. కాగా, పసిఫిక్ స్పోర్ట్స్‌తో పనిచేయడం చాలా ఆనందంగా ఉందని ధోనీ అన్నాడు. తాము ప్రారంభించే అకాడమీలకు మంచి ఆదరణ లభిస్తుందనే నమ్మకాన్ని ధోనీ వ్యక్తం చేశాడు.

ఈ జోరు సాగాలి ఇలాగే!



మన తెలంగాణ క్రీడా విభాగం

అంతర్జాతీయ టెస్టు క్రికెట్‌లో టీమిండియా రోజు రోజుకు అత్యంత బలమైన జట్టుగా ఎదుగుతుందనడానికి శ్రీలంకపై భారత విజయమే ఓ నిదర్శనంగా చెప్పవచ్చు. గతంలో ఆస్ట్రేలియా, వెస్టిండీస్ జట్లు మాత్రమే ఇలా ఏకపక్ష విజయాలు సాధించేవి. ప్రస్తుతం భారత్ కూడా ఈ రెండు జట్ల బాటలోనే నడుస్తోంది. శ్రీలంకతో జరిగిన మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను టీమిండియా క్లీన్ స్వీప్ చేసిన విషయం తెలిసిందే. భారత్ సాధించిన మూడు విజయాల్లో కూడా సమష్టితత్వం దాగివుంది. గతానికి భిన్నంగా ఒక ఆటగాడిపైనే ఆధారపడకుండా కలిసికట్టుగా పోరాడి భారత్ సిరీస్‌ను సొంతం చేసుకుంది. బౌలింగ్, బ్యాటింగ్ విభాగాల్లో భారత్ సమష్టిగా రాణించింది. బ్యాటింగ్‌లో టాప్ ఆర్డర్‌తో మొదలుకుని టయిలెండర్ల వరకు తమవంతు పాత్ర పోషించారు. బౌలింగ్‌లో కూడా ఫాస్ట్ బౌలర్లు, స్పిన్నర్లు సమష్టిగా రాణించారు. ఇది భారత జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషించిందని చెప్పాలి. ప్రారంభ మ్యాచ్‌లో శిఖర్ ధావన్, కెప్టెన్ విరాట్ కోహ్లిలు అద్భుత ఆటను కనబరిచారు. తర్వాతి మ్యాచ్‌లో అజింక్య రహానె, చటేశ్వర్ పుజారాలు జట్టును ఆదుకున్నారు. చివరి మ్యాచ్‌లో శిఖర్ ధావన్, లోకేష్ రాహుల్, హార్దిక్ పాండ్యాలు జట్టుకు అండగా నిలిచారు. ఇలా ప్రతి మ్యాచ్‌లో ఎవరో ఒకరూ జట్టును ముందుండి నడిపించారు. ఇది జట్టుకు శుభపరిణామంగా చెప్పవచ్చు. గతంలో శ్రీలంక గడ్డపై భారత్‌కు టెస్టుల్లో చేదు అనుభవాలు ఎదురైన విషయం తెలిసిందే. ఈసారి ఆ లోటు ఎక్కడా కనిపించలేదు. పక్కా ప్రణాళికతో బరిలోకి దిగిన టీమిండియా అనుకున్న లక్ష్యాన్ని సాధించింది.

కనీస పోటీ లేకుండానే..

ఈ సిరీస్‌లో భారత్‌కు ప్రత్యర్థి నుంచి కనీస ప్రతిఘటన కూడా ఎదురు కాలేదనే చెప్పాలి. మూడు మ్యాచుల్లో కూడా భారత్ సునాయాస విజయాలే సాధించింది. తొలి రెండు మ్యాచులను నాలుగు రోజుల్లో గెలుచుకున్న టీమిండియా మూడో టెస్టును మాత్రం రెండున్నర రోజుల్లోనే ముగించడం విశేషం. గతంలో ఏ భారత జట్టు కూడా సాధించని అరుదైన రికార్డును ఈసారి టీమిండియా సొంతం చేసుకుంది. శ్రీలంకపై వారి సొంత గడ్డపై క్లీన్‌స్వీప్ చేసిన తొలి భారత జట్టుగా కోహ్లి సేన కొత్త చరిత్ర సృష్టించింది. చివరి మ్యాచ్‌లో రవీంద్ర జడేజా వంటి అగ్రశ్రేణి ఆటగాడు లేకుండానే భారత్ ఇన్నింగ్స్ తేడాతో ఘన విజయం సాధించడం సామన్య విషయం కాదు. అది కూడా లంక సొంత గడ్డపై అంటే మాటలు కాదు. దీన్ని బట్టి భారత జట్టు ఎంత బలోపేతంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ సిరీస్‌లో రోహిత్ శర్మ వంటి అగ్రశ్రేణి ఆటగాడు సైతం పెవిలియన్‌కే పరిమితం కావాల్సి వచ్చింది. ప్రపంచంలోని అత్యుత్తమ బ్యాట్స్‌మన్‌లలో ఒకడిగా పేరొందిన రోహిత్‌కు మూడు టెస్టుల్లోనూ జట్టులో చోటు దక్కలేదు. భువనేశ్వర్ కుమార్, ఇషాంత్ శర్మల వంటి స్పీడ్‌స్టర్లు కూడా బెంచ్‌లకే పరిమితం కాక తప్పలేదు. ఇక జట్టులో ఓపెనింగ్ స్థానం కోసం కెఎల్.రాహుల్, మురళీ విజయ్, శిఖర్ ధావన్‌ల మధ్య ఆరోగ్యకర పోటీ నెలకొంది. అభినవ్ ముకుంద్ కూడా తుది జట్టులో స్థానం కోసం తహతహలాడుతున్నాడు. మరోవైపు టెస్టుల్లో తుది జట్టులో స్థానం కోసం టీమిండియా ఆటగాళ్ల మధ్య ఆసక్తికర పోటీ నెలకొంది.

సమరోత్సాహంతో వన్డేలకు..

టెస్టు సిరీస్‌లో అద్భుతంగా ఆడిన టీమిండియా వన్డే సిరీస్‌కు సమరోత్సాహంతో సిద్ధమైంది. కీలక ఆటగాళ్లందరూ ఫాంలో ఉండడం భారత్‌కు కలిసి వచ్చే అంశం. ఓపెనర్లు రోహిత్ శర్మ, శిఖర్ ధావన్‌లు మెరుపులు మెరిపించేందుకు తహతహలాడుతున్నారు. ఛాంపియన్స్ ట్రోఫీలో అద్భుతంగా ఆడిన వీరిద్దరూ ఈసారి కూడా సత్తా చాటాలనే పట్టుదలతో ఉన్నారు. టెస్టుల్లో తుది జట్టులో చోటు సంపాదించడంలో విఫలమైన రోహిత్ వన్డేల్లో ఓపెనర్‌గా బరిలోకి దిగడం ఖాయంగా కనిపిస్తోంది. రాహుల్‌ను కూడా మిడిలార్డర్‌లో బరిలోకి దించే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయి. ఇదే జరిగితే మనీష్ పాండేకు తుది జట్టులో చోటు దక్కుతుందా లేదా అనేది ఆసక్తి కరంగా మారింది. కాగా, శ్రీలంకపై వన్డేల్లో అద్భుత రికార్డు కలిగిన టీమిండియా ఈసారి కూడా ఆ సంప్రదాయాన్ని కొనసాగించాలని భావిస్తోంది. అంతేగాక ఛాంపియన్స్ ట్రోఫీలో శ్రీలంక చేతిలో ఎదురైన పరాజయానికి బదులు తీర్చుకోవాలనే లక్ష్యంతో ఉంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో టీమిండియా చాలా బలంగా ఉంది. దీంతో కోహ్లి సేన మరో క్లీన్‌స్వీప్ దృష్టి పెట్టింది. ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు ఆదివారం తెరలేవనుంది. అన్ని మ్యాచుల్లో కూడా గెలిచి చరిత్ర సృష్టించాలనే లక్ష్యంతో కోహ్లి సేన వన్డేలకు సిద్ధమవుతోంది. సీనియర్లు రిటైర్మెంట్ ప్రకటించడంతో బలహీనంగా మారిన లంకకు భారత్‌తో సిరీస్ ఓ సవాలుగా మారిందనే చెప్పాలి. ఇప్పటికే టెస్టుల్లో ఘోర పరాజయం చవిచూడడంతో లంక తీవ్ర విమర్శలను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. దీంతో భారత్‌తో జరిగే వన్డే సిరీస్ ఆతిథ్య లంకకు చావోరేవోగా మారిందనడంలో సందేహం లేదు.



ఫిట్‌నెస్‌కే పెద్దపీట : రవిశాస్త్రి

కొలంబో: రానున్న ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకొని తన శిక్షణ కొనసాగుతుందని టీమిండియా ప్రధాన కోచ్ రవిశాస్త్రి అన్నాడు. తాను ఫిట్‌నెస్‌కే అధిక ప్రాధాన్యత ఇస్తానని స్పష్టం చేశాడు. క్రికెట్‌లో ఫిట్‌నెస్ చాలా కీలకమన్నాడు. ఇది ఉంటే అన్ని తాము అనుకున్నట్టు సాగుతాయన్నాడు. ప్రతి క్రికెటర్ ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యత ఇవ్వాల్సిందేనని శాస్త్రి అన్నాడు. కాగా, రానున్న ప్రపంచకప్ నాటికి భారత్‌ను అన్ని రంగాల్లో పటిష్ట పరిచేందుకు కృషి చేస్తానన్నాడు. ప్రపంచకప్‌లో భారత్‌ను బలమైన జట్టుగా బరిలోకి దించడమే తన లక్ష్యమన్నాడు. ఈ దిశగా ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించానని తెలిపాడు. ఫీల్డింగ్ విభాగంలో భారత్‌ను మేటి జట్టుగా తీర్చిదిద్దుతానని వివరించాడు. దీని కోసం ప్రత్యేక ప్రణాళికలు తన వద్ద ఉన్నాయన్నాడు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో టీమిండియా ఇప్పటికే చాలా బలంగా ఉందన్నాడు. ఇక, చేయాల్సిందల్లా ఫీల్డింగ్ విభాగాన్ని పటిష్ట పరచడమేనన్నాడు. ఇప్పటికే టీమిండియాలో చురుకైన ఫీల్డర్లు చాలా మందే ఉన్నారన్నాడు. అయితే జట్టులోని ప్రతి ఆటగాడిని అగ్రశ్రేణి ఫీల్డర్‌గా తయారు చేయడమే తన ప్రధాన లక్ష్యమన్నాడు. ఫిట్‌నెస్‌తో పాటు ఫీల్డింగ్‌లో చురుగ్గా ఉంటే వన్డేల్లో మెరుగైన ఫలితాలు సాధించడం చాలా తేలిక అన్నాడు. గతంలో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ జట్లు ఫీల్డింగ్, ఫిట్‌నెస్ వల్లే ఆధిపత్యం చెలాయించిన విషయాన్ని రవి గుర్తు చేశాడు. ఓ జాతీయ వార్త సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో శాస్త్రి ఈ విషయాలు వెల్లడించాడు.



భారత్‌కు గట్టి పోటీని ఇస్తాం : ఉపుల్ తరంగ

కొలంబో: భారత్‌తో జరిగే వన్డే సిరీస్‌లో మెరుగైన ప్రదర్శన ఇస్తామని శ్రీలంక కెప్టెన్ ఉపుల్ తరంగ ధీమా వ్యక్తం చేశాడు. టెస్టు సిరీస్ ఓటమిని ఓ పీడకల మరచిపోయి వన్డేలకు సమరోత్సాహంతో సిద్ధమవుతున్నట్టు చెప్పాడు. భారత్‌తో జరిగే వన్డే సిరీస్‌కు తరంగను కెప్టెన్‌ను నియమించారు. టెస్టుల్లో తరంగ పేలవమైన ఫాంతో నిరాశ పరిచిన విషయం తెలిసిందే. కాగా, వన్డే సిరీస్‌లో మాత్రం తమ ఆట భిన్నంగా ఉంటుందన్నాడు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో మెరుగైన ప్రదర్శన ఇచ్చేందుకు ప్రయత్నిస్తామన్నాడు. టెస్టుల్లో ఘోర పరాజయం పాలైనా ఈసారి అటువంటి పొరపాట్లకు తావుండదన్నాడు. సమష్టి పోరాటంతో భారత్‌ను ఎదుర్కొంటామన్నాడు. ప్రస్తుతం శ్రీలంక క్రికెట్ క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటుందన్నాడు. ఈ సమయంలో తమకు అండగా నిలువాలని అతను అభిమానులను కొరాడు. టెస్టులతో పోల్చితే వన్డేల్లో తాము మెరుగ్గా ఉన్నామన్నాడు. గతంలో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్‌ను ఓడించిన విషయాన్ని తరంగ గుర్తు చేశాడు. ఈసారి కూడా భారత్‌ను కంగు తినిపించే సత్తా తమ జట్టుకు ఉందన్నాడు.

పాక్ క్రికెటర్‌ను బలిగొన్న బౌన్సర్


లాహోర్: పాకిస్థాన్‌కు చెందిన ఓ యువ క్రికెటర్ బౌన్సర్ దెబ్బకు ప్రాణం విడిచాడు. ఈ దుర్ఘటన పాక్‌లోని మార్డన్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే పాకిస్థాన్ దేశవాళి ట్వంటీ–20 క్రికెట్ టోర్నమెంట్‌లో జుబైర్ అహ్మద్ క్వెట్టా బియర్స్ జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తున్నాడు. పాకిస్థాన్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను భాగంగా జరిగిన ఓ మ్యాచ్‌లో ప్రత్యర్థి బౌలర్ వేసిన బౌన్సర్ జుబైర్ తలకు బలంగా తగిలింది. దీంతో జుబైర్ అక్కడికక్కడే ప్రాణం విడిచాడు. బ్యాటింగ్ చేసే సమయంలో జుబైర్ హెల్మెట్ ధరించి లేదు. ఇది అతనికి ప్రాణాంతకంగా మారింది. ఒకవేళ అతను హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాలు కాపాడుకుని ఉండేవాడని సహచర ఆటగాళ్లు అభిప్రాయపడుతున్నారు. ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉన్న ఓ యువ క్రికెటర్ ఇలా అర్ధాంతరంగా తనువు చాలించడం పలువురిని కలచి వేసింది. ఈ దుర్ఘటన విషయాన్ని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పిసిబి) ట్విట్టర్ ద్వారా వెల్లడించింది. ఇప్పటికైనా క్రికెటర్లు హెల్మెట్లు ధరించి బ్యాటింగ్ చేయాలని, మైదానంలో తమ రక్షణకు సంబంధించి పలు జాగ్రత్తలు తీసుకోవాలని పిసిబి కోరింది. కాగా, బౌన్సర్ భూతానికి గతంలో ఆస్ట్రేలియాకు చెందిన యువ ఆటగాడు ఫిలిప్ హ్యూస్ బలైన విషయం తెలిసిందే. అంతేగాక, భారత మాజీ ఆటగాడు రమన్‌లాంబా కూడా గతంలో ఇదే రీతిలో తనువు చలించాడు.



ఆనందంగా ఉంది : రోహిత్ శర్మ

కొలంబో: భారత జట్టుకు వైస్ కెప్టెన్‌గా ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉందని స్టార్ ఆటగాడు రోహిత్ శర్మ అన్నాడు. శ్రీలంకతో జరిగే వన్డే సిరీస్‌కు తనను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేయడాన్ని అరుదైన గౌరవంగా భావిస్తున్నట్టు చెప్పాడు. తన పదేళ్ల కెరీర్‌లో ఇటువంటి గౌరవం దక్కడం ఇదే తొలిసారన్నాడు. వైస్ కెప్టెన్‌గా కోహ్లికి అన్ని విధాలుగా సహకరిస్తానని తెలిపాడు. శ్రీలంకతో జరిగే వన్డే సిరీస్ తమకు సవాలు వంటిదన్నాడు. టెస్టుల్లో ఓటమితో శ్రీలంక ఆటగాళ్లు కసితో ఉన్నారని, వన్డేల్లో వారు చెలరేగడం ఖాయమన్నాడు. దీంతో సిరీస్ ఆసక్తికరంగా సాగడం ఖాయమన్నాడు. రెండు జట్లలోనూ ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఉన్నారన్నాడు. దీంతో అన్ని మ్యాచ్‌లు నువ్వానేనా అన్నట్టు సాగతాయని జోస్యం చెప్పాడు. కాగా, టెస్టుల్లో తుది జట్టులో చోటు దక్కక పోవడం బాధించలేదన్నాడు. తనకు జట్టు ప్రయోజనాలే కీలకమన్నాడు. ప్రతిసారి తాను జట్టు విజయాన్నే కోరుకుంటానని, దీని కోసం తన స్థానాన్ని సైతం వదులుకునేందుకు సిద్ధంగా ఉంటానని స్పష్టం చేశాడు. ప్రపంచ క్రికెట్‌లో భారత్ చాలా బలంగా మారిందన్నాడు. ముఖ్యంగా టెస్టుల్లో భారత్‌ను ఎదుర్కొవడం ఇతర జట్లకు సవాలుగా మారిందన్నాడు. వరుసగా సిరీస్‌లు గెలుచుకోవడం కొత్త అనుభూతిని ఇస్తుందన్నాడు. కాగా, తన దృష్టంతా లంకతో జరిగే వన్డే సిరీస్‌పై పెడుతున్నట్టు రోహిత్ చెప్పాడు.

కోహ్లి కెప్టెన్సీ అమోఘం : హెడేన్



న్యూఢిల్లీ: భారత కెప్టెన్ విరాట్ కోహ్లి సారథ్య బాధ్యతలను చాలా సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నాడని, అతన్ని చూస్తే రికి పాంటింగ్ గుర్తుకు వస్తున్నాడని ఆస్ట్రేలియా మాజీ దిగ్గజం మాథ్యూ హెడేన్ అన్నాడు. శ్రీలంకతో జరిగిన టెస్టు సిరీస్‌లో కోహ్లి జట్టును నడిపించిన తీరు తనను ఎంతో ఆకట్టుకుందన్నాడు. అతనిని చూస్తే మరో పాంటింగ్‌లా కనిపిస్తున్నాడని తెలిపాడు. పాంటింగ్ కూడా ఇలాగే కసితో జట్టును ముందుకు నడిపించేవాడని హెడేన్ అన్నాడు. కోహ్లి కూడా అదే పద్ధతిలో భారత్‌ను నడిపిస్తున్నాడని ప్రశంసించాడు. కోహ్లి భవిష్యత్తులో పాంటింగ్ కంటే మెరుగైన కెప్టెన్‌గా ఎదగడం ఖాయమన్నాడు. తాను చూసిన ఆటగాళ్లలో కోహ్లి చాలా ప్రత్యేకమైన క్రికెటర్ అని హెడేస్ కొనియాడాడు. అతని హావాభావాలు తనను కట్టి పడేస్తాయన్నాడు. కోహికి ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉందన్నాడు. అతని సారథ్యంలో టీమిండియా ప్రపంచ క్రికెట్‌ను శాసించడం ఖాయమన్నాడు. గతంలో స్టీవ్‌వా, ఇమ్రాన్ ఖాన్, పాంటింగ్‌లు మాత్రమే ఇలా ప్రపంచ క్రికెట్‌ను శాసించిన విషయాన్ని హెడేన్ ఈ సందర్భంగా గుర్తు చేశాడు. కాగా, త్వరలోనే భారత్‌తో ఆస్ట్రేలియా వన్డే సిరీస్‌లో తలపడనుందని, ఈ పోరు కోసం తాను ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నానని హెడేన్ అన్నాడు. కాగా, శ్రీలంకతో జరిగిన టెస్టు సిరీస్‌ను టీమిండియా క్లీన్ స్వీప్ చేయడం గొప్ప విషయమన్నాడు. శ్రీలంకను వారి గడ్డపై ఓడించడం అనుకున్నంతా తేలిక కాదన్నాడు. అయితే కోహ్లి సారథ్యంలో టీమిండియా దీన్ని సాధ్యం చేసిందని ప్రశంసించాడు.

పతకాల పంట ఖాయం: గోపీచంద్

చెన్నై: రానున్న ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత ఆటగాళ్లు పతకాలు పంట పండించడం ఖాయమని జాతీయ కోచ్ పుల్లెల గోపీచంద్ ధీమా వ్యక్తం చేశాడు. ఈ పోటీల్లో భారత్ మంచి ప్రదర్శన ఇస్తుందనే నమ్మకం తనకుందన్నాడు. గతంతో పోల్చితే ఈసారి ఎక్కువ సంఖ్యలో పతకాలు వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయన్నాడు. పివి.సింధు, సైనా నెహ్వాల్, కిదాంబి శ్రీకాంత్‌లు ఈసారి కచ్చితంగా పతకాలు సాధిస్తారనే నమ్మకం తనకుందన్నాడు. ఇటీవల కాలంలో శ్రీకాంత్ పురుషుల బ్యాడ్మింటన్‌లో సంచలన ఆటగాడిగా ఎదిగిన విషయాన్ని గోపీచంద్ గుర్తు చేశాడు. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో అతను మంచి ఫలితాలు సాధించడం ఖాయమన్నాడు. ఒలింపిక్ రజత పతక విజేత సింధు కూడా ఏదో ఒక పతకం గెలుచు కోవడం తథ్యమన్నాడు. ఇక, కిందటిసారి రజతం సాధించిన సైనా ఈసారి కూడా మెరుగైన ఆటను కనబరుస్తుందనే నమ్మకం తనకుందన్నాడు. ప్రపంచ పోటీల్లో భారత్ మెరుగైన ఆటగాళ్లతో బరిలోకి దిగుతుందన్నాడు. ఈ టోర్నీలో పోటీ తీవ్రంగా ఉన్నా భారత్‌కు మంచి అవకాశాలున్నాయని గోపీచంద్ అన్నాడు. బుధవారం చెన్నైలో జరిగిన బ్యాడ్మింటన్ ప్రీమియర్ లీగ్ (బిపిఎల్) ప్రచార కార్యక్రమంలో గోపీచంద్ పాల్గొన్నాడు.



మళ్లీ ఓడిన టైటాన్స్

అహ్మదాబాద్: ప్రొ కబడ్డీలో భాగంగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ పరాజయం చవిచూసింది. ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో గుజరాత్ ఫార్చున్ జెయింట్స్ 29–19 తేడాతో టైటాన్స్‌ను చిత్తు చేసింది. ఈ సీజన్‌లో తెలుగు టైటాన్స్‌కు ఇది ఏడో పరాజయం కావడం విశేషం. ప్రారంభం నుంచే గుజరాత్ దూకుడుగా ఆడింది. చూడచక్కని ఆటతో ప్రత్యర్థిపై పట్టు సాధించింది. స్టార్ ఆటగాడు సచిన్ తన మార్క్ ఆటతో చెలరేగి పోయాడు. అతని దూకుడుతో టైటాన్స్ డీలా పడింది. ఏ దశలోనూ ప్రత్యర్థికి గట్టి పోటీ ఇవ్వలేక పోయింది. మరోవైపు సచిన్ అద్భుత ఆటతో విజృంభించాడు. అతనికి సుకేష్ అండగా నిలిచాడు. అబోజర్, ఫాజెల్ కూడా చక్కటి ఆటతో గుజరాత్‌ను ఆదుకున్నారు. అద్భుతంగా ఆడిన సచిన్ ఏకంగా 11 పాయింట్లు సాధించి జట్టు విజయంలో ముఖ్య భూమిక పోషించారు. సుకేష్ ఏడు, అబోజర్ నాలుగు పాయింట్లు సాధించారు. టైటాన్స్ జట్టులో వినోత్ 4, రాహుల్ చౌదరి మూడు పాయింట్లు సాధించారు.

హర్యానా-తలైవాస్ మ్యాచ్ టై

మరోవైపు హర్యానా స్టీలర్స్, తమిళ్ తలైవాస్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ టైగా ముగిసింది. రెండు జట్లు కూడా నిర్ణీత సమయంలో చెరో 25 పాయింట్లను సాధించడంతో మ్యాచ్ టైగా ముగియక తప్పలేదు.

ప్రారంభం నుంచే రెండు జట్లు కూడా చెలరేగి ఆడాయి. దీంతో పోరు నువ్వానేనా అన్నట్టు సాగింది. హర్యానా జట్టులో సురేందర్ నాడా అత్యధికంగా ఏడు పాయింట్లు సాధించాడు. సుర్జీత్ సింగ్ నాలుగు, వికాస్ మూడు పాయింట్లతో జట్టును ఆదుకున్నారు. తమిళ్ జట్టులో ప్రపంజన్ ఏడు, అమిత్ హుడా ఆరు పాయింట్లు సాధించి మ్యాచ్‌ను టైగా ముగించడంలో కీలక పాత్ర పోషించారు.

పేస్ జోడీకి చుక్కెదురు

సిన్సినాటి: ఇక్కడ జరుగుతున్న ప్రతిష్టాత్మకమైన సిన్సినాటి ఓపెనర్ సదరన్ కప్ టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత స్టార్ లియాండర్ పేస్ జోడీ తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో పేస్–అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) జంట పోరాడి ఓడింది. హోరాహోరీగా సాగిన పోరులో స్పెయిన్‌కు చెందిన ఫెల్సియానొ లోపెజ్, మార్క్ లోపెజ్ జోడీ 2–6, 7–6 (7/2), 10–6 ఇండో–జర్మనీ జంటను ఓడించింది. తొలి సెట్‌లో పేస్ జంట విజయం సాధించింది. ప్రారంభం నుంచే చెలరేగి ఆడిన పేస్–జ్వెరెవ్‌లు ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా సునాయాస విజయం సాధించారు. అయితే రెండో సెట్‌లో మాత్రం పోరు హోరాహోరీగా సాగింది. స్పెయిన్ అద్భుత పోరాట పటిమను కనబరుస్తూ ముందుకు సాగింది. ఈ క్రమంలో టైబ్రేకర్ వరకు వెళ్లిన సెట్‌ను సొంతం చేసుకుంది. మూడో సెట్‌లో కూడా పోరు ఉత్కంఠభరితంగా సాగింది. కానీ, కీలక సమయంలో పేస్ జంట ఒత్తిడికి గురైంది. దీంతో వరుస తప్పిదాలకు పాల్పడింది. దీన్ని తనకు అనుకూలంగా మార్చుకున్న స్పెయిన్ జోడీ సెట్‌ను గెలిచి ముందుకు దూసుకెళ్లింది.





కోహ్లి-అనుష్క జోడీ సందడి

కొలంబో: భారత కెప్టెన్ విరాట్ కోహ్లి, అతని ప్రియురాలు, బాలీవుడ్ నటి అనుష్క శర్మ శ్రీలంకలో సందడి చేస్తున్నారు. టెస్టు సిరీస్ ముగిసిన తర్వాత కాస్త విరామం దొరకడంతో ప్రేమపక్షులు అనుష్క, కోహ్లిలు లంకలో షికార్లు, విందు వినోదాలతో బీజీగా మారిపోయారు. ఇద్దరు కలిసి లంకలోని పలు పర్యాటక స్థలాలను చుట్టేస్తున్నారు. ఈ సందర్భంగా వీరిద్దరూ కలిసి దిగిన ఫొటోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. భారత ప్రధాన కోచ్ రవిశాస్త్రితో కలిసి కోహ్లి, అనుష్కలు ఓ హోటల్‌లో అభిమానులతో ఫొటోలు దిగారు. దీన్ని కోహ్లి ట్విటర్‌లో పోస్ట్ చేశాడు. కాగా, గతంలో వెస్టిండీస్ పర్యటన ముగిసిన తర్వాత కూడా కోహ్లి, అనుష్కలు అమెరికాలో సందడి చేసిన విషయం తెలిసిందే.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.